

# నిర్వికల్ప సంగీతం

చినవీరభద్రుడు

అవ్యక్త పరిమళంలా, రాలే కుసుమదళంలా
సగం గురుతు సగం యిరులు, ఒక భావన
స్వప్నం లోంచి   జాగరణ ప్రథమదశలా
కాలానికి దూరంగా దాచిన మణి ఒక్క క్షణం
అట్టే బలవత్తరం కాదు, కాని మహత్తరం
ఆసన్నమరణంలా విషణ్ణంగా కైసన్నసల్పుతోంది
తెరచిన ద్వారంలోంచి, వెలుగునీడల మధ్యనున్న లోతుల్లోకి
నీహృదయపు చీకటుల అగాధంలో

బైరాగి (నూతిలో గొంతుకలు : 3)



నన్ను కన్న తల్లికి
నా తండ్రిని కన్నతల్లికి
అక్కయ్యకీ,
చెల్లాయిలకీ
కాన్కగా--

వాడ్రేవు చినవీరభద్రుడు

# నిర్వికల్పసంగీతం

(1976–86)

NIRVIKALPA SANGEETAM
(Poetry)
Vadrevu China Veerabhadrudu
March 1986
First Edition : 500
Price : Rs. 10/-
For Copies :
Smt. V.V.LAXMI, 'SEFALIKA'
70-7-7/1 Nalanda Hostel Road, Kakinada.


Cover : A mother goddess seated in paryankasana holding probably a lotus in the raised right hand and the left hand broken. Makuta, prominent earrings, channaveera running between the prominent breasts are other features. A boy standing beside right lg. a symbol of bond, affection, love and life cycle.

A $17^{th}$ century Brick-made found at Korukonda.

Courtesy : RALLABANDI SUBBARAO MUSEUM, RJY.
Exhibit Photographed by : SARIDE SATYA BHASKAR
Title work : CHATTI HANUMANTA RAO
Printed at :
PRINTO FINE

Rajahmundry

Acknowledgements to the Directorate of A P information and cultural affairs, for granting publication aid Rs.1800/-



Jesus said, I am the resurrection, and the life, he that believeth

in me, though he were dead, Yet shall he live

JOHN 11 : 25

స్వప్నాల్ని పంజరంలో దాస్తావు.
అది పిచ్చి.
వసంతం వెర్రిదానిలా పంజరం చుట్టూ గోల చేస్తుంటే
స్వప్నాలు కోయిలలై పాడతాయి
స్వప్నాల్ని దాచగలం
స్వప్న సంగీతాన్ని మాత్రం అణచలేం

-- 30-4-83

I am terribly morbid than I usually appear to be ...... ఒకప్పుడు నేను స్వాప్నికుడిగా ఉండేవాణ్ణి. అప్పుడు నాకు ఏమీ పట్టేవికావు. రంగురంగుల అల్లికలతో కళల కాంతి పోగులు నా చుట్టూ కదలాడుతుండేవి. తీవ్రమయిన అనుభూతి వివశత్వం ఉండేది. అది చాలాకాలం అలా కొనసాగి ఉన్మాదంలోకి దింపింది. Frenzyness నా ఉన్మాదం నన్ను దారుణమయిన ఎండా చీకటి వుండే తీరంలోకి విసిరేసింది. నా దుఃఖానికి కారణం నా అపరాధాలే అని తెలిసింది. నా kingdom of truth, beauty and goodness కూలిపోయింది. నా దుఃఖం స్వాప్నికమయిన ఆవేదన కాదని, బంధితాత్మ ఆక్రోశమని తెలుస్తుంది. ఈ దుఃఖం పోవాలంటే నేను నిర్దోషిగా నా ఆత్మన్యాయస్థానం ముందు రుజువు కావాలి? కానీ అది సాధ్యమవుతుందా? శిక్ష నుంచి నేను ఎలా తప్పించుకోగలుగుతాను? ఏ దేవుళ్ళూ, ఏ ఆశ్రమాలూ, ఏ సిద్ధాంతాలూ రక్షణ యివ్వవు. మృత తంద్రావహితుడైన లాజరులాగా వున్నాను. ఒక మంగళధ్వని కోసం ఎదురు కాస్తూ. ఎవరో జీసస్ నా కోసం కన్నీళ్ళు పెట్టుకున్నప్పుడు, పరిపూర్ణమైన విశ్వాసంతో పిలిచినప్పుడు అప్పుడు మాత్రమే నేను తిరిగి అసత్ నుంచి సత్యంలోకి చీకటిలోంచి వెలుగులోకి వస్తాను. మృత్యువు నుంచి నన్ను అమృతత్వం వైపుగా తీసుకుపోయే ఆ కంఠం నాలో ఉందో... కాని ఈ వుద్వేగంలో, యీ imprisonment లో నువ్వు నా ముఖంపై చూసే కన్నీళ్ళ వెనుక ఎక్కడో లోతుల్లో నా ఆత్మదీపం నిశ్చలంగా, దేదీప్యమానంగా వెలుగుతూనే వుంటుంది.

విఫల మానవావేదనల విస్తృతార్ణవ తీరం నుంచి
పిలుస్తున్నాను నేను, నా గీతం వినబడుతోందా నీకు?

ప్రతి యుగంలోనూ ప్రతి కవీ ప్రతిసారీ ఈ ప్రశ్న వేసుకుంటున్నాడు. కవిత్వమంటే ఏమిటి? ఎందుకు? ఎవరికోసం – పరమోన్నత గీతాన్ని పాడిన హీబ్రూ ప్రవక్త. ఏ పూలగుత్తిలోనూ లేకుండాపోయిన అసలయిన పువ్వుకోసం వెతుక్కున్న మలార్మే మనిషిని తోటి మానవసమాజంలో కలపడం కోసం నగ్నంగా తిరిగి పాటలు పాడిన బీట్నిక్కులు, ఆఫ్రికాలో, వియత్నాంలో, క్యూబాలో, పెరూలో సాంఘిక అసమ్మతి గీతాలు పాడిన విప్లవకవులూ– ఈ ప్రశ్నలు తమని వేధించకుండా ఏ కవీ తన మౌలికమైన ఆవేదనని పాడలేకపోయాడు. కారణం ఒక్కటే. ఏ కవీ తన మనుష్యసమాజం నుంచి వేరు కాదు. తక్కిన ప్రపంచానికి తెలియందీ, అనుభవంలోకి రానిదీ ఇంతదాకా ఏ కవీ పాడలేదు. ఏ విశిష్టత కవి వాక్యాన్ని రసాత్మకం చేస్తుందో, అది మొత్తం మానవ జీవితానుభవానికే చెందిన విశిష్టత కనుకనే బైరాగి అన్నట్లుగానే ప్రతి కవీ అనుకుంటాడు.

నా గీతం చేరకపోవచ్చు నిన్ను, ఐనా పిలువకతప్పదు.

ఒక ఆదిమ జీవితాభినివేశమే యీ పని చేయిస్తుంది. తొలినాళ్ళలో సామూహిక నృత్యాల మధ్య, వేటల్లో, ఉత్పత్తి కార్యకలాపాల్లో ఏం పలికినా అది కవిత్వమయ్యేది. అది గణమంతటిల్లోనూ వ్యాపించి, వాళ్ళని కుదిపి, మంత్రంలా పని చేసింది. అప్పుడు ప్రత్యేకమైన కవీ లేడు, ప్రత్యేకమైన పాఠకుడూ లేడు, తననుంచి తను వేరయిపోయి, జీవితం శాపంగా కన్పించే వైమనస్యం జీవితంలో లేదు. కనుక కవిత్వంలోనూ లేదు. కాని, ఇప్పుడు ఈ ఆధునిక సమాజంలో ఇంత Fragmentation మధ్య, మనిషికీ మనిషికీ మధ్య కుడ్యాలు బలపడ్డ వేళ కవిత్వం భవిష్యత్తుని గూర్చిన మన ఆందోళన నిజానికి మన జీవిత భవిష్యత్తు గూర్చిన ఆందోళనే.

2

కవి సమాజం నుంచి వేరు పడటానికి ముందే మనిషే వేరుపడి పోయాడు. శ్రమకి దూరంగా ఉండటమంటే ఋతువులకి దూరంగా ఉండటమే అని రాస్తాడు ఖలీల్ జీబ్రాన్. తన శ్రమకీ, శ్రామిక విధానానికీ, ఫలితాలకీ -- పరాయి కావడం మొదలు పెట్టగానే, మనిషి, తన చైతన్యంలోని ఒక సాంఘికమయిన భావానికి కూడా అపరిచితుడు కావడం మొదలుపెట్టాడు. అంతదాకా ఈడెన్ ఉద్యానవనంలో ఆది స్త్రీ పురుషులు స్వేచ్ఛగా, నిర్భయంగానే తిరిగారు. కాని నిషిద్ధఫలం వాళ్ళని సర్వేశ్వరుడి నుంచే దూరం చేసింది. ఆయన్ను చూస్తే సిగ్గుపడాల్సి వచ్చింది. తన essential nature పరాయి కావడంతోటే మనిషి తన పక్కమనిషికి కూడా పరాయివాడయిపోయాడు. ఈ పరాయీకరణమే కవిని సృష్టించింది.

ఇవాళ ఇక్కడ ఇంత సంక్లిష్టమయిన సాంకేతికమయిన ఆధునిక జీవిత వాతావరణంలో తన బాధనో, ఆనందాన్నో పాటగా పాడుకొనే కవి కన్నా ఏకాకి ఎవరూ కన్పించరు. కాని వాస్తవానికి ఈ జీవిత క్షేత్రం పైని, అసలు మనిషి ముఖచిత్రమే అంత ఆగంతుకంగానూ, సుదూర జ్ఞాపకంగానూ కన్పిస్తోంది. ఆదిమ మానవుడి కవిత్వానికి ఈ విషాదం తెలియదు. అదంతా ఒక ఉత్కృష్టమయిన ప్రార్థన, పురాణ ప్రతీకలు, భయాల నీడలు, అభద్రతతో కూడిన ఆందోళన కదలాడే జీవితానంద వ్యక్తీకరణ. కానీ తర్వాత కాలంలో, కవిత్వం, ఇంతదాకా ఆధునిక కవిత్వంగా మనం గుర్తిస్తున్నది, దాని unrest, ప్రశ్నించే స్వభావం, కొత్తదనం, వీటిని మించి మౌలికంగా దేశకాలాల సంబంధాల్లేకుండా కవిత్వంగా appeal అవుతున్నదంతా – ఏమిటి, ఎందుకు అలరిస్తోంది -- అని ఆలోచించినప్పుడు -- జీవితం గూర్చి చింతన కూడా అనివార్యమవుతోంది. జీవితం గూర్చిన విచారణ, కొంత దూరం సాగేసరికి సత్యం గురించీ, జ్ఞానం, నీతి గురించి, దేశకాలాల గురించీ, సౌందర్యం గురించీ తపించడం అవుతుంది. నిజమైన కవికన్నా సత్యాన్వేషి ఎవరు? కానీ కవికి -- చిత్రమేమిటంటే -- అసలు రహస్యం తెలుసు. అది గుప్తంగా అతని అస్తిత్వపు లోతుల్లో మంద్రంగా నినదిస్తూనే వుంటుంది. ఇక ఆటను చేసేదల్లా, ఆ సత్యం కలిగిస్తూన్న స్ఫూర్తితో ప్రపంచాన్ని తరచి చూడటం, వెతకడం, లోకంలో ఏవయితే నిజమయిన విలువలని విగ్రహాలుగా కల్పించబడుతున్నాయో వాటిని ప్రశ్నించడం, negate చెయ్యడం, అట్లా ప్రచారక సంఘాల మత్తులోపడి నిద్రాణమవుతున్న మానవసమాజాన్ని తట్టి లేపడం. కాని సత్యం యొక్క

సత్యం గూర్చిన ఎఱుక కవిని శాపంలా వెన్నాడుతుంది, తక్కిన మనుష్య సమాజం ఆ చింతలేమీ పెట్టుకోకుండా తింటో నిద్రపోతో కాలం గడుపుతోంటే కవి ఒక్కడూ తనకోసం తనవాళ్ళ కోసం ఎడారుల్లో, తుఫానుల్లో తిరుగుతుంటాడు. అక్కడ అతనికి సర్వేశ్వరవాణి వినిపిస్తుంది. కాని దాన్ని తక్కిన ప్రజలకి యివ్వడం కోసం ఆటను relentless tormentation కి గురికావల్సి వుంటుంది. ప్రపంచం గూర్చిన సత్యం ఎఱుకపడి కూడా దాంతో at peace వుండగలగడం సాధ్యపడదు. పలాయనం, కృతకశక్తుల పూజనం చేసే తక్కిన మనుష్యుల్తో అతను ప్రేమవల్లా, సంఘీభావం వల్లా తిరస్కారపడి, విభేదపడి ఆత్మహననం కానిచ్చుకొంటూ వుంటాడు. అనుభవాల మథనంలోంచి జనించే హాలాహలాన్ని అతనే స్వీకరించాల్సి వస్తుంది. ప్రపంచం అతన్ని పీడించి, హింసించి, బెదిరించి శోకంలోకి తరిమి తరిమి -- చివరికి అతన్ని అతని పాటనుంచి వేరుచెయ్యడానికే సిద్ధపడుతుంది. ఇలా కవి, ఒక వీరుడిలా, యోగిలా అగ్నిలోంచి నడచి అమృతాన్ని తీసుకురావల్సి వుంటుంది. కాని, ఈ అమృతం అతని కోసం కాదు. మాతృప్రేమ కొద్దీ అమృతాన్ని తెచ్చిన గరుత్మంతుడిలా, దేవతల కోసం ఇష్టపడ్డ స్త్రీని ఒదులుకున్న కచుడిలా, శాపగ్రస్తుడయిన నలుడిలా అతను చివరికంటా తన విషాదాన్ని తనకే మిగుల్చుకోవాల్సి వస్తుంది.

కాని కవి గోథే ఫౌస్ట్ లాంటివాడు. అతనిలో నిర్మలచిత్త అయిన మార్గరెట్ ప్రయత్నపూర్వకంగా చీకటి దారుల్లోకి నడిపించే, తప్పులు చేయించే మెఫిస్టోఫిలిస్ అనుక్షణం కలిసే వుంటారు. కాని ఆ రెండు ప్రవృత్తుల సంఘర్షణనీ అనుభవిస్తూ కూడా దానికి అందకుండా విముక్తుడిగా ఫౌస్ట్ నడిచిపోతూవుంటాడు. డయోనీషియన్ శక్తులు విజృంభించినపుడు అపోలొనియన్ గ్రీకు ఆశ్చర్యపడే వుంటాడు. కాని వాస్తవానికి అపోలొనియన్ సౌకుమార్యమంతా డయోనీషియన్ ప్రకృతిపైని ఒక ఆచ్ఛాదన మాత్రమే. శుక్రుడు ఒకవైపూ, బృహస్పతి ఒకవైపూ నిల్చొని దేవాసుర సంగ్రామం చేయిస్తూంటారు. కాని, యీ struggle, ఇది ఎంత అనివార్యమూ, ప్రాకృతికమూ అయినా దీనికి అందనిదీ చెందనిదీ కూడా ఏదో వుంది. అది ఏదో తెలియకుండానే మనిషి తన జీవితం గురించి ఏం మాట్లాడగలదు? కాని అది తెలియాలంటే, అతను self-conscious గా వుండాలి. తనలోకి చూపు సారించుకోవాలి, వెతుక్కోవాలి, తరచి చూసికోవాలి, తనతో వాదించుకోవాలి, శపించుకోవాలి, దీవించుకోవాలి. ఈ అంతస్సంగ్రామం మొదలవగానే అతను మరింత estrange అయిపోయి ఏకాకి అయిపోతాడు. ఈ ఏకాకత్వం అతణ్ణి మరింత హింసిస్తుంది. కాని ఈ estrange లోనే అతని సాక్షాత్కారం లభిస్తుంది. ఈ సంగ్రామంలో, అన్ని temptations నీ పోరాడి జయించినప్పుడు అతనికి శిలువని మోయగల అర్హత లభిస్తుంది.

తన essential self ని ప్రపంచంలో గుర్తించే ప్రయత్నాలు చేస్తూ మనిషి విగ్రహాలు నిర్మిస్తాడు. దేవుళ్ళని సృష్టిస్తాడు. సత్యం, జ్ఞానం, మంచితనం, సౌందర్యం అట్లాంటి దేవతలు, దేవతారాధన తొలినాళ్ళలో గొప్ప సంరంభంతో జరుగుతుంది. కొంత కల్పన, కొంత వాస్తవం, కొంత సంస్కృతి, కొంత కల, కొంత వేదన -- కాని ఇది ఎంతో కాలం సాగదు. కొత్త గాలులు వీస్తాయి, బలంగా నమ్మకాల పునాదుల్ని ఊపేస్తాయి. దేవుళ్ళు చచ్చిపోతారు. అహంకారం, కలలు, విశ్వాసాలు అన్నీ చెరిగిపోయి గ్లాని మిగులుతుంది. యూరప్ నే తీసుకోండి. దాని ఆధునిక చరిత్ర అంత ఒక బ్లాస్ఫెమీ, రినైజాన్స్ మనిషిని పారలౌకిక భీతి నుంచి భూమ్మీదకు దింపింది. అతణ్ణి స్వతంత్రుడిగా ప్రతిష్ఠించబోయింది. కాని రూసో సరిగ్గా అన్నాడు. మనిషి పుట్టడం స్వతంత్రంగా

పుట్టినా, అన్నిచోట్లా సంకెలలే. పారలౌకికి శక్తుల ఆధిపత్యంనుంచి భౌతిక శక్తుల ఆదిపత్యంలోకి పోయాడు. డేకార్ట్ మనశ్శరీరాల ద్వంద్వత్వం, న్యూటనీయ సూత్రాలు, డార్విసీయ పరిణామవాదం, పారిశ్రామిక విప్లవం, నెపోలియన్, జాతీయవాదం –– ఇవన్నీ మనిషిని ఒక బృహత్ యంత్రంలో మరగా చూపించడం మొదలుపెట్టాయి. కాని యీ యాంత్రికత మీద తిరుగుబాటూ అంత ఉధృతంగానూ వచ్చింది. రొమాంటిక్ ఉద్యమం, బ్రిటిష్ అనుభవవాదమూ, హేతువునీ, ఇంద్రియ జ్ఞానాన్ని అద్భుతంగా సమన్వయం చేసిన కాంట్, ఆ ప్రయత్నాలు స్పష్టతకి చేరుకున్న హెగెల్, హెగెల్ తల్లకిందులుగా చూపుతున్న వాస్తవాన్ని సరిగ్గా నిలబెట్టిన మార్క్స్, సృజనాత్మకతని elan vital గా గుర్తించిన బెర్గ్సన్, సంకల్పాన్ని నొక్కి చెప్పిన షోపెన్ హూవర్, ప్రాధమికంగా మనిషికి కలిగిన ఈశ్వర వియోగాన్ని విచారించిన కిర్క్ గార్డ్– ఇలా పంతొమ్మిదో శతాబ్ది మహా నిర్మాణాలతోయాంత్రికత స్థానంలో ఒక ఆత్మిక శక్తిని ప్రవేశపెట్టే ప్రయత్నాలు చేసింది. కానీ ఇరవయ్యో శతాబ్దం తీవ్రమయిన ప్రశ్నలతో ఆ నిర్మాణాన్ని కూలదోసింది. హెగెల్ ఊహించిన విశ్వం ఒక అఖండమయిన నిరపేక్షమయిన నిర్మాణం. కాని అది పగిలిపోయి అనేక చిన్న విశ్వాలు పుట్టుకొచ్చాయి. విలువలు సాపేక్షాలయ్యాయి. ప్రపంచాన్ని ఒక నిర్మాణంగా, అర్థవంతంగా చూడటమే దోషం అన్పించింది. కార్య, కారణ సంబంధం కూలిపోయి, ఫ్రాయిడ్, యూంగ్, నీషేల వల్ల అవ్యక్త చేతన ఏలడం మొదలయ్యింది. అస్తిత్వవాదుల ప్రశ్నలు జీవితం పట్ల బాధ్యతనీ భయాన్నీ పెంచడం మొదలుపెట్టాయి. జీవితం ఆరోగ్య పూరితం అన్న నమ్మకంపోయి, తర్వాత రోజుల్లో నార్మన్ బ్రౌన్ అన్నట్టుగా కాలమే న్యూరోటిక్ అయిపొయింది. సత్యాన్వేషణ ఒత్తి పుకారుగా, నీతి ఒక పునరుక్తిగా, సౌందర్య వివేచన అర్థం లేని మూలుగుగా మారిపోయి సాధువులు కోరుకున్న faith కానీ, సైద్ధాంతికులు కోరుకున్న belief గాని మృగ్యమైన కల్లోల యుగం మొదలయ్యింది. బమ్ గార్టన్ ఈస్తటిక్స్ ని ఒక జ్యామితీయ ప్రమాణంగానే చూపిన కాలం నుంచి క్రోసే, శాంతాయనా, టాల్ స్టాయిల మీదుగా, రసచర్చ భాషా విశ్లేషకుల చేతుల్లోపడి వ్యాకరణ సమస్య అయిపోయింది.

యూరప్ పడ్డ సమస్య యూరప్‌దే కాదు, ప్రపంచమంతా మనిషి పడుతోన్న వేదనకి యూరప్ కంఠాన్ని, vision నీ ఇవ్వగలిగింది. మరి ఇక్కడ భారతదేశంలో ఈ మూల అంతర్ బహిర్ యుద్ధారావాన్ని కవితగా పాడుకోవాలనుకుంటున్న మన మాటేమిటి? మనం మన గతం నుంచి ఎంతవరకు పతనం చెందాం? మన అనుభవం సమగ్రంగా సాంకేతికం అయిందా? అందం గురించీ, ఆనందం గురించీ మన కలలు ఎలా ఉన్నాయి?

మన చుట్టూ ఆవరించివున్న కఠినమయిన వాస్తవం, ఆకలి, చీకటి, పరస్పర హింస, దివాలాకోరుతనం, ఇవి మాత్రం మన జీవితం ఎంత మేరకి రుజాగ్రస్తం అయి ఉందో చెపుతూనే వున్నాయి. ఇది ఇక్కడి జీవితం. కాని దీన్ని జీవితం అనేందుకు లేదు. ఇది మృత్యువే. కాని దీన్ని మనం ఒదులుకోలేకపోతున్నాం. ఈ నేలనీ, ఈ గాలినీ ప్రేమించడానికి ఇంకా ప్రయత్నాలు చేస్తూనే వున్నాం. కాని, ఈ ప్రయాణాన్ని అపహాస్యం చేస్తున్నట్టుగా జీవితం fail అయిపోతూనే వుంది. ఈ వైఫల్యం గురించిన ఎఱుక కోసం సమాజం కవివైపే చూస్తోంది. కవి నెమ్మదిగా గొంతు సవరించుకుని కించిత్ బాధగా కించిత్ confident గా అనుకుంటాడు. “ఎవరి బాధయినా చివరికి నన్ను బాధించడంలోనే పరిపూర్ణమవుతుంది” అని.

గాంధీగారు రాస్తున్నారు. Suffering is the mark of the human tribe life come out of death, the condition of wheat growing is that the seed grain should perish అని. పారిపోవడం జీవన ధర్మం కాదు. పతనం నుంచి పైకి లేవడానికి కావాల్సిన శక్తి–హిడెగ్గర్ మాటల్లో -- potentiality– మనిషి తనలోంచే తెచ్చుకోవాలి. చుట్టుముట్టిన సందేహాల మధ్య నుంచి ఆ essential primieval state of being తో intuitive గా నయినా ఒక్కక్షణం– ఏ భ్రాంతి, ఏ పరిమితీ లేని స్థితిలో, ఈ రుగ్మత నుంచి విముక్తి, ఈ జీవిత కేంద్రంతో ఐక్యతా కలిగినప్పుడు, బుద్ధి, మనసు, ఇంద్రియాలు ఒకే ఆత్మగా వికసించినప్పుడు, అప్పుడు విన్పించే కాంతివంతమైన సంగీతమే జీవితాన్ని బతికిస్తుంది, "నందివర్ధనం పువ్వు" లాంటి "ఆ సుకుమార వేదనానుభూతి" కోసమే యుగయుగాలుగా కవులూ, ప్రవక్తలూ, తాత్వికులూ కలగన్నారు. మృత్యువు జీవితాన్ని కమ్మినపుడు, బైరాగి అన్నట్లుగా, ఒక్క 'హృత్స్పందనమిచ్చి' -- womb of universe లోకి ప్రవేశిస్తాం. మనిషికి faith మనిషిపట్లే కలగాలి. మనుష్య నిర్మితాలయిన దేవుళ్ళూ, సిద్ధాంతాలూ పోయి ఆ స్థానంలో మనుషులే రావాలి. ఫ్యుయర్ బా మీది వ్యాసంలో మార్క్స్ రాస్తున్నాడు. The standpoint of old materialism is 'civil' society; the standpoint of the new is 'human' society, or associated humanity.

సజీవమైన మనిషి కేంద్రంగా, ఇవాళ మనం జీవితాన్ని, సాహిత్యాన్నీ కూడా అల్లుకోవాల్సి వుంది. పదిహేడో శతాబ్ద ఖగోళ శాస్త్రం నుంచి జీవశాస్త్రం, మనశ్శాస్త్రం మీదుగా మానవశాస్త్రం వైపుగా సాగుతున్న విజ్ఞానయాత్ర ఈ మాటే చెప్తోంది. ఆధునిక కవి నిజానికి ఆధునిక మానవుడే. అతను ప్రాచీన ఆటవిక గాయకుడివలె, మధ్య యుగాల సూఫీ సాధువువలె, క్యూబిస్ట్ చిత్రకారుడివలె, చార్లీచాప్లిన్ వలే, నీగ్రో కవివలె, ఒక సాదారణమయిన గృహిణివలె, రైతువలె... ఉంటాడు. మానవ సమాజం సాధిస్తున్న మహా విజయాల్లోనూ నిర్మాణాల్లోనూ కాక, అతని ఏకాంత క్షణాల నిశ్శబ్దంలో మాత్రమే ఆధునిక జీవన సంగీతాన్ని మనం వినగలం. అది భ్రాంతి రహితమైన అస్తిత్వపు కాలాతీత సంగీతం కూడా. ఆధునిక జీవితానికి, ఆధునిక కవిత్వానికి మధ్య సరిహద్దు చేరిపేదే ఈ ప్రయత్నం.

3

... మనుష్య సమూహాల మధ్య నిల్చొని తన స్వీయమైన భాషలో ఉన్మత్తుడై ప్రేలాపనలు పోయేవాణ్ని ఎవరు గుర్తిస్తారు? ఈ పట్టణవీధుల్లో ఒక ముసలి బిచ్చగత్తెని మీలో చాలా మంది చూసే వుంటారు. దిగంబరంగా తిరిగే ఆమెకన్నా స్వేచ్ఛాగాయని ఎవరు? కాని ఈ మధ్య ఆ ముసిల్ది ఒక చిరుగు పీలికని మొలకి అడ్డంగా చుట్టుకొంటోంది. ఇంతకన్నా విషాదం సొఫోక్లిజ్ మాత్రం చూపించగలదా? కవిత్వం పలకడమే, దిక్కులు అలంకరింపబడేలా, తాను నడచిన దారి పొడుగునా కవిత్వాన్ని వెదజల్లడమే కవిత్వ ప్రయోజనం అని నమ్మే చినవీరభద్రుడు ఇవాళ దాన్ని పోగుచేసి ప్రదర్శనశాలకి తీసుకొచ్చాడు. ఎంత ట్రాజెడీ.

అతణ్ణి నేను ఇంతప్పణ్ణించీ ఎరుగుదును. చిన్ననాడు బామ్మగారి ఒళ్లో పడుకొని పోతనగారి మందారమకరందాల్ని నక్షత్రాల వెలుతుర్లో ఆస్వాదిస్తున్న దృశ్యం, సాయంకాలం వేళ అమ్మకోసం సన్నజాజి పువ్వులు కోస్తూ వజ్రమ్మ పంతులమ్మగారు చెప్పిన చరిత్రనీ, పురాణాల్నీ తనదయిన ఎవరికీ అర్థం కాని భాషలో, తన మరేదో ప్రపంచపు ద్వారాల్ని తెరుచుకునే శబ్దంలో గానం తియ్యడం–శీతాకాలపు దినాల్లో

పంటపొలాల్లో పాడిన పాటల మధ్యా, చైత్ర మాసపు వెన్నెల రాత్రుల్లో అడవుల్ని కదిలించే చందమామ పాటల మధ్యా, గంగాలమ్మ జాతరలలో డప్పులు వాయిస్తూ ఉద్రేకంతో ఊగిపోయే సామూహిక గానాల మధ్య, సంక్రాంతి రోజుల్లో తత్వాలు పాడుకుంటో ఇంటింటికీ తిరిగే జంగందేవరల శంఖం ధ్వనిలో, గంగిరెద్దుల తప్పట్లలో, సోది సానుల సన్నని ఎలుగులో తన భాషని పోల్చుకుంటున్నపుడు తను కవిత్వం రాస్తాడనిగాని, శ్రోతలు కావాలనిగాని భావించినట్లు నాకు తెలియదు. నిర్నిమిత్తంగా సెలయేటి తరగతులు ఇసుకతిన్నెల మీద విరిగినట్లే, పాటలు పాడుకొన్నాడు తప్ప కాగితం మీద పెట్టలేదు, కవిత్వం అనలేదు.

అసలతను పుట్టిన వూర్ని మీరెంనడన్నా చూసారా? ఆ వూరి చుట్టూ పర్వతాలు, మహారణ్యాలు, ఉదయాస్తమయాల్లో ఏటి వొడ్డున తెల్లమద్దిచెట్టు నీడల్లో, సంధ్యల్లో ఎగిరే కొంగల్లో, దిసమొలలో ఆకలితో తిరిగే పిల్లల్లో, పొగమంచు కమ్మిన నీరవ నిశాంత వేళల్లో-అతను బాల్యం నుంచీ వింటున్న సంగీతాన్ని ఇవాళ తెలుగు పదబందాల్లో పట్టి తెచ్చి మీకు చూపిస్తున్నాడు. ఎంత ద్రోహం, నమ్మకండి. ఒక్కసారి అతని గుండెచప్పుడు విన్నారా? సంతల్లో తాగి సంజల్లో నిర్వేదంలోని ఉద్రేకాల్ని వెళ్ళగక్కుకుని అలిసిపోయి ఏ చెట్టు నీడనో వాలిపోయే బికారుల అనాథ ఆత్మలు, కాషాయాల్తో లోకం తిరిగినా, కోర్కెలూ, కామితాలూ చావని సన్యాసుల గుబుర్లలో కితకితలు, తిరనాళ్ళలో పిల్లంగోవిల జెండాని యీడ్చుకొంటో సాగే దిక్కులేని పిల్లవాడి కాళ్ళ కింద నలిగే దిక్కులేని కీటకాల దిక్కులేని భాషా, జోహారు చేసిన అంతఃపుర రసపుత్ర స్త్రీల చిట్టచివరి కంకణనిక్వాణాలు, ఋతుమతి అయిన స్త్రీ కనుగొనల్లోని అశ్రువులు.... ఇన్నీ విన్పిస్తాయి. వీటిని అతను తన వాక్యాల్లో ఏమాత్రం ఇవ్వగలిగాడు? (ఇస్తే వినగాలరా అని అడగట్లేదు)

ఊహ తెలిసినప్పటి నుంచీ తన జీవితమంతా కవిత్వమనే అతని ఆనందం. అంతా సారస్వతం. అతని అక్కయ్యని మీరెప్పుడూ చూసి వుండరు. ఇంతకాలంగా చూస్తూ వున్నా అతనికే తెలియదు ఆమె రూపం. ఆమె వేసవి రాత్రుల వెన్నెల. స్పష్టాస్పష్టం. ఆమెది ఈ లోకం కాదేమో. కాని ఇక్కడికి ప్రవేశించిన వెనుక-యీ భూమికీ, ఇక్కడి మమతానురాగాలకీ కట్టుబడిపోయింది. “నా జీవితమంతా గొప్ప విషాదం, గొప్ప ఆనందం, దేన్ని వదులుకోవాలో తెలీదు” అనే రెండు ప్రపంచాల మధ్య ద్వారంలాంటి ఆమె ఒళ్ళో పెరిగాడు. ఆమె అతణ్ణి ఎట్లా పెంచిందని? సెలవులకు ఇంటికి వచ్చినప్పుడు ఆ దూర గ్రామంలో తెలియని దేశాల పాటలు పాడేది. చెంపల్ని ఆ స్త్రీ హస్తాలు గొప్ప వాత్స్యల్యంతో అద్ది “నువ్వు ఆర్టిస్టువిరా నాగూ, పెద్దయ్యాక, ఓ షరాయి, తెల్లని లాల్చీతో, దాని మీద పువ్వులు నేనే అల్లుతాను, ఓ లేతాకు పసుపు శాలువా, రేగిన జుత్తూ... నువ్వు అలా మొక్కల మధ్యా, మేఘాల మీదగా వెళ్ళిపోయినట్లుంటావు. ఎవరికీ పట్టవు. పట్టించుకోవు. మన ఎదురింటి పక్కింటి వాళ్ళంతా ఆశ్చర్యంగా చూస్తుంటే నేనేం చేస్తానో తెలుసా? వాణ్ని ఆపకండి, వాడు కవి, ఏ దేశంలోంచో తెగిన గాలిపటంలాగా వచ్చిపడ్డాడు. ఎప్పుడో తిరిగి వెళ్ళిపోతాడు, నీ చేతి కదలికల్లో, నువ్వు గీసిన గీతల్లో ఎంత ఆర్టిస్ట్రీ ఉందనుకున్నావురా? అనేది. శ్రావణసంధ్యల్లో చేలల్లో ఆర్ద్ర పురుగుల్ని దువ్వుతూ సంస్కృత నాటకాలూ, గీత గోవిందం విన్పించేది. హఠాత్తుగా ఒక అద్భుతాన్ని కనుగొన్నట్టుగా పిలిచేది. అది చింతకొమ్మల వెనగ్గా సూర్యాస్తమయ దృశ్యమో, లేక ఎవరింట్లోనో ఓ పసిపాప ప్రపంచాన్ని చూసి మెత్తగా నవ్వటమో, ఆ బాల్యదినాల్లోనే, వైతాళికుల్ని విన్పించింది. అప్పుడే “శివసముద్రమూ, నయాగరా వలే ఉరకండీ ముందుకు”,

"ఈ రేయి నన్నొల్లనేరవా రాజా", "ప్రళయకాల మహోగ్రదగ్ర జీమూతోరు గల ఘోర గంభీర ఫెళఫెళార్భటులలో మెరపేలా", "బొగడ పువ్వులు రెండు అందకున్నయి నాకు", "తవవిరహే కేశవా", "సాయంకాలం సముద్రపొద్దున నిలిచిందీ ఒక నావ".

ఒక రోజు పుస్తకాల అల్మైరా దగ్గర తల దువ్వి ఓ పుస్తకం చూపించి "స్త్రీ–గుడిపాటి వెంకటాచలమని, ఇప్పుడర్థం కాదులేరా, పెద్దయ్యాక చదువు" అంది. ఓ రాత్రి నాన్నగారు పద్యాల మధ్య అన్నారు, "గాంధీగారు మహాత్ముడురా" అని. ఎవరు అతణ్ణి ఈ ప్రపంచంలోకి ఆ అరణ్యద్వారంలోంచి ప్రవేశపెట్టింది? ఎవరు ఈ భావాలన్నీ అటుగా విసిరింది? ఇది ఎవరు ఆడిన దాగుడుమూతలు? ఈ లీలకి అర్థం ఏమిటి?

ఇంకా ఏం జరిగింది?

ఓ గొప్ప ఆశ్రమాన్నుంచి అతనికి పిలుపు వచ్చింది. గొప్ప అధ్యాపకుల శిక్షణలో ప్రపంచాన్ని మార్చివేసిన నూతనావిష్కరణల్ని తెలుసుకున్నాడు. యూరప్ చరిత్ర, మార్క్సిజం, నవీన భావధోరణులు –– బాపిరాజు గారి పాటలు పాడుకుంటూ కన్నీరు పెట్టే తెలుగు మాష్టారూ, పిల్లల్ని దండించలేక సత్యాగ్రహం చేసే ఆర్టు మాస్టారూ, తన గానాన్ని అంధకార దేవతముందు నిరహంకారంగా అర్పించే సంగీతం మాష్టారూ, సస్యకేదారాల్లో శరదృతు రాత్రుల్లో ప్రేమనీ, కవిత్వాన్నీ రెండుచేతులా అందించిన హీరాలాల్ మాష్టారూ అక్కడే కలిసారు. అయన ఎన్నడూ అతణ్ణి కవిత్వం రాయమనలేదు. కాని ఆయన కవి, అతణ్ణీ కవిని చేసారు.

ఇంకా ఏం రాయను? "ప్రభూ, సుందర మందారాన్ని, పరిమళభరిత పారిజాతాన్ని కాకపోవచ్చు" … ఇలా తొలిసారిగా కవితావాక్యాన్ని పలుకుతున్న రోజులు ఇట్టేగడిచి, విశ్వసాహిత్యంలోని ఒక్కో కవి, ఒక్కో రచయిత, సమకాలీన సమాజం, దాని సంక్లిష్ట స్వరూపం నెమ్మదిగా బోధపడుతుంటే– తెలియని మత్తు ఆవరించింది, ఒక వ్యక్తిగత భావనాలోకాన్ని నిర్మించుకునే పలాయనం మొదలయ్యింది. ఆ రోజుల్లో రాసింది అక్కయ్య ఉత్తరాల్లో "నేనెప్పుడూ నీతో వాదిస్తాను చూడు, నిజంగానే ఎంతో గొప్పదీ జీవితం, ప్రతి అడుగునా ఎన్నో అందాలు, చూసే కన్నులుండాలి. ప్రతి చిన్న పనిలోనూ ఎంతో ఆనందం, మనం చేసుకునే ప్రతి చిన్నపనీ మన విశ్వాసాన్ని పెంచుతూ ఇతరుల నుంచి వచ్చే చిన్నమాటయినా ఆనందపెడ్తూ– ఇలాంటి చిన్న చిన్న ఆనందాలు అడుగడుక్కీ నింపున్న జీవితం గొప్పదా? కళ గొప్పదా? కళ కూడా జీవితానందంలో భాగం… కళాకారుడు తనకున్న ఆనందానుభూతి గల హృదయాన్నంతా ఒక్క కళలోకే నింపేసుకుని జీవితం నిండా అశాంతి నింపుకుంటాడు. ఉత్తమ కళాకారుడు జీవితంతో కళని సమన్వయ పరచుకొని గొప్ప కళాజీవితంతో తాదాత్మ్యం చెందుతాడు. తన చూపును ఎంతో విశాలం చేసుకుని తన జీవితాన్ని మాత్రం అందమైన పరిధిలో గడపగలగటమే గొప్ప కళ" అని.

అతనికి అది తెలిసిందా? ఏమో ఇంకా ఆ ప్రయత్నంలోనే వున్నాడు. ప్రత్యేకమైన కవిత్వం నుంచి కవితామయమైన జీవితం కోసం తపస్సు, కాని ఆ స్థితిలో ఎదుర్కొన్న పెద్దప్రశ్న– నామ్నత, మహత్వ కాంక్ష.

నరాల్లోంచి, అంతశ్చేతన లోంచి ఇది విస్ఫోటం చెంది ఎన్నోసార్లు ఆత్మహత్యా ప్రతిపాదన చేయించింది. అందులో భాగమే అసంపూర్ణమధనం నవల "అమృతమంటే చావు లేకపోవటం కాదు, చావుకు ఏమీ మిగల్చకపోవడం" అని అనంతకృష్ణ జీవితాన్ని త్యజించినా -- నామ్నత అంత తేలిగ్గా ఒదిలేది కాదు. జీవితమూ, కవిత్వమూ ఒకటి కాకుండా అడ్డునిలిచేది అదే. అనామ్నత పట్ల ప్రయాణం రసాత్మకత నుంచి, ధ్వనికి, ధ్వని నుంచి నిశ్శబ్దపు పూర్ణత్వానికీ సాగుతుంది. కాని పౌర్ణమి రాత్రి ఎంతదూరంలో వుందని సత్యపూర్ణ అతణ్ణి కలుస్తుందంటారా?

నవయవ్వనపు సెక్స్ అలజడి, అర్ధరాత్రి వానలో చివికిపోయ్యే వీధుల్లో జీవిత పరమార్ధం గూర్చి నిరర్ధకమైన చర్చలు, స్థిమితంలేకపోవడం, సత్రం అరుగుల మీద అర్ధాకలితో నిద్ర, ఆదర్శాలు వీగిపోతున్న నిస్సహాయత... జీవిక కోసం పాత్రలు -- ఇవేవీ ఏనాడు అతని తృష్ణని ఆర్పలేకపోయాయి. పిపాస తీరదు. ఈ జీవితపు వంధ్యత్వం, శూన్యం, పాశవికత, భౌతిక జగత్తు యొక్క నశ్వరత, మాయావరణం, కొట్లాటలు, అన్యాయాలు, అనాచారాలు, కన్నీళ్ళు, దారిద్ర్యం, అంధకారం ఇవన్నీ చుట్టుముడుతున్న కొద్దీ గాంధీగారూ, చెలంగారూ, అడివి బాపిరాజూ, శరత్ రాజలక్ష్మీ, అమృత షెర్గిల్ చిత్రాలూ, బాల సరస్వతి, నూర్జహాన్‌ల గానం, వెన్నెల్లో తాజ్‌మహల్, హేమంత ప్రభాతాల తుషార స్నాత ప్రకృతీ, చెల్లాయిలూ, ఉద్యమకారుల త్యాగాలూ, జీవిత చిరమర్మవేదనని గానంచేసి తపించి వెళ్ళిపోయిన సాధుకవులూ, జీవిత కేంద్రంలో నిల్చొని తన బాధ పాడుకొన్నట్టుగా మన బాధ పాడిన బైరాగి... దగ్గరవుతూంటే, సూనృతం వైపుగా, తానూ ఏ దేశాల్నుంచి వచ్చాడో ఆ దేశాలకు ఈ ప్రపంచాన్ని తీసుకు పోవాలన్న కలలతో -- అతను నడిచినంతమేరా కవిత్వ పరిమళంలో తూగుతుందని అతనికే తెలుసు. అర్ధరాత్రి సొమ్మసిలిపోయిన ప్రపంచం మీంచి అర్ధం లేని పురాతన జానపద గీతంలా వీచిపోవడం కన్నా అతని కవిత్వానికి కోరదగిందేముంది?

అతను మీకిచ్చిన పంక్తుల్లో అతని అసలయిన కవిత్వం లేనేలేదు. మీ చేతుల్లో వున్నది పంట ఎత్తిన తర్వాత పొలాల్లో మిగిలే పరిగె. తన స్వప్నాల్లోకి, జీవితానుభవం మీది వెర్రి ప్రేమ కొద్దీ పొడిగించిన దేశకాలాతీత స్థితిలోకి–ప్రయాణిస్తోన్నంతకాలం అతను వెదజల్లే గొప్పకాంతి అది అతిలోకం, అనంతం. నిర్గుణం, నిరహంకారం, విముక్తం.

అతను వేదాంతికాదు, శాస్త్రవేత్త కాదు, కబీరు అన్నట్టుగా ధార్మికుడూ కాదు, అధార్మికుడూ కాదు, సన్యాసికాదు, రసికుడూ కాదు, వేదాంత తర్క ప్రసంగాలు చెయ్యడు, వినడు, బద్ధుడు కాదు, ముక్తుడూ కాదు... నరకానికీ వెళ్ళడు, స్వర్గానికీ వెళ్ళడు... ఎలాంటి విశ్వాశాల్నీ ఏర్పరచుకోడు, అలాగని కూలదొయ్యడు. అతని కవిత్వాన్ని ఎన్నడూ సమాలోచించలేదు నేను. విశ్లేషణా చెయ్యలేదు. భరణి అన్నాడొకసారి "అతను కవిత్వమని తీసుకు వచ్చినదంతా ట్రాష్. కాని అతను నాకు తెలిసిన కవులందరికన్నా గొప్పకవి" అని. ఎంత ధన్యత!

దేవీ భాగవతంలో ఓ కథ వుంది. ఓ రాజు తపస్సు చేస్తే కవి అయిన పుత్రుడు కలుగుతాడని దేవతలు వరమిచ్చారట. పుట్టబోయేవాడి కావ్యం కోసం సమాజం పరిపక్వమయ్యేసరికి, పుట్టినవాడు నిజం తప్ప మరొకటి

పలకలేదట. రివలేషన్ ఆలస్యంగా కలిగింది, కవిత్వం సత్యం కాదు, సత్యమే కవిత్వం అని. కవిత్వం స్వప్నమా? సత్యమా? కవితా! ఓ కవితా!

గోదావరితీరం, సాహితీవేదిక, భావుకులు, సత్యాన్వేషులు అయిన శరభయ్యగారూ, సుదర్శనంగారూ, చింతనాశీలురయిన గోపీచంద్, మహేశ్, సమసమాజాన్ని కలగనే సావిత్రిగారు, ప్రేమశీలురయిన జగన్నాథరావుగారు, కలలుగనే “విభావరి”, ఋషితుల్య అయిన శారదగారూ, తమ వ్యథానుభవం కవిత్వంగా పలికే మిత్రులూ, చర్చలూ, నిరంతరమైన బృందగానం : ఈ కొన్నేళ్ళుగా అతని జీవితం ఇది.

కాని కవిత్వం మాత్రం పుష్పిస్తూనే వుంది. అది అచ్చవుతుంది, అవదు, ప్రజల్లోకి వెళ్తుంది, వెళ్ళదు, బహుశా అతను లంపెన్ ప్రొలిటేరియట్‌లోకే వస్తాడేమో. అతని శవధూమంతో పాటు అతని కవితా సౌరభమూ ఎగిరిపోవచ్చు. అప్పటికీ అతని కవిత్వం కవిత్వమే, ఆదికాలపు కమ్యూనుల్లో, పిరమిడ్లు, రోమన్ ఏక్విడెక్టులూ, గోథిక్ చిత్రాలూ ఏర్పడినవేళల్లో, మధ్యయుగాల గాఢతిమిరంలో, కోతల పాటల్లో, జాతీయ యుద్ధాల ఆవేశగీతాల్లో, భజనల్లో ఎవరికీ వినబడని సొంత కూనిరాగాలు తీసిపోయిన అజ్ఞాతులైన అనేకులైన indisciplined కవుల్లో అతనూ ఒకడు. తన కలల్లో తాను ఇరుక్కుపోయి వున్నాడుగానీ, ఈ ఆవిష్కరణకి అతనేమని పలవరించి ఉండునో.

రాజమండ్రి 1984-86

# నిర్వికల్ప సంగీతం



అన్యత్ర ధర్మాత్, అన్యత్రా ధర్మాత్, అన్యత్ర అస్మాత్కృతాకృతాత్ అన్యత్ర భూతాచ్చ, భావ్యాచ్చ,

యత్తపస్యసి తద్వద....

కఠోపనిషత్ (1:2:14)

బొమ్మలు గీసాను, పరీక్షలు రాసాను, ప్రసంగాలు చేసాను, శ్రమిస్తున్నాను, కవిత్వం రాస్తున్నాను. అమ్మాయిల్ని ముద్దుపెట్టుకున్నాను. వాళ్ళ గుండ్రటి రొమ్ముల్ని చూసి వెర్రి పడ్డాను. మాష్టర్బేషన్, ఫిలాసఫీలోకి తొంగిచూస్తాను, కాని ఇదేమీ సంతృప్తి పరచదు, నా దాహాన్ని తీర్చదు, ఎప్పుడో ఎక్కడో నా అస్పష్ట స్వర్గంతో తాదాత్మ్యం కలుగుతుందే, ఒక అపురూపక్షణం.... అప్పుడు మాత్రమే నా ఆత్మ విముక్తమవుతుంది.

నేను సముద్రాన్ని, అరణ్యాన్ని, విశాలమైదానాన్ని, వుపత్యకని ప్రవాహాన్ని, కాలువని, వెన్నెల్ని, కాంతిని, శూన్యాన్ని....

ఇప్పుడీ నెమలి పిట్ట నీ టీపాయ్ మీద పురి విప్పింది. బహుళవర్ణ సమ్మిశ్రిత పింఛంతో నిగనిగలాడే ఈ అడవిపిట్టని ఎట్లా రిసీవ్ చేసుకుంటావ్? నీ ఓపిక. నువ్వు తిరగని దేశాల, ఈదలేని సముద్రాల, నివసించని ద్వీపాల ప్రయాణించని మార్గాల, వినని సంగీతాల వివశత్వంతో మత్తెక్కిన మంత్రం నగర పక్షి యిది. చూర్ణకుంతలయై ఆడుకొంటున్న ఓ బాలిక.... అనంత సైకతంలో ఓ అడుగుజాడ, ప్రయాణించగలవా?.... చలంగార్ని, గాంధీగార్ని, బైరాగిని, కాఫ్కానీ, సార్త్రేనీ ఎట్లా ప్రేమిస్తున్నాం మనం? మన ఆత్మలు కలిసే సంగమస్థలాలు అవి, ఇట్లా స్వప్నిద్దాం, ఇట్లా జీవిద్దాం, పాడండి ఒక అపురూపగీతం. ఏ గీతంలో మనిషి ద్వారాలు ఛేదించి మానస కాసారంలో విహారానికై ముందుకు సాగుతాడో, ఏ గీతంలో మనిషి రాక్షసుల్నీ, సైతానుల్నీ గెల్చి, అమృతాన్నీ, అగ్నినీ సాధిస్తాడో ఆ జీమూతవాహనుడి, ఆ ప్రొమీథియన్‌ల ఇతిహాసాన్ని పాడండి. ఎక్కడ ఋతం సూనృతంలో ధ్వనిస్తుందో ఆ హరిశ్చంద్రుడి పాట పాడండి. ఎక్కడ స్త్రీలు, పిల్లలూ, అనాథాలూ, దారి తప్పినవాళ్ళు, ఉన్మాదులూ, ఒకే మహత్తర స్వప్నాన్ని నిజం చేసికోగలరో ఆ స్థితిని సాధించే గీతాన్ని పాడండి. మీరు ఏ శైథిల్యం యెదట నుంచున్నారో దాని వెనుక మీకై ఒక అద్భుత స్వర్గం రూపొందుతోంది. ఇంతకన్నా lovable మరేముంటుంది.

కవిత్వమంటే సృజనాత్మక రూపందాల్చే విశిష్టత. విశిష్టత సాధించగల అతిగొప్ప సృజనాత్మక రూపం విశిష్ట జీవితమే–అప్పుడు జీవితమే కవిత్వమవుతుంది – కవిత్వమే సత్యం కాదు, సత్యమే కవిత్వం.

డైరీలోంచి 27–3–83<br>గోపీచంద్‌కి రాసిన ఉత్తరంలోంచి, 13–12–83

# ఒక నూతన యుగావిష్కరణ కోసం

ఇవాళ నన్ను నేను డైనమైట్లతో పేల్చుకోవాలి అప్పుడు గానీ
నా హృదయ పాషాణాభ్యాంతరాలు తొలగవు

నన్ను నేను తవ్వుకోవాలి నాలోకి, తోడుకోవాలి నాలోంచి.
ఒక్క చుక్క మంచినీటి కోసం, ఒక్క మంచి మాట కోసం

తుఫానుల ఒత్తిడుల మీద, దావాగ్నికీలల రాపిడుల మీద ఎంతో
వ్యధ చెందితేనేగాని ఈ జీవితశాఖ ఒక్క లేత చిగుర్ని కూడా ప్రసవింపదు.

ఒక్క నవ్వు నవ్వటానికి, యీ రోజు నాతో నేను ఒక మహా సంగ్రామమే కానివ్వాలి, ఒక్క పువ్వు
పుయ్యటానికి ముందు నేనేత్తురొలికించి కన్నీరు చిందించాలి.

నా మానవ ప్రపంచమంతా దుర్భర వేదనల సెగలో నలిగి రగిలినప్పుడు గానీ ఒక ప్రవక్త కన్నీటి కొలకులో
కారుణ్యపు ముత్యం తొనకాడదు, ఒక కవిత ప్రభవించదు.
ఒక నూతన యుగావిష్కరణకై తెర తొలగదు....

\- 13-8-82

# తొలిగీతాలు

1
గడ్డి పూవుని ప్రభూ
సుందర మందారాన్నీ పరిమళ పారిజాతాన్నీ కాకపోవచ్చు
సువర్ణ వర్ణ రంజిత విరాజిత పుష్పరాజాన్ని కాకపోవచ్చు

కాని
నా స్వామి సన్నిధిలో నిరంతర సేవ చేయ ఇచ్ఛగించినదాన్ని
నీ చరణ సమీప నివాసయోగ్యతకై విలపించి పరితపించే దాన్ని

ప్రభూ
నీ మణిమయ నవరత్న ఖచిత సువర్ణ హారాల్లో స్థానం లేకపోవచ్చు
నీ పసిడి తళుకుల చరణారవిందాలసోకే అర్హత లేకపోవచ్చు

కాని
నీ మనోహర రూపసందర్శన భాగ్యానికే తృప్తి చెందేదాన్ని నేను
నీ పరమ పవిత్ర పాద పద్మరజాన్ని సోకి తరించే భాగ్యముంది నాకు

ప్రభూ
నేను నీ కంఠాన్నలంకరించిన పూల మాలికా సూత్ర రజాన్ని
నీ సేవకై వెలిగించిన ప్రమిదలోని కాంతిరేఖని
నీ సమీప ప్రాంతావృత శూన్యాన్ని నేను
నీ సుకుమార సుందర చరణాల నునువెచ్చదనపు సవ్వడి నేను
నేను ప్రభూ, ఒక గడ్డి పూవుని.

2

వేడుకొంటున్నాను ప్రభూ మన్నించమని
కాంతులీనెడి నీ వక్షస్థలంపై ధరించడానికి మణిమయ హారాలు నే సమర్పించగలనా?
గంధర్వులే స్వర్ణ హర్షాలు కురిపించగలరు కిన్నేరులే నీ
పాదసేవకై తహతహలాడగలరు

నీ చరణమంజీరాల్ని తారలు కల్పిస్తాయి
నీ పాద పద్మాల్ని గంగ అభిషేక మొనర్చుతుంది

దీనురాలిని హీనురాలిని
గుడ్డి గడ్డి పువ్వుని ఏమివ్వగలను?

అయినా సాహసిస్తున్నాను
జీవనాడుల్ని మాలికా సూత్రాలుగా ప్రాణాల్ని పుష్పగుచ్ఛాలుగా
మాలగుచ్చి నీకు అందించాలని

ఈ గడ్డి పూలు పూలు మాత్రమేనా?
నా మమతానురాగ సౌరభాలు
ఈ మాలికా సమర్పణా?
నా జీవిత సమర్పణే.

– నవంబర్ 76

# బంధూకం

మంకెన పువ్వును నిన్న చూడగలిగావా?

బాధా విషవృక్షపు
చిక్కని ఆకుపచ్చని రాత్రి గుబురుల్లో విరిసిన
రేపటి నిప్పు పువ్వుని గమనించావా?

పీడన సమస్తాన్నీ బాధిస్తున్నపుడు
ఘర్షణగా వికసించిన భయంకరారుణ ఖడ్గం యీ పుష్పం

మంకెన పువ్వును నేడు చూడగలిగావా?

బలవంతమైన సర్పాన్ని బంధించిన
ఎర్ర చీమల సమూహం
మంకెన రక్తం చిమ్మటం
నీ మూడోనేత్రం గమనించనే లేదా?

అంతంలేని అర్థంలేని యీ బంజరులో
ఎన్ని మంకెన అంకురాలు మిణుగురులై
బలిపీఠాన్ని
ఆత్మదానంతో తేజోరుధిరారుణం కావించాయో

మంకెన పరాగంలో
సమున్నత మహోజ్జ్వల భవిష్యదాశలు

మంకెన పువ్వును ఇకనైనా చూడకపోతావా?

17-3-79/ 2-5-80

# జీవనదిలో దీపం ఒదుల్తూ

ఈ సాయంకాలం గోదావరి ఊపు పున్నాగ పువ్వుల సొగసల్లే ఈ లోకాన్ని విశ్వసిస్తున్నా నా నెచ్చెలీ నేను నిన్ను ప్రేమించుకొనటం లేదేమి? ఈ సుకుమార సౌందర్యం మనసుని లాలించక మండే చంద్రుని వెచ్చని ఊపిరిని మాత్రం విన్పిస్తున్నందుకా? లోకపు చేదుని రుచి చూసిన నా లోపలి కన్ను చెప్తోంది, నా కాళ్ళని ముద్దాడే నీటి గుత్తుల గుండెల్లో మృత్యువు పొంచివుందని.

చీకటిని పొగచేసి వరదై, వెల్లువై, వెన్నెల వాడిన పుచ్చపూవై, చిక్కిన పున్నాగ పూవై, చినుకై, సెలయై, ప్రవాహమై వెన్నెల. ఇది సౌందర్యమా నేస్తం? విను. ఆశగా వొచ్చి వొడ్డును తాకి ముక్కలవుతూన్న అలల ఘోషని, ఈ లోక జీవన వాస్తవం కరడుగట్టి కదలనివొడ్డయి వెక్కిరిస్తుంది, ఈ జీవన నిస్సారం కాదూ వెన్నెల్లో పరచుకొన్న ఇసుకతిన్నె.

నా నెచ్చెలీ, సున్నం వేసిన నా గోదావరి ప్రాణంలేని గోడగా పడివున్నది. యీ రొదలో నీ లలిత ప్రేమ నృత్యం నాకగుపిస్తుందా? ఎవరీ వెన్నెలని ప్రేమించేది? ఎవరీ కొంగరెక్కని ముద్దాడేది? ఏ మత్తుపాటల నీడలీ వెన్నెల తళుకులు? ఇది కాదయ్యా వెన్నెల, హంస రెక్కల వెన్నెల, వెండి కాంతుల వెన్నెల ముందు నిలవగా, సంక్షోభం చెలరేగిన యీ తరుణంలో ఎవరయ్యా మూర్ఖులు సౌందర్యాన్ని ఆబగా తాగేసి వాంతి చేసుకొంటున్నది?

వెన్నెల మాత్రం చీకటి కాదా? మేలి ముసుగు కప్పిన తియ్యని అజ్ఞానం కాదా యిది? సహించలేని తమ దౌర్భాగ్యానికి జనం విన్పించిన పాటల తుఫానుదీ తెల్లబురద. యీ పంకంలో పద్మం విరిసేదెప్పుడు?

ఈ తెల్లని రక్తం నా గోదావరిని జోకొడుతోంది. ఉత్సాహం ప్రళయ ఝంఝ అయి ప్రభంజనంలా పొంగాల్సిన నా గోదావరి ఏ మన్ను తిందిరా తెల్ల జండా పైకెత్తింది? పిరికితనపు వెన్నెల దుప్పటిలో మత్తిల్లిన నా గోదావరి మేల్కాంచేదెప్పుడు?

రండి. నా గోదావరిని ఓదార్చి, లాలించి, మేల్కొల్పి, బతికించగల త్యాగమూర్తులు రండి. సుళ్ళు తిరుగుతూన్న తన గర్భంలో ప్రాణం ప్రసవించే నాదం వినగల ఋషులు రండి. మన జీవన ప్రత్యూషాలాపనని కమ్మేసిన విషాద పాండుర ఛాయని తొలగించే వీరులు రండి. నా అన్నలారా, తమ్ముళ్ళారా రండి.

మనమే చమురయి, మనమే ప్రమిదయి శక్తిని కళికచేసి చేతనతో వెలిగిద్దాం. జీవనదికి అర్పిద్దాం, భవిష్యదుజ్జ్వల మహా జీవన ప్రాగుద్భావపు శుభోదయానికి నాందీ వచనం యీ దీపం, నా జాతి సోదరులు నాతో కలిసి పెరిగి పుష్పించే అరుణోదయ సౌందర్యం, నా నెచ్చెలీ, మన రేపటి ప్రభాతం.

– 1-11-1980

# ఈ తొడుగుని విప్పేస్తాను

ఉదజనినీ ఆక్సిజనినీ వేరు చెయ్యండి, మంటలు ఆర్పేబదులు
మహా ఝంఝ అయి పెంచండి

తొడుగుల్ని విప్పేసుకొందాం. స్పర్శనీ, శబ్దాన్నీ, వేషాన్నీ
వాసననీ, శూన్యంలో ఏకం చెయ్యండి. ప్రపంచాన్నీ ప్రళయంలో
ముంచెయ్యండి, లేదంటే మాడ్చెయ్యండి.

ఇన్ని రకాల మొక్కలూ, రుచులూ వద్దు, ఇక నుంచి విషం
బలాన్నిస్తుంది, పాము మెళ్ళో హారమయి కదలాడుతుంది
వెన్నెల్లో ఫొటో సింథసిస్ నిర్వర్తించండి. సర్వం సాగరం
చేసి మోప్పల్ని అతికించుకోండి

అంక గణితాన్ని ఖతం చేసి X Y ల బీజగణితాన్ని నిర్మించి
విశ్వాన్ని ఆది దంపతులుగా విభాగించండి

తొడుగుల్ని ప్రళయంలో పారేసి పంచభూతాల పంచామృతం
నైవేద్యంగా నీరాజనమివ్వండి.

ఇప్పుడింక రెండే శిబిరాలు, ఈ భూమికి రెండే ధృవాలు
ద్వైతంలోంచి అద్వైతాన్ని సమీకరించండి
అసమానతల్ని సహంగా విడదీసి సమానత్వపు జెండా ఎగరెయ్యండి

– 29-3-81

## వ్యత్యాసం

ఈ కాసింత ఎత్తుకే, యీ కొన్ని క్షణాల బతుక్కే నేను
గోనెలతో చిరాకు మూట కడతాను

ఇంత ఎదిగినా, ఇంత విస్తృత ఫల పుష్ప శాఖా సమన్వితవైనా
నువ్వు కొత్త కాంతి దిశగా అనునిత్యం చిగురిస్తూంటావు

ఏ మూలనో మనసు పొరల మాటున చేరిన అసంతృప్తి
లేశాన్ని భయాల అద్దంలో భూతంగా భ్రమసి గగ్గోలు
పెడతాను కనుక నాకా చిరాకు :

ఏ చీకటి నిశ్శబ్దంలోనో నీ కన్నీటిగా రాలిన ఎండుటాకు
చప్పుడు నీకే వినిపించరాని వృక్షమౌనం దాల్చగలవు
కనుకనే నీకా కొత్త చిగుర్లు...

- 10-11-1981

## చెరబండరాజు కోసం

అయ్యో, మన ముఖాల ఎడారులింకా అలానే వున్నాయి, మన
హృదయాలుండాల్సిన చోట సహారాలు, కొలరెడోలు, కన్నీరొలకని
కాంతి చేరని పాషాణాలూ, యిసిక తిప్పలూ

వెళ్ళిపోయిన యోధాను యోధుడా

నువ్వు ముట్టడించగలవు. కాంతి యుద్ధం చెయ్యగలవు
ప్రస్థానం సాగించగలవు- కాని యీ పంకంలో కెందామరల్ని
మాత్రం పూయించలేవు

ఈ శిలా వ్యవస్థ కరిగేందుకు
వెయ్యి బడబాగ్నులూ లక్ష దావాగ్నులూ చాలవే
నీ అశ్రువుల వెచ్చదనం ఎలా చాల్తుంది?

సాహసికుడా

ఈ క్షణాన నిన్ను ఒదిలిన నీ వెచ్చని వూపిరి
దిగంతాలదాకా తరంగితమై పరివ్యాప్తమవుతోంది
ఎక్కడ మనిషి జీవితాన్ని ప్రేమించగలడో ఆ దేశానికి
యీ క్షణానే నీశ్వాస మహాప్రస్థానం సాగిస్తోంది

గల్లాపెట్టెలు, చితాలూ, ఆవర్జాలూ, కత్తులూ, విగ్రహాలూ
కవిత్వాలూ వివాదాలూ పక్కన పెట్టి ప్రజలారా
మనలోతుల్లోని ఆ ఒక్క అశ్రుమౌక్తికాన్నీ వెలికి తీద్దాం

రేపటి గొప్ప ఉదయం కోసం
ఇవాళ అస్తమించిన ఆ సూర్యుడికి నమస్కరిద్దాం.

– ఆగస్టు 82

## సుప్త బీజం

నేను చిగురించను, మొగ్గ తొడగను, పూయను.

నా చిగుర్లు జీవ స్పర్శతో రెపరెపలాడనప్పుడు, నా మొగ్గలు ప్రాణ శ్వాసతో విప్పారనపుడు, నా పువ్వులు అమృత శోభతో తళతళలాడనపుడు నేను చిగర్చక పూయక మొగ్గ తొడగక మోడుగానే మిగిలిపోతాను.

నా ఆత్మ సంపూర్ణ ప్రకటనే నాకు నిజమైన వసంతం. అంతదాకా నాలోకే నేను ముకుళిత విలాపం

గొప్ప లోకాలు కళ్ళముందు లేనపుడు కలలవైపుకు చూపులు మరల్చినట్లు నా వికాసాన్ని కాండంలోకే మరల్చుకొంటాను

ఇక చూపర్లకు నేను ఒట్టి మోడుని : కాని నాకో : ఇంద్రజాలం నిక్షిప్తమైన మంత్ర దండాన్ని

– 13-8-82

# నా జీవితమే నా కవిత్వం

నన్ను పాడమని నిర్భందిస్తారెందుకు? అయినా ఏంపాడగలనని?

నా అనుభవాలే నాకర్థం కావట్లేదే, మీ అందరి అనుభవాల్నీ
నిర్ణయించే ఏదో సిద్ధాంతాన్ని అవశ్యం పాటకట్టి పాడేదెట్లా?

వేసే ప్రతి ఒక్క అడుగూ ఒక వసంతానికి ఆహ్వానం, తీసే ప్రతి
ఒక్క శ్వాసా ఒక మృదుస్వప్న సంగీత రవళి, గడిచే ప్రతి ఒక్క
క్షణమూ నా అనుభూతి ప్రాణజ్వాల మండే కొలిమి, ఇష్టపడ్డ
యీ బ్రతుకు ఒక చిత్ర పద ప్రహేళిక

నేను నడచి వెళ్ళిపోయిన నేలమీది అడుగుజాడల్నీ, అట
వీచే గాలుల్నీ అడిగి అన్వేషించి తెలుసుకోండి

గొప్ప కవిత్వ జ్వాల ఒకటి
సూర్యదేవుని తొలి కిరణంవలె పృధ్వీతలాన్ని అలనల్లన
తాకుతో కదిలి పోయిందని

- 6-11-82

# స్వప్నబద్ధ

శరీరానికి రెక్కలున్న పక్షికన్నా
హృదయానికి రెక్కలున్న పక్షి
ధన్యురాలు

ఆకాశాన్ని కోసే కొంగల బారులు
ఎంత ఎగిరినా
తిరిగి తిరిగి గాలి నృత్యాలు చేస్తున్నా
తీరం కనరాదు

అది విశాల పంజరం

కాని ఇరుకు వూచల్లో
గిజగిజలాడే యీ పక్షి
హృదయం అంచుల మీంచి
ఊహా నూతన స్వర్గాల
సుందరోద్యానాల్లో ప్రవేశిస్తుంది

మానస సరోవరాన్ని విశ్వసించిన
మేల్మి రాజహంసగా
సౌందర్యాన్ని తన స్వప్నాల్లో మిలనమొనర్చి
తనే సౌందర్యమవుతుంది

దిక్కులేని శూన్యపు నీడల్లేని ఎండలో
ఎగిరే పిట్టల కన్నా
తిండీ నీళ్ళూ ముట్టక
కలల్లో బతికే మైనగోరు నాకెంతో యిష్టం

- 14-11-82

# స్వప్నం తొణికెను స్వర్గం తొలగెను

ఆటలాడుకొన్న రోజులు గడచిపోయాయి. అగాధ గతంలోకి జారిపోయాయి. జీవిత ప్రాంగణాన నే మనసుపడి తీర్చుకున్న ముగ్గులు జనసందోహపు తొక్కిసలాటలో చెరిగిపొయ్యాయి.

పాడుకొన్న పాటలెగిరి పొయ్యాయి. మృత్యు నిశ్శబ్ద కుహరంలోకి నిష్క్రమించి కూలబడ్డాయి. జీవన మందిరాన ఆలంకృతమైన ఆలాపనా తోరణాలు రణగొణ ధ్వనుల యీదురు గాలికి ఎగిరిపొయ్యాయి.

గోపురాల గూళ్ళలోంచి గువ్వలెగిరాయి. గోదావరీ జలాల మీంచి కొంగలెగిరాయి. ఈ మరణ హేమంత రాక్షసీ పదఘట్టనకు జడిసి మహారణ్యాల హరితస్వప్నాలకు స్వప్నాలే చెదిరి పొయ్యాయి.

మధ్యాహ్నాల వేళ ఏటి వొడ్డున తెల్లమద్దిచెట్టు పల్చని నీడలో చేపలు పట్టేందుకు సన్నాహించడంలోనే బాల్యమిగిరిపోయింది. ఉదయాస్తమయ వేళల్లో గాలిపటాల స్వర్గ రధాల విహారాన్ని కలగనడంలోనే నా పసితనం పండిపోయింది.

హఠాత్తుగా ఒక ఉదయం రణమైదానం నా ఎదుట యూనిఫాం తొడుక్కొంది. నాకు తెలీకుండా నా డేరామీద జెండా ఎగరేసింది. కత్తీ కవచం చేతుల్లో పెట్టి సుప్రీం కమాండర్ కర్కశ స్వరాన్ని విన్పించింది.

ఇక ప్రపంచం నాకు సౌందర్య మధునికుంజం కాదు. పసిపిల్లల కేరింతల పచ్చిక మైదానం కాదు, నా కలల్ని కబళించే ఖడ్గమృగం. స్వప్నం భగ్నమైన తదుపరి మిగిలే అలజడి, అంతే.

– 21-11-82

# అమృత స్మృతి

విరిగిన సన్నాయిలోంచి విఫలమై దారి వెతుక్కొంటో తేలివస్తోన్న
గాయకుని వూపిర్లా, ఒక మహారణ్య శైశిర నిశీధీ నేపథ్యం మీంచి
జారిపోతున్న శుష్కపత్ర కిరణంలా, నా ప్రవాస క్లేశపు కరకుదనం
మీద అసిధారా వ్రతం చేస్తోన్న కన్నీటి కణంలా

నీ స్మృతి నా మదిలో చీకటి వెలిగిస్తూ బాధని ఆలాపిస్తూ-

ఎవరు విసిరేసారు ఆ సుదీర్ఘ కాంతికిరణాన్ని ఏ నక్షత్ర శిఖరం
మీంచి ఎన్ని యుగాల వెనుక నా ఆత్మరుచి నెరిగి ఏ దివ్యత్వం
పృథ్వీ సుగంధం కోసం కలగని ఏ అమరత్వం ఈ జీవితపు
ధూళిలో పొర్లాడేందుకు

ఎవరు కలగన్నారు ఓ హేమంత రాత్రి ఒంటరి వెన్నెలను, ఏ
అద్భుత లోకాల్లోంచి ఎన్ని స్పందనల వెనుక నా ఆత్మ అభిరుచి
నెరిగి ఏ గాంధర్వం నా ప్రశంసకై ప్రతీక్షించి

ఇన్ని రంగులెందుకున్నాయి ఇన్ని రంగులు ఏకంగా కలిగించే ఆ
బాధలో అన్ని ఆనందాలెందుకున్నాయి ఆ ఆనందాల కోసం ఎన్ని
యత్నాలు ఎంత యాతన ఇదంతా ఎందుకు

నీ స్మృతి నా ఎదలో అగ్ని రగుల్చుతూ దేనికి? దేనికి?

నా ఇంటి వాకిట నల్లనిదేదో పామో, మృత్యువో పాము నాలికలు
చాపుతున్న మృత్యువో నా బతుకంతా సర్పఛాయ అనుక్షణమూ
మృత్యుభీతి నాకేదో దురాశ అమరత్వం కోసం యింకా

ఇంకా ఇంకా నీ స్మృతి నా స్వప్నాల్లో తలుపులు తెరుస్తూ దేనికి?
పాములున్నా మృత్యువు పొంచివున్నా ప్రళయం తిరస్కారం
అవమానం ఆకలి ఎన్నిటి నట్టనడుమనయినా

నీ స్మృతి నా బతుకును మృత్యుంజయం కానివ్వాలని! కావించాలని!

– 4-1-83

# ఫలోన్ముఖంగా

తొలి వేకువనే ఒక తీయని సౌరభమేదో పొగలు పొగలుగా అల్లుకొని హఠాత్తుగా తాకింది నన్ను. తోటలో ఒక దోరగిలిన కాయ పూర్ణపక్వమవుతోంది. దాని దయా ప్రసారమే ఇదంతా.

కొన్ని ఋతువుల వెనుక ఇలాంటి వేళనే స్నిగ్ధమైన పరిమళం నన్నల్లు కొన్నపుడు గుర్తించాను తోటలో పరాగాన్ని పంచుతోన్న కొత్త పువ్వుని

ఏ రంగురెక్కల సీతాకోక కాలికొనలకో యీ పువ్వు తాకినప్పుడు పరాగ సందేశాలు పువ్వుపువ్వుకీ ప్రవహించినపుడు సృష్టి వలయాలు రేగి అది ఫలదీకరణం చెందిన కథ నే వినలేదు, చూడలేదు

పువ్వు పిందెగా మారిన వింతగాథ నాకెవ్వరూ చెప్పలేదు

ఈలోగా ఎన్ని గాలులు వీచాయి, ఎన్ని రాత్రులు వెన్నెల వర్షించింది, ఎన్ని ఋతుపవనాలు ప్రసరించాయి, నా తోటలో ఒక కావ్యం రచింపబడుతూనే వుంది. అయినా నేనెరగను. ఈ నేలమీద ఈ ఆకాశం కింద నాకు సమాంతరంగా అజ్ఞాతంగా ఒక సంగీత స్వరకల్పన

నేనో

మరి ఆవాళ ఆకులు రాల్చిన అనుభవమే. ఒక్క చిగుర్చిన పులకింతకైనా నోచుకోలేదు. తంగేళ్ళు పూచాయి. జిల్లేళ్ళు పూచాయి. చలనం లేక స్పందన లేక పరాగం లేక కిసలయ పుంజం లేక శిథిల శిలాప్రాకారమై ఒక్క నేనే.

తొలి వేకువనే ఫలసౌరభం నన్ను శృతి చేస్తోన్న విద్యుత్ప్రకంపన

చిగురించే ఋతువు నన్నావహిస్తోంది : ఇక ఫలించే కాలమెలా వెనుక పడుతుంది?

- 25-1-83

# విఫల దగ్ధత్వం

రోజూ చూస్తున్నాను అదే వేళకి
అదే మఱ్ఱి చెట్టు వెనుక
పాతుకొన్న వూడల వొంకర్ల మీంచి
ఒక అస్తమయం

రోజూ చూస్తున్నాను
అదే తాళవృక్ష పంక్తుల వెనుక
పర్వత శిఖరాల సందుల్లోంచి
ఒక ఉదయం

ప్రతి ఒక్కరోజూ
కాంచన గంగా కెరటమై
విస్తృత సప్తవర్ణ శక్రధనువై
నా ప్రాణమై
మృత్యువై

అలలు చిట్లి కాంతి పోగులెగుర్తున్నాయి
ఆకుల మీద వర్ణ చిత్రాలు రూపొందుతున్నాయి
పొద్దు తిరుగుడు పూలు దిశలు మారుతున్నాయి
రోజూ చూస్తున్నాను
అదే వేళల్లో
పక్షులు ఆకాశాన్ని మధురం చేస్తున్నాయి

నేను మాత్రం
ఒంటరిగా
కాంతి వలయానికి దూరంగా
వెలుగు చిమ్మని జ్వలిత లాక్షాశకల ధూపంగా

– 3-2-83

# నిరీక్షణ గురించి గీతం

బాట మలుపులో నుంచి శైశిర సౌరభం
మత్తుగా జీడిమామిడి పువ్వుల గాలి
సాయంకాలం ధూళి రేగుతోన్న పొలాల మీద
వలలు విసుర్తో చీకటి

కొంగలు గూళ్ళకి మరల్తున్నాయి
బంజర్లో ఆవులు నెమరేస్తున్నాయి
ఇళ్ళ అరుగుల మీద వీధిదీపాలు వెలుగుతున్నాయి
అలిసిన బాటసారుల కోసం ఆతిథ్య గీతాలు విన్పిస్తున్నాయి

కాలం ఏటినీటిమల్లే జారిపోతుండగా
నేను మటుకు ఒంటరిగా
వికసిత శోణపద్మం
రేకలు ముకుళితం కావటం చూస్తో

హృదయాంబుజార్పణకై
ప్రతీ దినాంతం
నేను ఇలాగే నిరీక్షిస్తో

- 4-2-83

# తటస్థంగా, భయంగా, సాక్షీభూతంగా

ఎవరుబాబూ, ఇక్కడ ఖడ్గాల పంటలు పండిస్తున్నారు? ఏ అనవరత కన్నీటి ప్రవాహాలకో ఓదార్పుల అడ్డుకట్టలు కట్టి అవ్యవస్థా కేదారాల్లో అపారంగా ఖడ్గాల పైర్లు

ఎవరండీ బాబూ, దారిన పోతూన్న ముసాఫిర్లు. యీ లోకం మీ కోసం కాదా? యీ ప్రపంచం మీది కాదన్నట్టుగా మీరు నడిచేందుకే పుట్టారన్నట్టుగా విసుగూ విరామం లేకుండా రహదారి నిర్మించుకుంటో పోతోన్న కాందిశీక ప్రవాహాల్లారా

మమ్మల్ని క్షమించండి, మీ ఆకలి తీర్చలేకపోతున్నందుకు, ఖడ్గాల కంకులకి ఆత్మవంచనల కూలి కోసం కాపలా కాస్తున్నందుకు. ఖడ్గాల తోటలకి సంఘర్షణాస్పదమైన పలుచని హృదయపు పొరల కంచెకట్టి పూయిస్తున్న కత్తుల నెత్తుటి పువ్వుల సౌందర్యాన్ని కీర్తిస్తున్నందుకు

ఖడ్గానికి హృదయం లేదు, అది ఆయుధం. దాని రెండంచులూ పదునే. ఎంతకాలమూ ఒకరే ఖడ్గాన్ని ఇతరుల చావుకోసం ధరించలేరు, ఏ అనివార్య క్షణాన్నో యీ కాందిశీక కంకాళ మణిబంధాలు ఖడ్గ ధవళకాంతుల్లో ప్రకాశించి ఏ తప్పనిసరి మలుపులోనో పెంచినవాళ్ళ కుత్తుకలుత్తరించి, శాసిస్తున్న వేళ్ళతో శాసకుల కళ్ళు పొడిచి–

ఒక్క మేమే బాబూ ఎటూ పాలుపోక ఏ వైపూ కాలేక యీ మహాయజ్ఞానికి తటస్థంగా, భయంగా, సాక్షీభూతంగా, కాని ఆంతర్యపులోతుల్లో ఏ మూలో ఒకింత ఉద్రేకంగా, ఆనందంగా–

(అసాం ఎన్నికల్లో ప్రభుత్వం అవలంబించిన దమననీతికి నిరసనగా)

– 22–2–83

## అనాచ్ఛాదిత

పోదాంపద. వొయసూ వార్ధక్యమూ లేని నీ చిరునవ్వులు పొంగే రహస్యలోకాల ద్వారాల మీద అస్పష్ట మాధుర్యపు భాషలో రాయబడ్డ స్వాగత గీతాల్ని ఆలకించేందుకు.

సంకుచిత మేధాసీమావధి కావల అనన్య సాధ్యమైన మార్మిక స్వప్న ప్రాంగణపు ద్వారాల్ని వెలిగించిన సంధ్యా దీపాల కంతి పోగులతో నా హృదయానికి పరదా అల్లుకొనేందుకు. నా అనుభూతుల్ని కన్పించీ కన్పించనట్లుగా కప్పే కవిత్వపు ముసుగు అలంకరించేందుకు

పోదాంపద. శైథిల్య శర్వరీ ఛాయలు సోకని నిత్య నిరంతర వెన్నెల వాన పొరలే నీ కన్నుల దుర్గమ మైదానాల్లోకి సాగేందుకు

నాక్కావలసింది నువ్వే

ఏ ఆచ్ఛాదనల ఆత్మవంచనలూ లేని ఏ అసమర్థ శబ్దాల అపరిపక్వ భాషలూ లేని ఏ అశక్త మిడిమిడి పాండిత్యాల్లేని ఏ కృత్రిమ లజ్జాలేని నగ్నవై నాక్కావలసింది నువ్వే

వెన్నెలలు నిశీధి హిమపాతాలు బిగిసిన పర్వతాలు యిసిక తిన్నెలు ప్రవాహాలు గుహలు రహస్య దుర్గాలు పువ్వులు పుప్పొడి మకరంద మాధుర్యాలు వీటికి భాష లేదు, బంధం లేదు. ముసుగు లేదు ముసిలి తనం లేదు... యివన్నీ వుపమింపబడి యినుమడించి ప్రకాశించే నీ నగ్న శారీర సత్యానికి, నిజం మృత్యువు లేదు.

పోదాం పద, అమృత స్వప్న సరసులో జలకాలాడదాం, ఒకళ్ళ నొకళ్ళు ఐక్యానికై దేహాల్ని పెనవైచుకొని...

– 24-2-83

## A POEM EXPERIENCED

పాటకోసం ప్రతీక్షించి అలసిపోయాను, ఈ నదీ తీరాన్న ఒక పని దినాన్ని వృథాగా గడిపేసాను.

పాట ఏ దిశగా ఎగిరి వస్తుందో తెలియదు. ఏ దూర గ్రామాల దేవాలయ ప్రాంగణ వృక్షాల పచ్చగన్నేరుపువ్వులో యీ పల్చని నీటి మీద తేలిరావడం చూసాను గాని – పాట రావడం మటుకు కనరాలేదు.

విపణి వీధుల్లో చతుష్పథాల్లో సమావేశ భవనాల్లో పారిశ్రామిక కేంద్రాల్లో నా మిత్రులు పనిలో ఉండిపోయారు. నేను మాత్రం ఏదో అంతర్నిహిత సంగీతం కోసం దిగంతాల్ని తడుముతో ఇక్కడ నిల్చిపోయాను.

పాట ఏ హంగామాతో ఎదురవుతుందో తెలియదు. ఏనాడో ఋషులు పాడిన సూక్తాలు మాత్రం ఉదాత్త అనుదాత్త స్వరాల్లో దేవాలయమంతటా మోగుతోన్నాయి. నగరం తన దైనందిన పాఠం చదువు కొంటోంది బుద్ధిగా.

ఎవరికీ అక్కర్లేని ఓ సుకుమారి పాటకోసం యిలా యీ మిసమిసలాడే రావి ఆకుల లేత ఎండలో సోమరిగా ఒక్కణ్ణీ --

రేవులో పడవ కదిలింది, ఆవలి వొడ్డుకు చెందిన ఏదో జాతర కోసం కిక్కిరిసిన జనాల గోలతో -- ఈవలిగట్టున ఒక్కణ్ణీ శేషప్రశ్నతో

పాట నాకు ఎదురు కాలేదు, కాని తెలియని ఏదో అనుభవంతో గుండె బరువెక్కింది.

– 19-4-83

# నిద్రిస్తున్న స్వప్నం

ఒకప్పుడు రుధిరం తాగిన
చాళుక్య యుగపు కత్తి
మ్యూజియం షోకేసులో నిర్నిమిత్తంగా నిద్రిస్తో --

ఇరవై యేళ్ళ వసంత లక్ష్మి
ఇంకా దాగుడుమూతలాడుతోంది నాతో --

విప్లవ వీరులు
అడపాతడపా కలుస్తోనే వున్నారు
ఏవేవో చెయ్యాలంటో --

విశ్రాంతి దినాలు పని దినాలుగానూ
పనిదినాలు ఇబ్బందికరంగానూ
జీవితమే అసౌకర్యంగా --

నీ కోపావేశాలు ఇంకా అలానే వున్నాయా
చిన్నప్పటిలా
అని ఉత్తరాలు రాస్తో పాత మిత్రులు

నేను చచ్చిపోయాననుకొనేవాణ్ణి
కాదు
నేను పురావస్తువునయిపోయి
నిశ్చింతగా నిద్రిస్తున్నాను

రోజూ నా సైకిల్ మీద
ఒక అపురూప స్వప్నం
ఊగుతో : తూగుతో : జోగుతో

– 8–5–83

# మజిలీ కోసం యాత్ర

ఈ భాష శూన్య ఉష

చెప్పాలనుకొంటే, నిజంగా
మొదటి ప్రతిబంధకం శబ్దం

కాలాతీకుణ్ని కావాలని ధ్యానం కావిస్తూంటానా
హఠాత్తుగా గుర్తొస్తుంది టైం ఎంతయిందని

ఆగామి ప్రళయం నుంచి
నూతన సృష్టికై జన్యుకణాల్ని భద్రంగా
ఓ నావలో ఇమిడ్చిపోతాను

మనువునై
ఏ మూలో బెజ్జం పొడిచి మరీ

గోదావర్ని దోసిటపట్టి
వొలికించాలని వూహ

ఎవడన్నాడోగాని
అవును మనిషి దారి తప్పిన మృగమే

లక్ష్యానికి మార్గమే ఆటంకమా?

రహస్యం చెప్తున్నాను
ఆటంకాన్వేషణే మన అసలైన లక్ష్యం

- 14-5-83

# జన్మ మృత్యు పరిష్వంగం గూర్చి

సూర్యకాంతి ఇవాల్టి దుస్తులు విప్పేసుకొంటున్న వేళ
నగ్న పృధ్వీ వక్షం పైన చీకటి పెదాలు వాలినవేళ
నిస్తబ్ధ క్షణాన మిత్రురాలి యింట్లో ఒక మృత్యువార్త
నల్లని అడవిపళ్ళు రాలిపోతూన్న చప్పుడు మహారణ్యాలు తుఫానులో, కూలుతున్న
దృశ్యం అటూ యిటూ చెదిరిపోతాయి మృగాలు

ఆమె పైట కొసతో కళ్ళు తుడుచుకొంటుంది
ఆ దు:ఖితురాలి గుండ్రని భుజాల మీద ఓదార్పుని ముద్రిస్తాను
వాసాంపి జీర్ణాని యథా విహాయ-
శూన్యోద్వేగపు నిరాకారకుడ్యం నిర్మితమవుతుంది

తోచీతోచని నిర్వ్యాపారపు జడిలో ఆగీ ఆగీ వెక్కిళ్ళు
దూరపు కొండలు మరింత నీలమెక్కుతాయి మైలు తుత్తంలా
పొటాషియం పర్మాంగనేటు ద్రవం కొండల మీంచి జారుతుంది
ప్రతీకలేవో స్ఫురిస్తుంటాయి
ఎదుట నిల్చిన బాధ నుంచి తప్పించుకోడానికి

బాధ నాది కాదు, నా ఎదుట వున్న ఆమెది
ఆమె కొన సోయగాలు పలికే కళ్ళ మీద
సాంద్ర తిమిర పటలం గంభీరంగా నిలుస్తుంది, ఎవరి బాధయినా
చివరికి నన్ను బాధించడంలోనే పరిపూర్ణమవుతుంది

తన బాల్యం నుంచి విడుదలయినప్పుడు, ఆమె ఏదో కోల్పోయిన
ఆక్రందన చెయ్యలేదు, మరి మృత్యువు ఇవాళ ఆమెనెందుకు నొప్పించాలి?
ఏ రోజు అనుభవాలనయినా సంధ్యాశూన్యంలో అంతమవుతాయి.
ఇన్ని దినాల అనుభవాల నవ్వుల ఆనందాల చరమవాక్యం ఎక్కడ విన్పిస్తోంది?

మృత్యువులోకి చేరటంతో నేను మరో కొత్తజన్మ ఎత్తుకున్నాను
ఒక ఎగశ్వాసకీ మరొక ప్రసవవేదనకీ మధ్య విరామమే
మనకి అర్థం కాని కవిత్వం, ఇంక ఓదార్పులెందుకు?
చిట్టచివర నా వొంటరి మృత్యు శయ్య మీద కూడా
యీ ప్రపంచం నన్ను కావలించుకొనే వుంటుంది.

- 10-5-83

## సంగమం

శిలాయుగాలు తెచ్చిన రాపిడి మీద మనిషికి ఆవాసజ్ఞానం అలవడింది.

అక్కణ్ణుంచే ఆస్తీ కుటుంబమూ రాజ్యమూ హాలీవుడ్‌తారలూ

నా రూమ్ గోడలమీద అమృత షెరిగల్ బొమ్మల్ని గీసి రంగు చెయ్యాలని వుంది. ఇరుకు చతురస్రాన్ని దీపాల్తో ముగ్గుల్తో స్మృతుల్తో అలంకరించాలి

అనంతపుర ద్వారాలు తెరిచి ఆమె వచ్చినపుడు నా రాసిన కవిత్వాన్ని సంపెంగ పూల మధ్య అర్పించాలని వుంది

గతించిందంతా చరిత్ర పూర్వ శిలాయుగం, ఇపుడిపుడే స్థిరంగా నిలిచి కాలి కరిగి వెలుతురవుతున్నాను

వేటా విల్లమ్ములూ కుడ్యచిత్రాలూ ఇక నా మనోదుర్గం వరకే. ఈ కాస్త ఆవాస స్పృహ కరిగి రేపటి వరదై అనంతానంద సాగరంలో సంగమించేందుకే

– 8-7-83

## ఒక స్త్రీ వక్షం కోసం

ఒద్దు. నన్నిక్కడికి తీసుకు రావద్దు. తెచ్చినా, నా కళ్ళుమూసి మరీ తెచ్చుకోండి

ఈ ఆకుపచ్చని వలయాల్లోంచి శైలశిఖర చూచుకాలు నల్లని ఆదిమ నగ్నదేహ స్పర్శాకేంద్రాల్లా నిక్కిన ఈ కారు తమలపాకు రుచిలోకి నన్ను తేకండి

సంధ్యాకాలపు పల్చని వెల్తుర్లో ఒక మెడవొంపు గాఢమైన ఛాయలో బరువెక్కిన దృశ్యానికి నన్ను తీసుకు పోకండి

అసలే జ్వరపీడితుణ్ని

నీటిలో తడిసి ఏకాంతంలో వెచ్చబడి ఉద్రేకించి స్పృశించరాని చీకట్లను మెత్తగా ఎగదోసి నల్లని నాలుకలు పాకుతోన్నవేళ – ఎందుకు నన్ను తేవడం రేపో అటుపైనో తీసుకుపోవడం

ఔదార్యమే ఉంటే మార్పులేని, చలనంలేని, ఆద్యంతాల్లేని చిక్కని చీకటిని వరమివ్వండి

ఒక కొత్త జీవిత కాలానికి ఒక స్త్రీ వక్షం కోసం అన్వేషిస్తూన్న నాముందు ప్రపంచాన్నంతా పరచండి

– 13-7-83

# ఎటు దారి?

ఈ చతురస్రంలో ఎందుకిట్లా ఇరుక్కున్నాను?

నా కాళ్ళకు నాలుగు చెరగులా సంకెళ్ళు. పొగరుమోతు జంతువుకు గుదిబండ తగిల్చినట్లు, బరువు నింపుతూన్న నౌకకి లంగరు వేసినట్లు నన్నెవరిలా బందీ చేసారు?

ఈ కిటికీలోంచి అప్పుడూ అప్పుడూ ఓ తొలివెలుగుచార, రవంత వానతుంపర అదృష్టవశాన అరుదుగా ఓ వెన్నెలరేఖా, ఇందులోంచి నే నెందుకు కదల్లేకున్నాను?

ఎన్ని ఒంకర్లు పోయినా ఎంత కంపించినా ముసిలి పడవ సరంగు దిక్సూచి ముల్లు ఉత్తరం వైపే నిల్చినట్లు, ఎన్ని వుల్కలు ఎన్ని నక్షత్రమరణాలు సంభవిస్తోన్నా చలించని ధ్రువతారమల్లే -- తిరిగి నా కాళ్ళు యీ వూబివైపే ఎందుకు నడుస్తాయి?

నిజమే. ఈ అలమారుల్లో నా జీవిత స్వప్నాలున్నాయి. ఎంత పొంగిన వుద్రేకాన్ని గుండె ఉక్కుతెరమాటున అణచి ముద్దుకైన పెదాలన్దివ్వని మూర్ఖ స్నేహితురాలి ఆర్తి పలికిన అక్షరాల్తో నా అల్మైరాలు బరువెక్కాయి.

అయినా తప్పదేం ఎటో పారిపోక?

సాలెగూటి తెరలు బరువెక్కి చిక్కిన యీగల్నిజార్చుకొన్నట్లు -- నా జీవిత భారంతో ఎంత కుంగుతున్నాను

ఎటు ప్రయాణం?

కలల్లోకా? మలయా తగరపు గనుల తెల్లదనాల్లోకా? మురికి యిసికవీధి కుర్రసానిదాని యోని దుర్గంలోకా?

- 14-7-83

# నిర్వికల్ప సంగీతం

ఈ లేతవీణ మీద ఎప్పుడు ఏ రాగాన్ని శృతి చెయ్యాలో నీకు తెలుసు. నీ అగాధమైన అంతరంగంలోని ఏ సంకల్పమో గొప్ప గీతంగా యీ లోకమంతటా మోగుతుంది. తన తీక్షమైన సునిశితత్వానికి తానే కదిలి ఒణికిపోయి నీసంగీతం బేలగా నిన్ను చూస్తుంది. అప్రత్యాశితంగా దయ ఒలికే నీకళ్ళు ఎటో చూస్తుంటాయి. నీ సంగీత జీవనార్తి నీ నిశ్శబ్దాన్ని తాకి నీ చుట్టూ విఫలంగా పర్చుకొంటుంది.

ఒళ్ళెరగని ఆవేశం నుంచి హఠాత్తుగా ఉలికిపడినపుడు కన్నీటిజాలు తప్ప మరేమీ మిగలదు. ఏ దూర మలయాదేశాల రబ్బరు తరుకాండాలో పాలు ఒలికిస్తాయి. వెనకా ముందూ తెలియని కారణాల నిష్ప్రయోజనం మధ్య కన్నీరు నీ నైవేద్యంగా పేరుకొంటుంది.

నేను హఠాత్తుగా నీ నుంచి వేరయి నిన్ను ప్రశ్నిస్తాను. అర్ధరాత్రి వాన తుంపరలో నదీతీరాన జీవితపు నిరర్ధకత బోధ పడినప్పుడు నా కన్నీటి సంపద విలువ నన్ను ధైర్యంగా నిల్పుతుంది. ఒక్కణ్ణీ నాగది తలుపులు తెర్చుకొన్నప్పుడు నిశ్చల చిత్రం లాంటి ఆ గది మానససరోవరంలా చేరదీస్తుంది. హాయైన హిమాలయ పవనంలా నాపైన నేనే ఆనందంగా సుగంధం వర్షించుకొంటాను.

నీ దివ్య హస్తాల్లో యీ లేతవీణ వొద్దిగ్గా అలానే శబ్దం నిశ్శబ్దమై, నీ సంగీతం నీలోకే ప్రవహిస్తుంది. అలసిన నా కన్రెప్పలపైన ఒక సుకుమార వేదనానుభూతి నందివర్ధనం పువ్వులా నిలుస్తుంది.

\- 19-7-83

## అజంతాగారు నా కవిత చదివినప్పుడు

ఒక నిర్ధూమ సజీవాగ్ని శైలహస్తాల్లో
నా కవిత్వాన్నుంచి బెరుగ్గా ఎదుట నుల్చునాను

చిన్ని గడ్డిపోచ
వసంత స్పర్శ తననెట్లా తలమున్కలు చేసిందీ
వచ్చీరాని భాషలో చెప్తే ఎవరికర్ధమవుతుంది
ఒక్క దండకారణ్య సాలవృక్ష సమూహాలకు తప్ప

కవిత్వాన్ని
ఇవ్వగలిగితే అమృత హృదయుల కియ్యి
లేదా అగ్నికెరజెయ్యి

అనార్ధ్ర ప్రపంచం పరిహసించే వేళ
అజంతభాషా సాదృశమయిన వైశ్వానరకీలల ఔత్సుక్యమే
నీ కవిత్వపు అసలైన గమ్యం

నిజానికి
ఒకింత అందమైన మాట పలకాలన్నా
విశిష్టానుభవ నికషం పైన గణన తేరిన
మహా జీవితం నీ ఎదట ఉండాలి

ఆయన నా కవిత్వాన్ని ప్రశంసించాడు
నే నాయన
జీవితం ఎదుట కైమోడ్చాను

– 2-8-83

# మిత్రుని తండ్రి మృత్యుశయ్యపై ఉన్నపుడు

మీకు తెలియనిదేముంది?

శూన్యాకాశ హారం నుండి ముత్యంలా ఓ వానచినుకు తెగి జారి ఇలపై బడినప్పుడు
అప్పుడు మనం జీవించింది నిజంగా

మీకు తెలియనిదేముంది?
సాగ జలాల్లోంచి ఒక నీటి కణం శూన్యానికెగిరినపుడు
అప్పుడు, మనం జీవించింది నిజంగా

బతికిన ప్రతిక్షణంలో మనం బతికాం
మరణించిన ప్రతిక్షణంలో మనం బతికాం....

కెరటాల మల్లే జీవితం పెరుగుతూంటుంది
అవును, కెరటాలమల్లే జీవితం విరుగుతూంటుంది

కెరటాలు ఆగవు
నిరంతరోత్సాహప్రేరిత జీవనహేల ఆగదు

మీకు తెలియనిదేముంది?

మన ఒక్కొక్కరి జీవితమొక్కొక్క సముద్రమై
ఆ అసంఖ్యాక సాగరాల తరంగాలు
ఈ విశ్వ సాగరం మ్రోల
అనవరతంగా

ఒక విచిత్ర నాటకాన్ని సమకూరుస్తాయి
నీటి తెరల దారాల మీద ఇంద్ర చాపాల రంగుల్తో
ఒక మాయా గాధని...

– 24-8-83

# నా కవిత్వం

ప్రజలకోసం కాదు. సాహిత్య విమర్శకుల ఆమోద ముద్ర కోసం కాదు. నా కీర్తి కోసం కాదు, నిజానికి నా కవిత్వం మీకు తెలిసిన కారణాల వల్ల కాదు

నా తృష్ణ, నా ప్రశ్న, నా తత్త్వం, నా అభిలాష, ఒకటేమిటి? నా చైతన్యమంతా ఎల్లల్లేని నా హెూంసిక్‌నెస్ నుంచి పొంగిందే --

ఎప్పుడో ఏ కాలంలోనో ఎక్కడో కోల్పోయిన ఏదో అమూల్యమైనదాని ఛాయతోనూ, జ్ఞాపకంతోనూ, వెచ్చని కన్నీటి చారల చెంపలకు చేతులాన్చుకొని అపుడూ అపుడూ పలికిన ఉన్మత్త ప్రేలాపన నా కవిత్వం

సూర్యోదయాస్తమయాల్లో వానాకాలపు అరణ్యాల జీబురుగుహల్లో వేసవి మధ్యాహ్నపు నిర్వేదంలో వెన్నెల్లో ఏదో అస్పష్ట స్వర్గం కోసం, చేజారిన సామ్రాజ్యం కోసం బతుకంతా ఒక ప్రతీక్షగా, ప్రజ్వలిత హృదయంతో అనాదేశానికి పోయేందుకై నిరీక్షిస్తూన్నపుడు అపుడూ అపుడూ నా నుంచి రేగిన పొగ నా కవిత్వం.

యూరప్ చరిత్ర, భారతీయ వేదాంతం, స్త్రీ వక్షం, సాదుకవుల వేదన, జన్మ భూమి ధూళి, విప్లవ పరిమళం, కాలాతీత నిర్వికల్ప సంగీతం అపుడూ అపుడూ నా ఆత్మని కావలించుకొన్నప్పుడు పుట్టిన వెచ్చదనపు మత్తు... అది నా కవిత్వం.

- 12-9-83

## సంశయగ్రస్త గీతం

I can understand the hesitation of my generation............
It is the thousand forgetting of the dream dreamt a thousand times and forgotten a thousand times.

— Franz Kafka (Investigations of a dog)

భలే. ఎంతకాలమయినా ఇలా.
కాని యీ ప్రవాహం తీరాన ఇలానే

స్పష్టంగా తెలుస్తోంది
అది అంచూ అవధీ లేని మహాప్రవాహమని

ఆనందపు సురాస్వాదనతో
మత్తెక్కిన గానాబజానా తండాలు

అర్ధరాత్రి శిబిరాల మధ్య
నెగళ్ళ చుట్టూ నృత్యాలు

నా ఒంటరి కలల్ని కుదుపుతూ

లోతు తెలుస్తూంది
జీవితంలో సూనృతం గోచరిస్తూంది

కాని లోతుల్లోకి దూకనూ లేక
ప్రవాహంలో పడి కొట్టుకుపోనూ లేక

ఈ ఒడ్డున యీ యిరుకున యీసంశయాన
నా తండ్రీ, ఇంకెలా?

- 1-11-83

## వెళ్ళిపోతున్న వరదల్ని వెనక్కి లాగాలని....

వెళ్ళిపోతున్న వరదల్ని వెనక్కి లాగాలని
ఎందుకో ఇంకా యీ వెర్రి కోర్కె నాకు

వరదలు ప్రవహించి పోయిన
జేగురు రంగు పంటపొలాల్లో
సాయం సంధ్య వుసురుమని కూలబడే వేళ
మలిన పక్షాల కొంగలు మిడతల్ని వేటాడే చోట
పొర్లిపోయిన భీభత్సపు బాధాపరిష్వంగ సుఖాన్ని
పదేపదే స్మరించుకొంటో
దాటిపోతున్న వరదల్ని వెనక్కిలాగాలని

ఎందుకో ఇంకా యీ పాడుకోర్కె నాకు
నిర్మల శరదాకాసం కింద
రెల్లుబయళ్ళని మెత్తగా తాకుతో
సెలయేళ్ళు ప్రవహించాలని కలలుగన్న నాపై
వరదలు వరదలు వరదలు

అప్పటికీ,
నిలవనీయకుండా కుదిపే యీ మురికి వరదలని
వెనక్కి లాగాలని కావలించుకోవాలని
ఎందుకో ఇంకా అర్థం లేకుండా నాకు !

- 2-11-83

## శుక్రుడూ, అంగారకుడూ

ఒకవేళ జీవితానికి అర్థం వున్నా అది స్పష్టాస్పష్టంగా వుండే ఆ నిశాంత వేళ హఠాత్తుగా నా చూపుల్ని వొడిసిపట్టుకొన్నారు వాళ్ళిద్దరూ

ఒకరు బృందావన వంశీ మోహన లాలన పున్నాగ పువ్వల్లే ఇంత వెలుతురు ముద్ద

మరొకరు, ఈ గ్రహశకలం మీద తన అస్తిత్వ నిర్ధారణకై తనే ఓ ప్రశ్నయి నిలిచిన యీ శతాబ్దపు మనిషి కంటి జీర

శ్వేత శోణ కాంతుల దారాలల్లిన నిశావస్త్రపు ఆవలి చివర నిశ్చయంగా ఒక సూర్యోదయం

నా రక్తంలో నా వీర్యంలో ఒక భావి ఉదయానికై సంగమించి ఒక శుక్రుడూ ఒక అంగారకుడూ

- 5-11-83

## అగ్నిప్రవేశం

అందమైన ప్రతి ఒక్క అనుభవమూ మృత్యువే. అయితేనేం, అందమైన మృత్యువు.

నిరర్థకమైన శూన్యపు తిమ్మిరిలో నివురులో కాల్చిన కర్రపెండలం దుంపల్లాగు రోజులు గడిచే జీవితం మృత్యువుకన్నా దారుణం

ఏ జ్వాలలో ప్రొటోప్లాజమ్, క్రోమోజోములు రక్తనాళాల్లోని ఉధృతం హృదయ కంపనా సున్నిత రహస్య చర్మం వొణికే గిలిగింతలు

ఒక్కపట్టున చెలరేగి నా స్పృహని అడివి మృగాలయి చీల్చుకు తింటాయో ఆ దుర్మరణం నాకు అత్యంత ప్రియమైన జీవిత విధానం

- 6-11-83

# నిర్లిప్త నిర్వికార గీతం

వెనకెప్పుడో వర్షాకాలపు రాత్రులంటే
మహామోజుగా ఉండేది.

చితుకుల మంటలతో
చిక్కుడు కాయకూర, వేణ్ణీళ్ళస్నానాల్తో
శీతాకాలాన్ని యీదే వాళ్ళం

మీ ముందు ఒప్పుకొంటున్నాను
ఇప్పుడలాంటివేం లేవు

పెద్ద జబ్బులు పై తరహావి లేనే లేవు

జీవితం ఇప్పుడేమంత
ఉపద్రవకరంగా లేదు

నా ఆఫీసు కుర్చీలో కూలేందుకు
శరీరం మునుపటిలా సంశయించడం లేదు

ఇంకా ఎన్ని పనులు చేయాలి
పెళ్ళాడి, పిల్లల్ని కని, చదివించి
వాళ్ళకి మొగుళ్ళనీ ఆఫీసు కుర్చీల్నీ
డబ్బులు పోసి కొని తగిలించి-

పర్వాలేదు
జీవితం ఇలానే ఇంకా బహుకాలం వేలాడుతుంది
పెద్ద ప్రమదాలేం ఉండబోవు

- 7-11-83

## నాకర్థం కాదు

వైశాల్య పరిమాణాలు తెలియని చీకట్లో ఒక్కణ్ణీ
ఇది సొలిటరీ యింప్రిజన్మెంటు

సరే. అంచుల్లేని ఆకాశవీధిలో ఎగిరే ఒంటరి కొంగ
ఆహా. అది స్వేచ్ఛకు సూచిక

అవధుల్లేని అరణ్యమధ్యాన ఆకలితో సంచరించే ముసిలి సింహం
అయితేనేం, అది మృగరాజు

అగాధమైన సాగర గర్భాన పిల్ల చేపల్ని వేటాడే పిరికి తిమింగలం
ఓహో, అది బలానికి ప్రతీక

కాని, నా కర్థం కాదు.

జనారణ్యాన ఒక్కణ్ణీ అయి
మృగన్యాయాన్ని అంగీకరించని
దిక్కులేని నా బోటివాణ్ని దుర్బలుడంటారేం మీరంతా?

- 8-11-83

## అనలం, అమృతం

కావటానికి నా స్వప్నాలు ఉదయపు మంచులో రాలిన పారిజాతాలే. అయితేనేం వాటికి చురకత్తుల కాపలా తప్పనిసరి.

నిజానికి ఎవరు ఒక చేత కృపాణ జ్వాలనీ మరొక చేత పారిజాత సుగంధపూర తుషార బిందునీ ఏకకాలాన ధరించగలరో వారే జీవితాన్ని జీవిస్తారు.

- 9-11-83

# సత్యపూర్ణ

కైరో మైదానాల ఫారవో గోరీల్లోంచి, రోమన్ మహా పథాల పైన తెగిపడిన బానిసల శిరసుల పంక్తుల్లోంచి గణతంత్రాల మీద గుర్రాల్ని స్వారీ చేయించిన అజాత శత్రువు సేనల్లోంచి, విజ్ఞానుల్ని చతుష్పథాల్లో సజీవంగా కాల్చి చంపిన యూరప్ నగరాల్లోంచి చరిత్రకి అణుధూమపు ధూపం వేసిన శతాబ్దంలోంచి ఒక్కణ్ణీ ఓపికతో నా శ్వేతోత్పలాన్ని అనురక్షించుకొంటో వస్తోన్నపుడు

మధ్యాహ్నపు మఱ్ఱిచెట్టు నీడన బోధిసత్వుని హృదయంలాంటి మేకపిల్ల మెత్తని నిద్ర వెనుక శాంత నేత్రాల్తో నిల్చి నన్ను ఓదార్చింది సత్యపూర్ణ

నా మానస సరోవర రాజహంస.

ఇప్పుడెక్కడున్నావు సత్యపూర్ణా?

క్షుబ్ధ నిశీధివేళ పట్టణాలు వానలో చివికి పోతున్నపుడు ఆ సుదూర గ్రామంలో ఆ కుటీరాన వెన్నెల రెల్లుదుప్పటి పరచి స్వప్ననౌకలో కాలాన్ని యీదుతో ఏదో పరదేశపు పాట పాడావు గుర్తుందా? ఇంద్రచాపాల పతాకాల్తో పర్వతాలు గోడలు కట్టిన ఏకాంత ఉపత్యకల్లో నాకు నగ్నవై సాక్షాత్కరించినప్పటి చుంబిత దేహ ప్రకంపనలు జ్ఞాపకమేనా! ధూసరిత సాయందినాల సంధ్యాసింధూరపటలం మీంచి కాల సరీసృప గళంలోకి రక్త రోచిర్మండలం మెల్లగా జారుతోన్నపుడు భయంతో వొణికి నన్ను కావలించుకొన్నది నువ్వేనా? ఆకలితో పిల్లలు శోకనగారా మోగించే నిద్రిత మహా ఖండాల మురికి సందుల్లో చూర్ణకుంతలవై అనాధవై అశ్రుసిక్త కపోలవై బేలవై నా కళ్ళలోకి సూటిగా ప్రశ్నించింది నువ్వేనా? మనల్నీ మన తమ్ముళ్ళనీ దగా చేస్తున్న మహాపెద్దవాళ్ళందర్నీ సబర్మతి సాక్షిగా క్షమించి పొమ్మన్నది నువ్వేనా?

ఎప్పుడు కలుస్తాం మనం తిరిగి సత్యపూర్ణా?

పూల దర్బారుల్లో వింత రెక్కల కవయిత్రులు ముషాయిరాలు చేసేవేళ వికసిత కుట్మలాల్లో మకుట దళాల మీద రంగులు అద్దబడే వేళ మధ్యయుగీన సాధు కవుల సుకుమార వేదనా పల్యంకికలో ఈశోపనిషద్ గానం చేస్తూ ఏ పౌర్ణమి రాత్రి నాకు కబురంపుతావు నా సత్యపూర్ణా!

– 15-11-83

# సంధ్యా వందనం

సింధూర వర్ణ పక్షాలతో సంజపిట్ట నిశ్శబ్దంగా నా బల్లమీద వాల్తుంది. గాజు బరువులోంచి రంగురంగుల గీతాలు వలయాలై నా కాగితాలపై ప్రజ్వరిల్లుతూ ఉంటాయి. కాగితాల కట్టలు కుడి ఎడమ స్థానాల్లో చిన్ని చిన్ని జెండాలు తగిలించుకొని నన్ను బలమైన స్థంభానికి కట్టి పడేసిన మోకు చుట్టూ యీగల్లా ముసురుతుంటాయి. నెమరుమేస్తూ, అందమైన తోకతో యీగల్ని తోలుతూ, దివ్యత్వాన్ని అందుకోవాలని పరితపిస్తాను.

ఇలాంటివేళల్లో ఒక శాలువా అయి ఆ కాంతి నా చుట్టూ తనని తాను కప్పుకొంటుంది. నేను శాలువా పూలు పరీక్ష చేస్తూ కాశ్మీర్ లోయల్లో దేవదారు వృక్షాల వెన్నెల నీడల్ని గీస్తూ వుంటాను. నా బంధాలు అపుడపుడు బిగుస్తూ నన్ను నీడల్లోకి లాగుతుంటాయి. లోయలలోకి జారుతూ అంచుల మీది కాంతిరేఖల్ని ఒదల్లేక దు:ఖిస్తుంటాను.

గాజు అద్దాల పగుళ్ళ వెనగ్గా ఆకుపచ్చని కదలికలు రెపరెపలాడుతుంటాయి. సంధ్యావిహంగపు రాలిన రెక్కలు తళతళలాడుతుంటాయి. నాపై వాడికేక నా ముఖాన్ని ఈవలి వైపుకు తిప్పుతుంది. మౌనంగా వాడి అధికార స్వరానికి తలొంచుతాను. ఇక అప్పుడు నా శరీరం పైన రాగిరంగు కాంతి ముద్దలు ముద్దలుగా జారడం కన్పిస్తుంది.

నన్ను బరువైన తరంగాల్తో పీడించే సంధ్యకి మౌనంగా వందనమిస్తాను, ఏమిటా పరధ్యానమని వాడు నన్ను కసురుకుంటాడు.

– 28-12-83

## తురీయం

స్పష్టంగా ఏదో ఒకదాని గూర్చి
ప్రకటించాలని
ప్రతి ఉదయం నిశ్చయిస్తాను

నారింజ పువ్వుల పొగమంచు
వెన్నెల్లో మామిడిపూతల సంధ్య
స్వప్నాల్లో ఆకుల రెపరెపలు
వింత వింత త్రికోణాల పలుముఖాలు

అంతా అస్పష్టం, పిమ్మట నిశ్శబ్దం

దేని గురించీ ఏమీ చెప్పలేని
ఏదీ ప్రకటించలేని
నిరామయస్థితిలో
చీకటిపడేసరికి మెలకువ ఉదయిస్తుంది

అంతా అగమ్యం

– 19.1.84

# బలి రక్కసిపూవు

దేన్ని కేంద్రంగా
నా బాధాభావ ధోరణులు
స్వయంగా వలపన్నుకొని
ఇరుక్కొంటాయో గాని
ఒఠి ముళ్ళకంపగా
మటుకే కానవస్తున్ననట నేను.

తెలియరాని ఆ కేంద్రం
వేళ్ళుదన్నిన నేల స్వభావమేమోగాని
పనికిరాని మొక్కనని
తొలగిపోతున్నారట యీ
లోకపు ప్రజలు

నా లోపలి రసాయనాలు
ప్రపంచానికై మధనపడి
నా కన్నుల్లో వర్షించే సుకుమార కారుణ్యం
ఒక వ్యధానుభవ పుష్పం.

కాని యీ జనులందరికీ
ఒట్టి ముళ్ళ తీగెకి పూసిన పువ్వు
పచ్చబడ్డవాళ్ళ కళ్ళల్లో
వొందలు వేలు బలిరక్కసిపూలు

- 21-1-84

## బతికిన క్షణాలే బతుకును గెలిపిస్తాయి

యంత్రం నిర్దాక్షిణ్యంగా తిరుగుతూంటుంది.
ఏ రంగాన్ని స్పృశించబోయినా జీవితం సంకోచిస్తూంటుంది.

కాని, ప్రతిరోజూ దీపం వెలిగించినప్పుడూ
నిద్రకుపక్రమించే వేళ నా అనుభూతిని యిష్టంగా
పరిస్పర్శించినప్పుడు
దేహాల మృత్తికలోంచి నూత్న సృజనాంకురాలు ప్రభవించినప్పుడూ
అప్పుడు మాత్రం యంత్రం ఒక్కసారి ఆగుతుంది.
పువ్వులు వికసిస్తాయి, వెన్నెల వర్షిస్తుంది
భారమైన భవిష్యతీరాల్లో పసిపాపలు ఆటలాడతారు.

– 8-2-84

## గృహోన్ముఖంగా

ఎప్పటిదో ఒక జ్ఞాపకం,
పసుపు రేకల తెల్లగన్నేరు పువ్వుల్నేరుకొని
తెగపరవశించిన జ్ఞాపకం

ఇప్పుడు
ఆ జ్ఞాపకాన్నే పాడనా? లేక,
అగోచర భవిష్యయుగాల గూర్చి పాడనా?

– 9-2-84

# కవికోకిల

దుఃఖాన్ని పాడేందుకు నాకెలాంటి అభ్యంతరమూ లేదు,
కానయితే, అది నాకు వీలుకాని పని.

సాశ్రు నయనాల్తో నా ఎదట ప్రపంచమనే పసిపాప
నిల్చినపుడు
ఎలా ప్రయత్నించి ఆ చిన్నారి కనుల నుంచి అశ్రువులు
చెరిపేదా అనే యోచిస్తాను. కానీ,
అదే అదనుగా నా గళం సవరించి కచేరి సాగించలేను.

ఇక ఆనంద సమయాల్లో అంటావా?
అప్పుడు పాట నా ప్రమేయం లేకుండానే గొంతు
తెరుచుకొంటుంది.
గొంతువిప్పిన గాన పరాగం యీ మానవారణ్యమంతటా
విస్తరిస్తుంది, నా నిమిత్తం లేకనే.

ఇదీ నా స్వభావం, పక్షులదీ ఇదే, ఏమంటే
వసంతంలో వెర్రిగా రాగాలు పోయే కోయిలలు
శిశిరంలో పాటలు పాడిన దాఖలాల్లేవు

\- 12-2-84

## మా కవిత్వం

ఇవాళే చూస్తున్నాను
నిత్యం నడిచే బాటలో నిజమైన బాటని

ఇవాళే వింటున్నాను
రద్దీలో రణగొణధ్వని మధ్య రహదారి విన్పించే అసలైన పాటని
బాటని అభిషేకిస్తున్న వృక్షాల వసంతాన్ని, ఇరుపక్కలా
గృహాల ఉత్సాహాన్ని, కొన్ని రాత్రుల్లో బాట దిద్దుకొనే వెన్నెల ముగ్గుల్ని

ఇవాళే దర్శిస్తున్నాను
చిరపరిచిత పద నిజ సౌందర్యాన్ని ఇంత ఎత్తున నిల్చొని

కొంత ధూళి, విస్తారంగా జఢత్వం
ఒకింత కదలిక, ఎక్కువగా అలవాటు
తొందర తొందరగా దాటిపోవడం, ఇది మా జీవితపథం

హఠాత్తుగా అరుదుగా
ఎవరోచూస్తారు ఇందులో అందాన్ని
ఎంతో ఔన్నత్యంలో నిల్చి

వేసవి దుమారాలు చెలరేగే యీ పురాతనమైన బాటమీద
ఆషాఢ మేఘం వంగి వర్షించినపుడు పొరలే నవ పృధ్వీగంధం
మా మధ్య అపుడూ అపుడూ మొగ్గ తొడిగే కవిత్వం

– 6–3–84

# పెరట్లో వెన్నెల

ఏ మిట్టలూ పల్లాలూ లేని విస్తారమైన మైదానంలో వెన్నెల వర్షిస్తూండగా చూడాలన్నది నా కల

దేశాలు తిరిగిన జ్ఞానులు చెప్తూ వచ్చారు అలా వెన్నెల వర్షించే మైదానాలు లేకపోలేదని ఆ సౌందర్యం వర్ణనకు మించినదని

వాళ్ళ యాత్రావర్ణన వినీ వినగానే పిల్లలు కొందరు కొన్ని తుప్పలు నరికి పాన గోడలు ఒకటి రెండు కూల్చి ఒకింతమేర చదునుచేసి వెన్నెల్ని పట్టి గర్వించారు.

కాని నాకు తెలుసు, సముద్రాన్ని పొలాల్లోకి మళ్ళిస్తే మిగిలేదేమిటో, నాకు తెలుసు, మైదానాలు కృత్రిమంగా రావని. ఒక ఉత్తుంగ నదీ ప్రవాహం కొన్ని యుగాలుగా ప్రవహిస్తేనే కాని యీ ఎత్తుపల్లాలు సమం కావని.

అపారమైన వెన్నెల మైదానాల కోసం ఏ దేశాలకి ఎగరాలి?

నా పెరట్లో నూతిగట్టు, ఇంటిచూరు, సంజలో విప్పారే గరుడవర్ధనాలు, లోతైన స్మృతిలా నూతిలో నీరు, వెన్నెల శాసనాల్లా కొబ్బరాకులు.... ఇరుకు ఇరుకుగా అవి అద్భుతమైన నిశ్చల చిత్రంగా మారతాయి.

పరిమితమైన కాన్వాసు మీదే బతుకు కన్ను స్వేచ్ఛాలోకాన్ని దర్శించు కొంటుంది.

– 23-3-84

## కఠోపనిషత్

మృత్యువంటే ఏమిటి?

నిద్రపోతున్న కళేబరం తల చెంతన దీపం
చుట్టూ జనాల మూల్గులు
ఒక పసిపాప అర్థం కాని నేత్రాల్లో
కదలాడే తెలిసీ తెలియని కలయిక

మృత్యువు అమృతం

– 25-3-84

కొమ్మలో నుంచి
కాంతివంతమైన చిగురు తెరుచుకున్నట్లు
దేహంలోంచి
ఆత్మ వికసించడం జీవితం

– 2-4-84

చెలరేగే వుధృతాల మధ్య
విప్పారే మృదు వాక్యాలు
ఎవరివని? ఎవరికని?

– 25-4-84

# నేను కవిత్వం రాయలేని కవిని

అన్ని శిఖరాల్ని ఒదిలి
దుర్భేద్య దుర్గంలాంటి వల్మీకం
లోపలి చొచ్చుకుపోవట మొక్కటే
గత్యంతరం అయినవాణ్ణి.

సగం సగం చొరబడ్డ వెనుక
ఎందుకిలా మహతిని మోగిస్తో వూగిస్తారు?
ఏది ఋజువో ఏది నిజమో
నన్నెందుకు ప్రశ్నిస్తారు?

కావచ్చు, స్వతహాగా వేటగాణ్ణి
కనుకనే దెబ్బతిన్న కపోతం బాధ నా కెరుక

కాని ఇప్పుడెవర్నీ శపించలేను
నా విషాదం నుండి ఏ ఇతిహాసమూ జనించదు

నా నుంచి నేను తొలగించబడ్డాను

కావటానికి జీవితాన్ని ఎంతో ప్రేమించినవాణ్ణే
అయితేనేం దుర్నిరోధ పలాయనం

ఈ వల్మీకం నాకు కవచం.
కావ్యారంభ సమాధికాదు
నేను అభిశప్త మానవుణ్ణి,
కవిని కాను.

(కె.కె. హెబ్బర్ చిత్రం The birth of Poetry గుర్తుచేసుకుంటూ)

- 21-5-84

# అన్వేషణ గురించి గీతం

అభ్యర్థించుకోగలను
అంతే, అంతకు మించి ఏమివ్వగలను?

కదుల్తున్న శిబిరాల్లో
అనిశ్చిత సంబంధాల వలయాల్లో
తారసపడి తప్పుకు పోతున్న
అపరిచిత ముఖంలో
ఎక్కడో ఒక ఆధారం

ఒక్కణ్ణీ నా కెదుట పడినప్పుడు
ప్రశ్నించుకొంటాను
నిన్ను నువ్వు గుర్తుంచుకోవడానికి
అంత ప్రయాస ఎందుకని.

ఒక చిగురు ఆధారంగా
ప్రతి ఒక్కసారీ వసంతాన్ని ఊహించలేం
ఊహలు ప్రపంచ పరిభాషలో
దురూహలై తరిమివేయబడతాయి

కాని యదార్థానికి
వసంతాన్ని గుర్తించడానికి
ఎప్పటికయినా చిగురే ఆధారం

- 27-7-84

# స్వప్నావిష్ట తంద్రాలసత

ఆద్యంతమూ తిమిరావృతం, అయినా నడక తప్పదు
కాని హఠాత్తుగా ఒక్కసారి వెల్తురు
ఏమిటి ప్రయోజనం? అవును, ఏమిటి?

కార్మొయిళ్ళ మధ్య ఒక మెరుపు
తుఫాను అంచున ప్రణయ యాత్ర
ఏమిటి హామీ? అనంతర ప్రయాణం ఎలా?

పోలికలు లేవు, కొలతలు లేవు
అనుభవం బోధపడేలోగా కాలం విసురుకుపోతుంది.
చెదిరిన కలకు గుర్తులు మిగలవు

ఒక ప్రవక్త నిశ్శబ్దంగా ఇంటివాకిట నిల్చి
మౌనంగా భిక్ష యాచిస్తాడు
అతని నేత్రాల్లో వర్షిస్తోన్న శాంతిని
శూన్యమని భ్రమసి అవిశ్వాసంతో తప్పుకు పోతాం.

బాల్యకాలాన ఒక నడివేసవి మధ్యాహ్నాన
సేదదీర్చిన ప్రశాంత తరుచ్ఛాయ
ఏళ్ళు గడచినా ఆ స్మృతి కొరతబోదు

ఇక నా గేదెనెక్కి తామర తూళ్ళు తీస్తో
చెరువుల అంచుల్లో సవారీలు చేస్తాను

అల్లుకుంటున్న తెరలమీద అద్దకపు లతలు
ఒక పలచని కునికిపాటులో తొణికిన ఒక కల
అంతే. ఇంక ఏమీ లేదు.
జీవించినంతమటుకు చాలు

– 15–6–84

# ప్రతీక్ష

ఒక రంగులో ఒక పాత్ర మాత్రమే అభినయించగలం
అన్ని రంగుల్లోనూ చూసుకోవాలన్న కుతూహలం ఆడవలసిన నాటకాన్ని
రసాభాస చేస్తుంది.

నటించే పాత్ర ఏదైనా ఇరుకు విగ్గు కరవక తప్పదు

నిర్ణయించబడ్డ ఫలితాన్ని తాత్కాలిక పశ్చాత్తాపాలు సవరించలేవు
రావాలని ఆశించింది రాకపోయిన ఒక్క క్షణం మాత్రమే తిరుగులేని సన్యాసం
రంగప్రవేశమయితే చేయనిస్తారు కాని కిరీటాల్ని కొందరికి మాత్రమే అనుమతిస్తాయి
ఇవ్వబడనిదాన్ని ముందే ఒదులుకోవడం 'విజ్ఞులకు' మాత్రమే చేతౌను
కేవలం స్వప్నాల్తో భౌతికపటలం మీద చిత్రం ఏర్పడదు. అయినా
అసమగ్రమే అవుతుంది.

పరాజయమైన కదనప్రవేశం చేసినప్పుడే కదా ఒనగూడేది.
తీర్చబడని కోర్కెను తిరస్కరించడం విరక్తి ఎలా అవుతుంది?
చాలినంత పరిశ్రమ లేకుండా జీవితం పట్ల ప్రేమ ఎట్లా గుర్తింపుకొస్తుంది?

పెద్ద పెద్ద నిరాశల ఎదుట చిన్ని చిన్ని సౌకర్యాలు వెలవెలపోయినా
ఓదార్పుగా నిజంగా నిలుస్తాయి

పునర్నిర్మిత వల్మీకంలో ప్రగాఢ సమాధిలో మళ్ళీ ప్రతీక్ష మొదలవుతుంది
చిరిగిపోతున్న పంట్లాములు, పెరుగుతున్న కాతాలు, ఇవ్వలేని కాన్కలు –
ఆత్మపద్మం వికసించడానికి పంకమొక్కటే చాలదు, ఉజ్జ్వల సూర్యరశ్మి
కావాలి ముఖ్యంగా

తుమ్మెద వాలడమొక్కటే కుసుమాల్నుంచి గగన కుసుమాల్ని వేరుచేస్తుంది.

– 6-5-84

# పెద్దాపురం సూర్యదేవాలయం

ఆకలి ప్రశ్నిస్తుంది. ప్రతి ప్రశ్నా ఒక పొడుపుకథయి
జవాబు చెప్పలేక కాలం మూగబోతుంది.

అగ్ని పర్వత శిల ఆకలి.
పైకి చల్లారి గట్టిపడి సుందర రూపాలు సంతరించుకొంటుంది.
ఈతకొమ్మలు వూగినప్పుడల్లా
పరచుకొన్న ఎడారి యిసిక తుఫానులు రేగి
భూగర్భ ఉష్ణవాహినులు ఆవులిస్తాయి

వెలిసిపోయిన పసుపు గోడల సత్రాల అరుగుల మీద
పక్షవాతం కమ్మిన మనిషి భిక్ష యాచిస్తాడు
పరోపకారి పాపన్నలు పంచదార మాత్రలకు మించి యివ్వలేరు

ఆకలి ఆకలితో కుస్తీ పడ్డచోట
స్తన్యం కూడా స్రవించదు

రివ్వున వేసవిగాలులు వీచే మధ్యాహ్నేల్లో
పత్రం ఎదట వేపచెట్టునీడ
ఓదార్పుగా ఉంటుంది. దేవుణ్ణి వెతుక్కొన్నట్లుగా,
ఈ తీరని ఆకలితో పట్టణాన్ని దాని మానాన్న ఒదిలి
వేపచెట్టు నీడన విశ్రాంతి
చీకటి అగాధాల్ని కలుపుతూన్న వెలుతురు తీగమీద యోగం

ఆకలి చీకటి.
కారుణ్య నేత్రాలు దానిముందు వెలవెలబోతాయి
సుఖించిపోయిన రాజుల దాతృత్వపు అవశేషాల్లో
ఆకలి తననితాను ఆటపట్టించుకొంటుంది.

ఆకలి జీవిస్తున్న మృత్యువు
ప్రతి పగలూ ప్రతి రాత్రీ చీకటి చెరువులో ఆవర్తాలు
క్షణాల్ని గడుపుతూ బతకడం చీకటి ఆవృతాల్లో దారి తప్పడం

సంధ్య పరచుకొన్న వేళ
ఎర్రనేలల్ని ధిక్కరించే పైర్ల పచ్చదనాన్ని చూస్తో
పాండవుల మెట్ట మీద కొన్ని క్షణాలు జీవించేవాణ్ని.

ఆకాశాన్నీ భూమినీ ఆవరించిన చీకట్లో
ధవళ కాంతితో సూర్య దేవాలయం,
ఎవరు నిర్మించారు దీన్ని?

చీకట్లోకి ఒరుగుతున్న ప్రతి రాత్రి చివరా
ఒక ఉదయం హామీగా వుండేది

నెర్రెలు విచ్చిన బీళ్ళలో
అశృవులూ, చినుకులూ, స్వేదధారలూ ఒక్కలా కురిసేవి

సత్రాలు పాడుపడతాయి, మట్టిగోడలు
కాని మట్టి పాడుపడదు.

చీకటిలాంటి అవనీగర్భంలో జీవితం అంకురాలు విడుస్తుంది.
పాల వరి కంకుల్లో
రోచిర్మయ జీవితేచ్ఛ ప్రాణం పోస్తుంది.

సూర్యుణ్ణి నిర్మించింది ఆకలి.

- 29-6-84

# జీవించడం ఒక లీల

వానాకాలపు పల్చని నీడల్లో ఎగిరే తూనీగల స్వేచ్ఛాప్రపంచంలోకి నాకూ ఆహ్వానం వచ్చింది.

హెూరుపెడుతూన్న యీ జీవన సాగరం ఎదుట కళ్ళు తిరిగేటట్లు ఇలా ఎంతసేపని చూస్తో?

అర్ధరాత్రి పల్చని సెలయేటి అద్దంలో బృహత్తారకల గగనం ప్రతిఫలించే దృశ్యాన్ని ఎంతకాలమయినా చూడగలను

ఆపైన, మంచుతెరల వెనుక సింగారించుకునే ఉషాకుమారికి నాలుగు దిక్కులూ తెరచి ఆనంద గీతికల్తో స్వాగతిస్తాను.

జీవించడం ఇక్కడ నిత్యకల్యాణం, పచ్చతోరణం.

వెళ్ళిపోతున్న మిత్రులు, బృందాల్లో శృతి కలుపుతున్న కొత్త గళాలు, పసిపాపల కేరింతలు, రాలిపోతున్న తారలు -- యీ వెలుగునీడల రసరమ్య రూపకాన్ని యిష్టంగా నేత్రమందిరంలో ఆవిష్కరించుకొంటాను.

దారీ తెన్నూ తెలియకుండా తుఫాను ప్రపంచాన్ని వూగిస్తోన్నవేళ తడిసిన చంద్రకాంతాల పరిమళాల్ని నమ్ముకొని ఏ సహృదయ సన్నిధిలోనో కాలం దేశం లేకుండా నిల్చిపోతాను

ఎక్కడైనా ఎప్పుడైనా నాకు జీవించడం ఒక రహస్య లీల, రసమయ ఖేల

- 21-9-84

## మోహనదాస్ కరంచంద్ గాంధీ

ఆయన

ఆవుల్నీ, అస్పృస్యుల్నీ, ఆడవాళ్ళనీ ఆరాధించాడు. ఈ లోకంలో వాళ్ళ వేదన స్థాయికి తనూ చేరాలని జీవితమంతా మధనపడ్డాడు.

ఏం లోకం ఇది? కసాయి కబేళాలూ, కంచిక చర్లలూ, కిరోసెన్ పోసి కాల్చేయడాలూ.

అయినా, సగం సగం కాలిన చమురుకంపు శవాలూ, పాప క్రిముల్తో కుళ్ళిన రోగగ్రస్త దేహాలూ జీవగంగ నైర్మల్యాన్ని కలుషితం చెయ్యగలవా?

విడిచిన బాణాలు రక్తం చిందిస్తే, విడిచిన కన్నీళ్ళు కొత్త నెత్తురు పోస్తాయి.

నశింపులేని అశ్రునైర్మల్యమే సత్యమయితే నిశ్చయంగా ఆయన ఈశ్వరుణ్ణి చూసినవాడే

- 15-11-84

# గేంగ్రీన్

సరోవరాలు నాచుపడతాయి. అభయముద్ర పట్టిన చేతుల స్వర్ణ కంకణాల నుంచి లుకలుకలాడుతూ పురుగులు జారతాయి, ప్రతీ రోజూ చర్మం మలిన పడుతూనే ఉంటుంది. కాళ్ళు నేలమీద దృఢంగా ఆనుతుంటాయా, పదచిహ్నాల్లో చీము మరకలు పెళ్లలు కడుతూనే ఉంటాయి.

అతన్ని శస్త్ర చికిత్స చేసినప్పుడు హృదయం స్థానంలో ఎండిపోయిన పీత ఉందిట. జీర్ణకోశంలో బొద్దింకలు తెల్లని స్రావం మధ్య బలిసి వున్నాయిట. అబ్బే, అదంతా కథ అనుకున్నాను, కాని ప్రతి రాత్రీ నా శయ్యమీద ఒరిగేది రుజాగ్రస్త కళేబరం కాదని నమ్మలేకపోతున్నాను.

రోడ్డుమీద ఎండిన మానులు సతత హరిత శాఖల్ని కప్పుకొని ప్రగల్భాలు పలుకుతుంటాయి, కాని చెదలకి తెలుసు, శిశిరానికి తెలుసు, ఘర్షణలోంచి జనించే అనివార్య దావానలానికి తెలుసు అసలు రహస్యం.

ఇంద్రధనుసుల చొక్కాలు తొడిగి విసుగెత్తిపోయాం. ఇంకా ఎందుకు చెప్తారు? కాంతి గురించి, శివరంజనీ రాగం గూర్చి, నవజాత మృదు కిసలయపుంజాల మిల మిల గురించి? పద్మాల ఆశ చూపించి పంకం నేలంతా ఆక్రమిస్తూనే ఉంది.

ఎముకల మీద చైత్యాలు, జీవనదుల్లో చితాభస్మ నిమజ్జనాలు, ఇక్కడ భగవంతుడి శవాన్ని తవ్వితీస్తో, పాతిపెడుతో వుండటమే పనిగా పెట్టుకున్నారు, నాశనం మీద నిర్మించబడ్డ నాగరికత ఇది.

పొరుగు యింట్లో క్షయ రోగి దగ్గినపుడల్లా శ్లేష్మంలో ఈగకి మల్లే జీవితం పట్ల ఆశతో కొట్టుకుంటాను. వాడు తన కుక్కపిల్లని పెళ్ళాం కన్నా ఎక్కువగా చూసుకొంటాడు, వాడి ఏ రహస్యాపరాధాన్ని అది తనలో పదిలపర్చుకొందో ఎవడికి తెలుసు?

వేశ్యావాటికల్లో ముషాయిరాలు సాగుతూనే వున్నాయిట. జూదగృహాల్లో పందాలు పెరుగుతున్నాయిట. బానిసలకు గిరాకీ బాగానే ఉందిట. ఇంతలోనే శత్రువులు నగరాన్ని తగలెట్టేసారు. రోమ్‌లో, లక్నోలో, బెర్లిన్‌లో -- అన్ని చోట్లా ఇదే కథ. పైకి చెప్పరు గాని భీతి ఒక్కటే నిజమైన అనుభూతి.

విందుభోజనాల్లో తుళ్ళింతలు కేరింతల్తో మృత్యువు కోలాహలం చేస్తూంటుంది. ఎవడో పరిచయార్థ కరచాలనం చేస్తాడు. వాడి జీవితంలోంచి సకల రోగాలూ నా జీవితంలోకి ప్రసరిస్తాయి. ఏ రోజు ఎవడి జీవితాన్ని స్నేహపూర్వకంగా దుమ్ము దులిపి చూసినా మరింత తుప్పు పట్టి ఉండటం కన్పిస్తుంది.

ఏమి జీవితం ఇది ! ఏ క్రూరమృగమో తరుముతున్నట్టే. ఏ పురాకృత అపరాధమో భూతంలా వెన్నాడుతున్నట్టే

బలిష్టుడైన ఒక యువకుడు నగరమధ్యన నగ్నంగా నిల్చొని పంకిలమైన తన జననాంగాన్ని జాలిగా నిమురుకొని ఆపై క్రూరంగా ఖండించి వేసినపుడు -- అప్పుడు మాత్రం భగవంతుడు పునరుజ్జీవిస్తాడు, లైబ్రరీ అల్మైరా బూజుని దులుపుకొని కిర్క్ గార్డు నవ్వుతాడు.

రాలిపోతున్న ఆభరణాల స్థానంలో స్వర్ణకారులు కొత్త నగల్ని తగిలిస్తూనే ఉంటారు. కాని భూమికి తెలుసు, ఆకాశానికి తెలుసు, నిశ్చితంగా చుట్టచుట్టుకొన్న కాలసర్పానికి తెలుసు ఈ మనిషి చక్కని చావుకైనా నోచని అమాయికపు పురుగని.

- 20-2-85

# శిశిరకాలపు మధ్యాహ్నం

రాలిపోతున్న ఆకులతో లోయలు నిండిపోయాయి
(ఇది దయలేని మధ్యాహ్నం)

ఉపమాలంకారం దుర్భలమైపోయింది
తీక్ష్ణ ఫాల్గుణం ఏమీ చెప్పనివ్వడం లేదు
(ఇది అలిసిపోయిన మధ్యాహ్నం)

అరిచి అరిచి దప్పిక తీరని గొంతు మేధని పట్టేసింది
లేగదూడ నాలిక వెళ్ళబెట్టింది
పసుల కుర్రాడు ఇంకా పిల్లంగోవి ఎలా వూదుతాడు?
(ఇది మూగపోయిన మధ్యాహ్నం)

ఎవరికీ చెప్పనేలేదు,
జీర్ణ పత్ర డోలికలో శవయాత్ర జరుగుతోంది
బాజాల్లేవు, బాణాసంచాలేదు
సింధూరం జల్లలేదు, చిల్లర విసరలేదు
(ఇది మరణశోకపు మధ్యాహ్నం)

కాళ్ళకింద నేల నెర్రెలు విచ్చింది
ఆకాశానికీ భూమికీ మధ్య అగ్నివాయువు రగుల్తోంది.
భోరున్న ఏడుస్తున్న వితంతువుల మధ్య
బాలెంతల్లాంటి మంకెన చెట్లు
(ఇది దీర్ఘ యాతనల మధ్యాహ్నం)

కారుమబ్బులా అలమికొన్న శిశిరంలోంచి
క్రొంజివుర్ల తొలకరికి పుడమి ప్రతీక్షిస్తోంది.
(ఇది ప్రసవ వేదనోద్విగ్న మధ్యాహ్నం)

- 17-3-85

# అన్నపూర్ణ

అన్నాత్పురుషః — తైత్తిరీయోపనిషత్

ఎప్పుడో తెలీదుగాని ఒకనాడు తృణపత్రాల దోసిట్లో స్వర్ణకలశంతో సాక్షాత్కరించింది అన్నపూర్ణ

ఇక ఆవాళ నా పూర్వీకుడికి వేట విల్లమ్ముల్తో పరుగుతో, ఆందోళనతో పని తీరిపోయిందనుకున్నాను.

వెచ్చని వెలుతుర్లో నదీ మైదానపు ఒండలినేలలో వానజల్లుల మధ్య పొలాలు ధాన్యపు కంకుల్ని యీనేయి.

కాని అవాల్టినుంచే మనిషి తన విల్లమ్ముల్ని మనిషిమీదకే గురిపెట్టాడు. మళ్ళీ వేట మొదలయ్యింది.

గుండెకింద కటిపైన ఉదరంలో రగిలే అగ్ని నిర్దాక్షిణ్య నిరుపశాంత విషవాయువై చెలరేగింది.

ఈ తిండి గింజలన్నిటి మీదా దేవుడు నా పేరే రాసాడని వాడునొల్లేస్తుంటే చేతులు జోడించి క్షుధోత్పన్న అశ్రువుల్తో నిలబడిపోయాడు వీడు.

వాడు పొలాల్లో గోడలు పెట్టేడు, కోతలు లేపేడు, ప్రాణగీతం పాడాల్సిన మట్టితో పిరమిడ్లు కట్టేడు. ఇంక యిప్పుడు అన్ని వేళల్లో అన్ని స్థలాల్లో బిచ్చమెత్తుకుంటూ పిల్లలు తిరుగుతారు. వాళ్ళ వాళ్ళ తల్లులూ, నా తల్లీ నిరపరాధులే, అయిన సిగ్గుతో తలొంచుకుంటాను.

ప్రతి ఉదయం నా గడపముందు అన్నపూర్ణ కావిడివచ్చి ఆగుతుంది. ఎర్రని సింధూరరాశి మధ్య అమ్మవార్ని చూసి వొళ్ళంతా భయంతో వణుకుతుంది.

నిత్యానందకరి అన్నపూర్ణ చిరునవ్వులో యిప్పుడు నాకు వినిపించేవి ఎగశ్వాసలే. నా అన్నం పళ్ళెంలో రక్తపు మరకలూ, కృశించే మానవ దేహమూను.

ఈ కాశీలోనే భిక్షపాత్ర పగలగొట్టి ఆకలో అని ఏడ్చినపుడు కనిపించేవే అన్నపూర్ణా.

ఒక ఆకలి కేక విన్పించినప్పుడల్లా ఎక్కణ్ణుంచో గంధక వాయువూ అగ్నిజ్వాలా మానవ ప్రపంచాన్ని తరుముతున్నట్టే ఉంటుంది.

నాకు తెలుసు, ఎండిన విత్తనంలోంచే నవాంకురం మొలకెత్తినట్లుగా క్షుత్పీడిత కంఠాల్లోంచే అన్నపూర్ణ అవతరిస్తుందని.

– 27-3-85

# పుట్టినరోజు గీతాలు

1983

ధ్వనిస్తున్నాను నేను జగజ్జన హృదయస్పందనాన్ని
పరిమళిస్తున్నాను నేను తత్త్వకాంతి కమలాల్ని, కళల్ని, కవితార్తి గీతికల్ని
ఆలపిస్తున్నాను హృదయాల ఐక్యాన్ని, కరుణామయ ప్రేమ వచనాల్ని
చిత్రిస్తున్నాను పసిపాపల నేత్రాల్ని, స్త్రీల మనసుల్ని, మానవ సంబంధాల స్వర్ణయుగాల్ని
ప్రవచిస్తున్నాను పూల ఆశల్ని, కలకూజితాల్ని, ఈశ్వరీయ నిశ్శబ్ద వేదనాప్రకంపనల్ని
స్పర్శిస్తున్నాను పార్థివ దేహాన్ని, ఋతులీలాలోలితారణ్యాల్ని, పునరుత్థానమందే ఆత్మల్ని,

రూపొందుతున్నాను నేను నేనుగా
ఇదే ఆసన్న అత్యావశ్యక క్షణం --
జన్మిస్తున్నాను కాంతినై, కాలాన్నై, వేదాన్నై, వేదననై, అనలమై, అమృతమై
ప్రపంచంకోసం ఈ భూమిపై ఒక మనిషినై.

1984

ఈ తీరం అంచున కూచొని

సముద్రం మీద
ఉదయాస్తమయాల్ని అవలోకించేది ఇవాళే

అగాధమైన ఆ ఆవలి తీరం
అది నా ఆది, అంతం.

తరు కాండాన్ని, శాఖల్ని
తెరచుకొని వచ్చే చిగుర్లని చూస్తూంటాను
వాటి సందేశం బోధపడేది ఇవాళే.

దీపాన్ని వెలిగించి
ఒక కాంతి కిరణాన్ని ద ృశ్యలోకంలోకి ప్రవేశపెడతాను
బృహత్తారా గగనంలోకి అగణ్య కాంతి సంవత్సరాలపాటు
అదలా యాత్ర సాగిస్తూనే ఉంటుంది.

సనాతనమైన ఫోనిక్సు పక్షిలా
నా మృత్యువులోంచి
నేను అనుక్షణం జన్మిస్తాను
మాతృగర్భ సాఫల్యం బోధపడేది ఇవాళే.

1985

ఆకులు రాలిన అరణ్యంలోకి
కోకిల ప్రవేశించే కాలంలో
ననుకన్నాది మా అమ్మ
ఆమెకు నా అనేక నమస్కారాలు,

హిమాలయం లాంటి మా అమ్మ, గంగా
ప్రవాహం లాంటి నను కన్నాది
ఓహెూ, ఈ ప్రవాహం జీవన
సంగమానికై ఉన్ముఖ మవుతున్నాది.

మార్మిక రీతిలో మా అమ్మ, ఒక
అపూర్వ చిత్రం సృజియించింది
ఇదేమిటీ చిత్రం, చిత్రం! అను
క్షణం విశాల తరమవుతున్నది.

- 28-3-83 / 28-3-85

## గాయం నుంచి గాయానికి

బిస్మిల్లాఖాన్ బిస్మిల్లాఖాన్ లానే షెహనాయీ విన్పిస్తూంటాడు
వాకిట్లో బోగన్ విల్లె తీగె బోగన్ విల్లె పువ్వులే పూస్తుంటుంది

నన్ను మాత్రమే నేను పోల్చుకోలేక పోతుంటాను
శయన సమయానికి నా దినచర్య నెమరు వేసుకున్నపుడు
నా రూప శకలాలు చెల్లా చెదురయి ఆందోళన పడతాను
ఆశించినట్లుగా నా పాత్రని పోషించిన క్షణాలు కూడా
నా పరాజయపు చిహ్నాల్ని కప్పిపుచ్చలేకపోతాయి
భావించుకున్న నా స్వీయోజ్జ్వలత్వమంతా
నా అసాఫల్యం ముందు వెలవెలబోతుంది
ఒప్పుకోలేని నా అపరిపూర్ణత
అర్ధరాత్రి ఎప్పుడో కలల్లో వికృతంగా గుచ్చుకొంటుంది

2

కాళ్ళు కాళ్ళ పరిధిలో చేతులు చేతుల పరిధిలో
సకలావయాలూ తమ స్థానాల్లో నిల్చి జీవితాన్ని నడుపుతాయి
ఎవరో ఒక పరిమళభరితమయిన రోజా పువ్వుని
ఈ యంత్రం దగ్గర పరాకుగా మర్చిపోతారు
అప్పుడు నాలోంచి విచిత్రమైన పురుగు ఆ పువ్వుని స్పృశిస్తుంది
నా మలిన స్పర్శ నాకు తెలియకనా? అయినా,
ఒంటి నుంచి జిడ్డు కారుతోన్నా
నా నేత్రాల్లో తేజస్సిదీ అని చూపడం మానను
మాసిపోయిన గుడ్డలమీద అలంకారాలు కప్పి
అతిథుల్ని చిరునవ్వుతో ఆహ్వానించడం మానను
పరచుకొన్న శూన్యాన్ని అరచేతుల్తో మూసేసి
అబ్బే మరేంలేదు అని సర్ది చెప్పడం మానను.
కాని వేరుపురుగులాగా స్వయంకృతాపరాధం
మూలాన్ని శిథిలం చేస్తూ ఉంటుంది
పువ్వుల శాలువా కింద దేహం
రుగ్మతతో క్షీణిస్తూంటుంది.
ఇలా ప్రపంచం మీదకు విసిరిన ప్రశ్నార్థకాలు

ఎవరూ చూడకుండా తిరిగివచ్చి నన్నే నాటుకున్నపుడు
ఇక, ఆరోపించే స్వేచ్ఛని కూడా కోల్పోతాను,

3
పాపంలాంటి చీకట్లోనో, దానికి ఆవల్నో
ఒక కాంతి బిందువుని వూహిస్తాను
ఆ ప్రకాశలేశం ఎదుట నా జీవితమంటే ఇదీ అని
ఆశాభంగాల జాబితా ఆశగా ఉంచుతాను.
నా గాయాలకు ఎవరు పూచీ పడతారు?
ఏ వ్యాధుల్నో వాటిల్లో వూహించి ఎవళ్ళకి వాళ్ళు తప్పుకు పోగా, మానని
గాయం నుంచి మరో గాయానికి అపరాధం అల్లుకొంటుంది.
ఎన్ని గాయాలు కలిస్తే ఒక జీవితం.

4
తీరాల మధ్య గోదావరి గోదావరిలానే ప్రవహిస్తుంది
ఒడ్డున పకీర్లు పకీర్లలానే ఉంటారు.
అలా నాకు నిత్యం తారసపడే కంఠాల్లో, దేహాలలో ఏమార్పూ వుండదు
వాటి మధ్య నడవాల్సినపుడల్లా
నంగిరితనంతో సిగ్గుతో ఒంకర్లుపోయే గొంతుతో
బలంగా స్వచ్ఛంగా ఉక్కులాంటి ఒక్కమాటయినా పలకాలని ఉంటుంది.
అపహాస్యాల మధ్య అవహేళనల మధ్య
అవనతమవుతున్న నా ఆత్మని
ధైర్యంగా నిలపాలని వుంటుంది.
ఎవడి నేత్రాల్లో అశ్రువుల్ని చూసినా
ఆత్మదానం చేసి మరీ పోరాడాలని ఉంటుంది.
కాని నిరపరాధులకు మాత్రమే
ఆశోపహతులైనపుడు కన్నీరు పెట్టుకునే అర్హత ఉందని తెలిసి
దూరంగా మౌనంగా కించిదసూయతో నిలబడిపోతాను
మంచులాగ నా మీద నా జాలి
నా హృదయాన్ని మంట పెట్టిస్తుంటే
ఏడవలేక, ఎదురు తిరగలేక
వెర్రిగా ఒక నవ్వు నవ్వుతాను. నిస్సహాయంగా,
కాని, బిస్మిల్లాఖాన్ బిస్మిల్లాఖాన్ లానే షెహనాయి విన్పిస్తుంటాడు

– 31-3-85

# ఆత్మ హననం

ప్రత్యూషవేళ గోదావరి జలాల్లో నిల్చొని గాయత్రి జపిస్తో సూర్యదేవునికి అంజలి సమర్పించాలనే ఉంటుంది. కాని కాళ్ళూ చేతులూ ఒక పట్టణ వూబినుంచి రాక వుదయాల్ని నష్టపోతుంటాను.

ప్రతి హృదయం ముందు రాగోన్మత్తతతో కలలవిపంచిని మీటి జీవన గాంధర్వంలో రాగానౌకా విహారం చెయ్యాలనే ఉంటుంది. కాని మాటల్లో దూసే కత్తుల్ని ఆపలేను. మనసు లోపలి పొరల్లోని మరకల్ని చెరపలేను.

నా రాత్రుల గురించి ఎం చెప్పను? నక్షత్రాలు ఆరుబయట ఆకాశంలో తీరిగ్గా ముచ్చట్లు చెప్పుకుంటున్న వేళ మోహన మురళీ గానం మనసు కలువ మీద మంచులా రాల్తున్న వేళ నిశ్శబ్దంగా ఒక స్త్రీ వక్షం మీదకి ఒరగాలనే వుంటుంది. కాని భీకరమైన ఐకాంతిక పీడనలోకి జారకుండా ఉండలేను, చీకట్లోని అపరాధాల్ని ఆపలేను.

నా శరీరాన్ని నేను తిరిగిన రోడ్లు, ఎక్కినా గుమ్మాలు, తీసుకొన్న ఆతిధ్యాలు హింసించిన తర్వాత -- నిస్సహాయంగా నిద్రలోకి జారేముందు -- నన్ను నేనే చెరుచుకుంటాను.

వాళ్ళూ వీళ్ళూ కలిసి నన్నెన్ని మాటలన్నారు. అయినా వాళ్ళ చూరు ఒదల్లేను. ఆత్మదానానికి సంకోచించే నేను ప్రతి నిత్యం వాళ్ళ సంబరాల్లో బలిపశువుగా హాజరు పరచుకొంటూనే వున్నాను.

నా ఆత్మదీపపు కాంతిని వాళ్ళెలానూ చూడరు. నా గాయాల్ని వాళ్ళు హేళన చేస్తుంటే (అవి వాళ్ళు కల్పించినవే అని మరిచిపోయి) అమాయకంగా నవ్వుకుంటాను. (ఇంకా ఆరోపణలేమిటి? నన్ను నేను డొల్ల చేసుకుంటున్నాక.)

ప్రతి రాత్రీ విశ్రమించేముందు నా కళ్ళలోకి జాలిగా చూసుకొంటాను -- ఆ తర్వాత పీడకలలు నిద్రలో నా కోసం ఎలానూ కాచుకొంటాయి. ప్రతి ప్రత్యూషానికీ నా కళ్ళ చుట్టూ మరింత ముసలితనం ఆవరిస్తూనే ఉంటోంది.

ఉజ్జ్వల కాంతితో, జ్ఞానపూర్ణత్వపు అర్ధనిమీలిత నేత్రాలల్లో సత్య ప్రవచనపు పెదాలతో ప్రకాశించే నా ముఖచిత్రాన్ని గీయాలని కదా ఆశపడ్డాను. మరి ఈ చిత్రమేమిటి? భీతితో నిస్పృహతో నన్ను నేను కప్పిపుచ్చుకుంటున్నాను.

ఇక దిగులుతో అరచేతుల్లో ముఖం దాచుకున్నపుడు నా చేతుల అపరాధాల మాలిన్యం ముఖానికి అంటుకుంటుంది, చివికిపోయిన నా ముఖం నుంచి చేతుల్లోకి మృత్యువు కారుతుంది.

- 13-5-85

# శిధిల సమాధి

ప్రేమించడం సులభం కాదు, నిజమే.
కాని ప్రేమించకుండా ఉండటం కూడా సులభం కాదు

తలుపులు మూసివేయాలని ఎన్నిసార్లు అనుకోలేదు
అయినా దారి చివర ఏదో పదధ్వని నన్నాపుతూనే ఉంది.

చిరపరిచితమైన యీ ముఖాలు
బరువుగా రాళ్ళలా తగిలి
కలలు చెదిరి, ఎన్ని రాత్రుళ్ళు కలతపడలేదు
అయినా ప్రతి ఉదయం చిరునవ్వుతో, శుభాకాంక్షలతో
వాళ్ళ ఇంటి తలుపు తడుతూనే ఉన్నాను

కొన్ని మాటలు, సమావేశాలు
కృత్రిమమయిన ఒకటి రెండు అలకలు, కోపావేశాలు
ఈ సరంజామాతో వీధులన్నీ తిరిగి
ఎందర్ని నా మిత్రబృందంలో చేర్చుకొన్నానని.

నాకు తెలియకపోలేదు హృదయాన్ని
హృదయంతో మాత్రమే పెనవైచుకోవాలని
కాని, దేహాలు నిరాకరిస్తూంటాయి మనసుల్ని అడ్డుపెట్టుకొని
మనసులు నిరాకస్తుంటాయి, ఆత్మల్ని అడ్డుపెట్టుకొని

ఆత్మలు నిరాకరిస్తూంటాయి తిరిగి దేహాల్ని అడ్డుపెట్టుకొని
చెప్పకుండా ఉండలేకపోతున్నాను
నా మిత్రబృందమంతా
ఏకాకి పీనుగుల సమూహమేనని.

అశ్రువులు కారని ఈ ఘనీభూత విషాదాన్ని మోస్తూ
నాలో నేను గొణుక్కుంటూ
జన సమ్మర్ధమైన ఖండిత చతుష్పధాల్ని దాటుకుంటూ

ప్రతి రాత్రీ నా గుహలోకి పోతూ
చూసిన చివరి చూపులో
ఎంత విరాగాత్మక కారుణ్యం వర్షించిందని.

పరాజయపు గాలులు తాకినప్పుడల్లా
నా జీవితం నాకు మరింత సన్నిహితమై
నా ఆత్మ పుష్పం

నాకే అర్థం కాని దయని విరజిమ్ముతుంది.
అందుకే చెప్తున్నాను
ప్రేమించకుండా ఉండటం సులభం కాదని.

ఓసి దొంగముండా ప్రపంచమా,
నేను నిన్ను ప్రేమించకుండా ఉండలేకపోతున్నాను.

నంగిరి చూపుల్తో
ఒణుకుతున్న పెదవుల్తో
నేను నా ఓటమినే ఒప్పుకుంటున్నానో
గెలుపునే ప్రకటిస్తున్నానో
నాకే తెలియకుండా ఉంది.

ఎన్నిసార్లు విరమణ పత్రాలు రాసుకోలేదు.
అయినా పువ్వులో, పుస్తకాలో ఆపేస్తున్నాయి

అట్లా ఆగిపోయిన క్షణాన
నిర్మలమైన ప్రకాశం పరచుకుంటుంది.
దాని ఎదట
నా ప్రేమలో కాపట్యాన్ని ఒప్పేసుకుంటాను.

కానీ చిత్రంగా ఆ క్షణానే
వేషం ఒదులవుతుంది.
సమాధి భగ్నమవుతుంది
శూన్యాన్ని చిత్రించాలనుకొన్న కాన్వాసుపై

ఏవో ఆకృతులు నీడలుగా పడతాయి
బ్లాంక్ ముఖాల్లో అస్పష్టంగా రేఖలు కదుల్తాయి.

పుట్టుక నుంచీ సంక్రమించిన
బాధా పరిష్వంగం పట్టువిడి
రంగురంగుల రెపరెపలు మెదలి
“ఈ రోజు జీవితం ఎంత బావుంది” అని డైరీ రాస్తాను.

నీ పౌడరు అద్దిన ముడతలు
ముదురు రంగు పెదాలు
చమట వాసన బాడీలు
నన్ను మగతలో పడేసినపుడల్లా
కృత్రిమమైన వివశత్వంలో అతిశయోక్తుల్తో
జీవితాన్ని ప్రశంసిస్తూనే ఉంటాను.

ఉన్మాద సరసులో పీకలదాకా మునిగి
ఊపిరాడక
నాచు పట్టిన పాకుడురాళ్ళ మీంచి
పైకి చేతులు జాపుతుంటే
“అదేమిటి అట్లా జారిపోయినావు.
దెయ్యం పట్టినట్లు ఆ చూపేమిటి
మరీ ఉద్రేకం కూడదు, నిర్లిప్తంగా ఉండాలి” అంటావు

అన్నా సరే.
ఓసి దొంగముండా ప్రపంచమా
నేను నిన్ను ప్రేమించకుండా ఉండలేను.

# చార్మినార్ శిల్పకారుల్ని ఉద్దేశించి

(ఆమెకు రాసిన ఉత్తరాల్ని చింపివేసిందని తెలిసేక)

చెరిగిపోయే ఎడారి పొరల మధ్య
ఎర్రని సంధ్యల్నీ ఒంటెల బిడారాల్నీ చూస్తూ
పానశాల గుమ్మం దగ్గిర తప్పతాగి పడి
ఒక పాంథుడు "జీవితం అశాశ్వతం" అని పాట పాడేడుట.

నశ్వరమైన మృత్తిక మీద నిలబడి
విలాపంతో కఠోర శ్రమతో మృత్యుభావనతో
ఎంత సుందరమైన శిల్పాన్ని సృజించేరు మీరు!

గడియారంలోంచి ఇసుక జారిపోతూ ఉంది.

ఎందరు మనుషులు యీ సత్రంలో బస చేసి వెళ్ళిపోయారు
ఇక్కడి వెలిసిపోయిన గోడల మీద వాళ్ళు రాసిన రాతలూ, గీతలూ, బొమ్మలు
తన కుర్రతనపు చేష్టల్ని చూసి నవ్వుకొనేందుకు ఏ ఒక్కడూ మళ్ళీ ఇటు రాలేదు.

మళ్ళీసారి గుర్తుపట్టడానికి ఇక్కడ తమ పేర్లు రాసిపోయిన వాళ్ళు
ఆ రాతల్లోనే వికృతంగా విశిష్టంగా జాలిగా వేలాడుతున్నారు.

ఇంత అందమైన నిర్మాణాన్ని
ప్రేరేపించిన మృత్యువెంత సుందరమైందో?

రోగంతో పరాజయాలతో అవమానంతో
స్వయంకృతాపరాధాల్తో శుష్కించిపోతున్న మనుషుల మధ్య
మృత్యువు ఒదిలిన పురాతన స్మారకాలుగా
ఎన్ని చార్మినార్లు, ఎన్ని చార్మినార్లు!

2
మృత్యువుని జయించే ప్రయత్నంలో
ప్రలోభానికి లొంగిపోయిన కథలు ఇంక వినలేను.

అబ్రహాము భూమిని ఒదులుకొన్నాడు, కానీ
పుత్రుడి మీది ప్రేమని ఒదులు కొన్నాడా. తన సంతతి కళ్ళతో
ఈ లోకాన్ని చూడాలనుకోలేదా?
నదీ తీరాల సుభిక్షమైన జనావాసాల జీవన కోలాహాలాన్ని ఒదిలి
సన్యసించి,
ఎందరు నదీ మూలాన్ని పట్టి పోలేదు?
కాని ఆత్మ శాశ్వతమని నమ్మకపోలేదు కదా.
కార్యభారంతో రోజు గడిచిపోయాక

కలలనాశ్రయిస్తూ
కలల పీడన నుంచి తిరిగి కర్మనాశ్రయిస్తూ
మృత్యువు నుంచి తప్పించుకొనేందుకు
చేసిన ప్రతి ఒక్క చంక్రమణమూ
ఒక చార్మీనార్

3
నా తొలి ప్రేమని ఆమె అలా తిరస్కరించినపుడు
కొన్ని సిగరెట్లు ఖర్చుపెట్టి
ఆ వ్యధా దుమారం నుంచి తప్పించుకున్నాను.

పల్చని సెలయేటి మీద నీరెండ పొడలా,
మధురంగా ప్రశాంతంగా
నా ఆత్మపైని పరచుకున్న ప్రేమానుభవమంతా
ఒక తిరస్కార శరానికి ఛిద్రమైపోయింది .

ఎలా గుర్తించను
పువ్వులో పురుగులాగా మృత్యువు పోంచే వుందని.

ఏకాంత దంత హర్మ్యంలో అల్లుకొన్న కలల గూటిలోని పేరు తెలియని వింత పిట్టని
మృత్యువు సర్పమై అలా కబళించినపుడు

నాకు ఎవరన్నా

జీవితం అంటే ఇదీ అని తెలియ చేస్తారని చూసాను.
వాగ్వాదాల్లో, భారమైన సాయంత్రాలలో, కన్నీళ్ళ మధ్య
గడిచిపోతున్న జీవితాన్ని
తన నేత్ర విలోకనం పైన అట్లా నిలిపి, ఒక లిప్తలో
అట్లా కూలదోసి
జన్మ మృత్యువులివీ అని తెలియచేస్తారని ఎదురు చూసాను.

కాని వీరాధివీరుడు హెర్క్యులిస్ కూడా
అట్లాస్ భుజాల మీది భారాన్ని అతనికే ఒదిలి
మోసం చేసి పారిపొయ్యాడు
అవాల్టి నుంచీ ఆ అభిశప్తుడు చేస్తున్న
ప్రతి ఒక్క ఆక్రందన ఒక చార్మీనార్.

4
పసిపిల్లల కేరింతలు, సీతాకోకచిలకలు
అక్షరాలు.
జీవితాన్ని శాశ్వతీకరించాలన్న పసి ప్రయత్నాల్ని ఇప్పుడు అర్థం చేసుకోగల్గుతున్నాను
ఏదీ శాశ్వతం కాదు.
చివరికి మృత్యువు కూడా.

చాలినన్ని ఉదాహరణలు ఇవ్వగలను
ఇందరు వికలాంగుల్ని చూసి కూడా
మరణం కన్నా జీవితమే గొప్పదని,

వృద్ధాప్యపు శాపాల్ని మోస్తున్న జీవితం
పైకి వ్రణంలాగే కన్పించవచ్చు గాక
క్షీణించి పోవడం నిజమే కావొచ్చు గాక.

అయినా సరే.
నా వెచ్చని హస్తాల్తో చార్మీనార్లు నిర్మించడం మానను.
ప్రలోభం బలవత్తరమైందే.
కాని, నేను అశాస్వతమైన దానికోసం ప్రలోభపడుతున్నానని మర్చిపోవద్దు

జీవించినంతకాలం
మృత్యువుని జయిస్తున్నానని మర్చిపోవద్దు

అనుభవాల్ని స్మృతి చిహ్నాల్లోకి రూపాంతరించే ప్రలోభం కాదు
అనుభవాన్ని అనుభవంగా గుర్తించే ప్రలోభం
సర్వేశ్వరుడు అన్నాడుట
"మహమ్మద్, నువ్వే లేకపోయుంటే
అసలు నేనీ ఆకాశాన్ని సృజించే వాణ్ణే కాదు"

జీవితం అశాశ్వతం అని పాట పాడినప్పుడు
ఆ అపరిచిత పాంథుడు
విశ్వమూ నక్షత్రాలు సాక్షిగా
ఒక శాశ్వత మానవ విజయ స్మారక స్థంభాన్ని నిర్మించాడని ఎలా మర్చిపోను?

పుత్రుడిలో తనని నిక్షిప్తపర్చుకోవాలన్న అబ్రహాము
ఆ పుత్రుణ్ణే బలి ఇవ్వబోయాడని విన్నాను
ఆ నా పూర్వ మానవుడి మొదలుకొని నాదాకా
ప్రతి ఒక మనిషీ ఒక చార్మీనార్.

## సంగీతాఘోష్

సాయం సంధ్యారశ్మి కారిడార్‌లో పరుచుకొన్నప్పుడు దియేటర్లో
తొక్కిసలాడుతున్న మనుషుల మధ్య నుంచి పవిత్ర ప్రవచనంలా కన్పించావు.
జరుగుతున్న నాటకమేమిటో ఎరిగినదాని మల్లే మెత్తగా చిరునవ్వావు,
ఒక రాత్రి
కలలో ఎవరో అమ్మాయి, గుహ్యమైన కాంతులపైని పారదర్శకపు పొరలు కప్పి
ఎత్తుగా ఉబ్బిన ఊంబుతో --
వెగటు పుట్టింది
రహస్యంగా ఏదో గీరి గీరి మెత్తని గుబులు పుట్టించింది. ఇంతలో వెంట్రుకల మధ్య
నుంచి నీతివాక్యాల బంకని అంటించి అదృశ్యమైంది
నా పురాతన గ్రామంలో
సామూహిక బృందగానాల మధ్య నిగనిగలాడే అవయవాల
దొంతర్ల మీంచి ప్రతి దేహాన్నీ తట్టి తట్టి చేరాల్సిన ద్వారం
దగ్గరికి చేరేసరికి "నా తండ్రీ" అంటో నువ్వు. డప్పుల హోరు మధ్య
రెపరెపలాడుతున్న ప్రభల నీడల్లో పూనకంతో ఊగిపోయిన
నీ ఒళ్ళు, ఎర్రబడ్డ నేత్రాలు, విరబోసుకున్న శిరోజాలు
నేనేమిటో నాకన్నా నీకే బాగా తెలుసని అప్పుడే నమ్మాను --

ఏళ్ల తరబడి రాస్తూ ఒచ్చిన ఉత్తరాలకి, ఆక్రందనకి నీ వెడ్డింగ్‌కార్డ్
జవాబుగా పంపావు. అది ఎవరికి అందాలో వాడి కళేబరాన్ని
ఏ తెలియని తీరంలోనో జాలర్లు ఒడ్డుకి లాగుతున్నారు.
పమిట సవరించుకుంటో, బాలుస్ట్రేడ్లని ఆనుకొని
నీ ఇంటికి రావద్దా అని అడుగుతావా? ప్రతీ రాత్రీ నా గదిలో రవికెనీ చీరెని వూడదీసి నేను పట్టుకు
ఏడుస్తున్నది ఎవర్నని?
ఇంత జరిగినా, ద్వేషధూళి
ఆవరిస్తున్న నా ప్రేమపుష్పాన్ని కళ్ళకద్దుకొని, నా కాన్కల్ని నాకు తిరిగిఇచ్చేస్తూ,
సద్గురువును వెతుకొమ్మని చెప్పి, విగ్రహారాధన మంచిది కాదని వినమ్రంగా
తప్పుకుంటావు.

నువ్వు నా జీవితానికి ప్రవక్తవో తెలీదు. ప్రచండమైన శాపానివో తెలీదు.

- 14-3-86

# నిర్వృతి

Agony, agony, dream, ferment and dream,
This is the world, my friend, agony, agony.......
and Life is not noble, nor good nor sacred.

...... Lorca (ode to walt whitman)

ఈ దేహం అంటే నాకు జాలి, నన్ను భరిస్తున్నది కనుక
కాని, నన్ను బాధిస్తున్నదీ ఇదే

నా ఆత్మ అంటే ఎంతో ప్రీతి, కాని, అది నాకు అందనిదీ, చెందనిదీ
ఆత్మసాగరం దేహతీరాన్ని తాకి ఘోషిస్తున్నపుడల్లా
ఒణికి పొయ్యే పీతలు,
అపార పారావారంలో చిన్ని నావలో బయల్దేరాడు సాహసికుడు,
కాని ఇంతలో వికారం, తిన్నది అరగదు, బయటకి పోదు, కళ్ళు మంటలు,
కండరాల నీచమయిన ఒత్తిడి. పసుపు పచ్చరంగు మూత్రం
సీసిక్‌నెస్ పట్టిందిట వాడికి,

పైగా నిద్దరపట్టదు.
రక్తంలోంచి మజ్జలోంచి కంపనలు, పొగ, తిమ్మిరి, వెంట్రుకల
మధ్య నుంచి వూరే చమట... బతుకు కంపు
ఏవేవో జ్ఞాపకాలు, విచిత్రమయిన ఊహలూ,

పురాతనమైన డ్రాగన్ ఆపిల్ పళ్ళలాంటి రెండు రొమ్ముల్ని నోటికందిస్తుంది.
అసలయిన నిజమయిన ఆకారమేదో నాలోంచి నిద్ర లేస్తుంది.
తీరని కోర్కెల్ని కలలుగా విసర్జిస్తూ జీవితాన్ని అలసటగా స్ఖలిస్తుంది,
పైని హంస ఒకటి మెత్తగా ఎగురుతుంది.
దాన్ని రాబందులు తరుముతాయి.

దీపాలు కొడిగట్టి పోయేక నక్షత్రాలు ఆరిపోయేక,
భూమి చచ్చుబడ్డ జననాంగంలా ముడుచుకు పోయేక
పగిలిన కలలు గాయాలవుతాయి, గాయాల్లో మృత్యువు పెట్టిన గుడ్లు
బోలెడన్ని పిల్లపాములవుతాయి

ఈ లోకం ఒక ఎద్దు, అయినా నాకు వెర్రి, ఎప్పటికీ లొంగదు కనుక
కాని బుసలు కొట్టే కసినీ దాచలేక దానితో తలపడతాను.
నా కలల్ని ఇష్టపడ్డ ఆడవాళ్ళు నా ప్రవృత్తిని చూచి బెదిరిపోతుంటే
పిచ్చిగా నన్ను నేను పొడుచుకొని నా శవాన్ని యీడ్చుకుపోతాను. ఇక,
నౌక విరిగి పోతుంది, దేహం కూలిపోతుంది. ఆత్మ ఎగిరిపోతుంది.
కాని జీవిత జ్వరం మాత్రం ఈ అర్థం లేని విషాదాన్ని పాటగా పాడిన
ఏ గొంతునో పట్టుకు వేలాడుతుంది.

– 15×3×86

## POEM OF PITY

Cow is a poem of pity ....... MK Gandhi

ఆవు కాలు ఎవరో విరిచేసారని అమ్మ కన్నుల్లో నీళ్ళు
కాని ఎందుకు శోకించడం?
నిత్యం ఎండిపోయిన డొక్కల్తో ఆవులు బంజర్లలో తిరుగుతూనే ఉన్నాయి.
బీళ్ళు వారిన పొలాల్లో కంకాళాలు మూలుగుతూనే ఉన్నాయి.
ఒడలిపోయిన పొత్తికడుపుల తల్లులు మంగళసూత్రాలు కళ్ళకద్దుకొంటూనే ఉన్నారు
చింకి తలల పసిపాపలు తమ శాపగ్రస్త హస్తాల్తో భూమిని మోస్తూనే ఉన్నారు.
అయినా సరే,
కవులు దేశాన్ని కీర్తించడం మానరు,
నేతలు శాంతి ప్రకటనలు చెయ్యడం మానరు.
ఎన్నికలు ఆగవు.
సభలు ఆగవు. విందులు ఆగవు. వినోదాలు ఆగవు

తమ్ముడూ!
నువ్వు ఇదంతా కుట్ర అంటావు. నేనలా అనుకోను.
వాళ్ళేం చేస్తున్నారో వాళ్ళకే తెలీదంటాను.

(దేవా, దేవా, నా చేతిని ఎందుకు విడిచావు?)
ఈ దేశంలో చచ్చిపోయిన వాళ్ళ కోసం ఏడవనక్కర్లేదు,
బతికున్న వాళ్ళకోసం, వాళ్ళ బిడ్డల కోసం మాత్రమే ఏడవాలి.
అశోక ధర్మచక్రాల్నీ, దీన్ ఇల్లాహీల్ని చరిత్రకారులు చావనివ్వరు.
అన్నం లేక చస్తున్న వాళ్ళని ఎవరూ బతకనివ్వరు.
ఏడవండర్రా, ఏడవండి,
నా దేశంలో బతకడమే ఒక శోకగీతం.
దేవుణ్ణీ మనిషినీ కూడా వధిస్తున్న వాళ్ళం,
ఏం చేస్తున్నామో తెలియకుండా ఏడవండ్రా ఏడవండి,

గంధకమూ అగ్నీ వర్షించేదాకా ఏడవండి,
పిల్లలు లేని గొడ్రాళ్ళే నయమనిపించేట్లు ఏడవండి,
నేలని చీల్చుకుని తుపాకులు చిగురించేదాకా ఏడవండి,

దేహాలు రొట్టెలుగా,
రక్తం మధువుగా
ఆకలి తీరేదాకా ఏడవండి ! ఏడవండి ! ఏడవండి?

- 16-3-86

## నా ఊరు గురించి గీతం

నా ప్రపంచం నా ఊరితోనే మొదలయ్యింది,
అది నా ప్రాచీన ధరిత్రి
అక్కడ అప్పుడు నాకు ఆకలి లేదు, శోకం లేదు.
అరణ్యాన్ని వసంతాలు అలంకరించేవి. దిగంతాల్ని తుషారాలు ఆవరించేవి.
భూమిపై శాద్వలాలు కుసుమించేవి. రాత్రులు వెన్నెల్తో తడిసిపొయ్యేవి.
నా జీవితం నా ఊరితోనే మొదలయ్యింది.

అది నా జనని గర్భం.
అప్పుడక్కడ గాలుల్లో పాటలు ప్రవహించేవి. పొలాల్లో కలలు పండుతుండేవి.
నక్షత్రాల్ని తలలో తురుముకొని భూమి ఈశ్వరుడి వక్షాన్ని మమతతో హత్తుకొనేది.
అది నా బాల్యం.
.... .... ....

సంధ్య పడింది. సంత పలచబడింది.
బృందగానం సన్నగిల్లింది. మృణ్మయ పాత్రలు పగిలిపొయ్యాయి.
ఎడతెరిపిలేని తుఫాన్లు ఏటిదిశను మార్చేసాయి.

ఇప్పుడక్కడ గాలుల్లో పూల మధువులు లేవు. పిల్లల నేత్రాల్లో నవ్వులు లేవు.
అక్కడ సదా ఆకులు రాలుతున్న చప్పుడు, చెవుల్ని కాల్చే ఎండ
పొలాల్లో ప్రేతాకారాలు, పసి శవాలు, పైని గద్దలు.
ఎండిన డొక్కలు, చిక్కిన పశువులు, కూలిన ఇళ్ళు.
.... .... ....

ఇప్పుడు వినిపిస్తున్నవి గంగాలమ్మ పాటలు కావు
ఎక్కుపెట్టిన ప్రశ్నలు
ఇప్పుడు కనిపిస్తున్నవి రంగుల జాతరలు కావు
అడవుల్ని దువ్వుతున్న ఖాకీ దుస్తులు
.... .... ....

వృద్ధురాలయిన ఆ స్త్రీ మాత్రం సహనంగా మవునంగా
పొలంలో కలుపు తీస్తోంది. దాని రుజాగ్రస్త వికృత వదనంలో
దూరవసంతం తొంగి చూస్తోంది.

నా ఊరు నన్ను కన్నది. దాన్ని ప్రేమించకుండా ఉండలేను.
ఇప్పుడు కొత్త వ్యవస్థని కంటోంది. కనుక ప్రణమిల్లకుండా ఉండలేను.

– 18-3-86

## స్వప్నం నుంచి జాగరణలోకి

అంతటా శూన్యమే అయినపుడు, ప్రథమంలో, అంతటా శూన్యమే అయి ఉన్నప్పుడు సృష్టికర్త స్వీయరతిలోంచి బీజ ప్రతిష్టాపన చేసాడు.

అంతటా అలమికొన్న తిమిరంలోంచి నల్లని ప్రళయజ్వాలల పెనుహోరు మధ్య రావి ఆకులాంటి ఆదిమ జననాంగంలో బీజం ఫలించి పిండమైంది.

తిమిరోదరం లాంటి మనువు నౌకలో పిండం విశ్వాండంగా పెరుగుతుంది. కాలాతీతం అతీతమై, పిండంలో బ్రహ్మాండానుభవం కదలాడింది.

పారదర్శకపు పొరల పొత్తిళ్ళ మధ్య ప్రణవనాద రక్తస్రావం నడుమ వైశ్వావర ప్రసాదుడైన మను కుమార సంభవం జరిగింది.

అనస్తిత్వం అస్తిత్వాన్ని విశ్వసించగానే విరాణ్మూర్తి స్వప్నంలోకి జారిపోయాడు. గార్గ్యుడు, పిప్పలాదుడూ ఎంత విచారణ చేసినా వివృతజఘున, మోహనేత్ర మాయ అడ్డు పడుతూనే ఉంది.

తిమితోదరం లోంచి తిమిరోదరంలోకి కాలాన్నీ, అంతరిక్షాన్నీ దాటిన యాత్ర మొదలయ్యింది. ఏడుస్తున్న ఆజుణ్ణి వసిష్టుడు ఊరడిస్తున్నాడు. మనిషికి మరణం ప్రకృతే. జీవించడమే వికృతి.

బహుసా నచికేతుడు యముణ్ని ఇదే అడిగి ఉంటాడు. మరణాన్ని జయించడం ఎలాగ అని కాదు, అసలు మరణమంటే ఏమిటి అనే.

2

Through me is the way into woeful city
through me is the way into eternal woe,
through me is the way among the lost people
Abandon all hope, you who enter

Dante (Inferno : III 1-4)

జీవితం నిరవధికమైన విషాదం,
బాధించే చీకటి, భయపెట్టే చీకటి, సంతోష దుఃఖం కలిగించే శూన్యం
నల్లని అడవి, చల్లబడని భూగర్భం, సమాధానం లేని వేదన
శవాలగది, గుహ్య మంత్రం, నిషిద్ధ దేశం, రహస్యమైన లోయ, పగిలిన కల
అది కామం, ప్రాచీన సర్పపరిష్వంగం.
కించిత్తిక్త రసాయనం, సోక్రటీస్ చేసిన విషపానం

జీవితం జీవితంలోకి ద్వారం, ప్రథమ బాధాప్రహారం
(అయ్యో నా వృషణాల్ని పాము కరిచింది)
వైద్యుణ్ణి పిలిపించారు, ఆ షామాన్ నేత్రాల్లో సామూహిక నృత్యాల రెపరెపలు,

(అమ్మమ్మా, నాకు సుంతీ చేయనివ్వకే)
పెదవులు అదుర్తున్నాయి, మంత్రోచ్చారణ చేస్తున్నాడేమో,
"చావు ముంచుకొచ్చింది, అయినా పర్వాలేదు,
సప్తసముద్రాలకి ఆవల గంధ మాదన పర్వతంపైని చందన తరువుని చుట్టుకున్న
మహాక్రూర సర్ప ఫణం మీది జ్యోతిర్మయమైన మణిని తెచ్చి తాకించండి"
అనుల్లంఘ్య కుడ్యాలకావల, నిరంతర సంశయాల పహరాల్ని దాటి
ఉద్వేల ఘోషిత సాగరాన్ని ఉత్తరించి మణిని తేవాలి.
లాభం లేదు, ఆశలు ఒదిలి పెట్టండి.
రోగం ముదరనియ్యండి, ఏదెలా జరిగితే అలాకానివ్వండి
చిత్రగుప్తుణ్ని చిట్టా రాసుకోనివ్వండి.

3

కస్మై దేవాయ హవిషా విధేమ?

– ఋగ్వేదం (10:121)

బ్రహ్మపట్నం పోదమంటే దారి తెలియదు దారి తెలియదు
దేవుళ్ళంతా చచ్చిపోయారు.
విశ్వం కూలిపోయి శకలాలయి పోయింది. ఏ పరిచిత ముఖంలోనూ
సాన్నిహిత్యపు ఆధారాలు దొరకనివేళ, ఏ పతాకాలూ, నినాదాలూ, మాయలూ
మంత్రాలు సంతృప్తి పరచని వేళ, నమ్మకాన్ని అపనమ్మకంగా చూస్తున్న వేళ
చేతలకి అర్థం పోయినవేళ, ఊహలకి ఆధారం కూలినవేళ
విలువలు సాపేక్షమయిన వేళ
రెక్కల్తో, కొమ్ముల్తో, నిప్పులు చిమ్ముతున్న బుసల్తో, దుమ్ము రేపే గిట్టల్తో
జంతువులు చుట్టుముట్టినపుడు,
భూతం ప్రేతంలా వెన్నాడినప్పుడు, క్రియలు అపరాధాలుగా పరిణమిస్తున్నప్పుడు
నేను ఇంతకాలం కొలిచిన దేవుళ్ళంతా ఏమయిపోయారు?
నా నైవేద్యాలు బలులు ఏమయ్యాయి?
ఏడు తాళ్ళ నిలువునా అతివిస్తీర్ణంతో పుట్టుకొచ్చిన ఈ మహాకాయాన్ని ఎలా ఎదుర్కోను?
ఏ థేసియస్ ఈ మెనోటార్ని వధిస్తాడు
ఏ ఇంద్రుడు ఈ వృతుణ్ని సంహరిస్తాడు?
ఏకాంత ధ్యానంలో ఆత్మప్రేమలో నన్ను అనుగ్రహించిన అపోలో ఏడి? వీనస్ ఏది?
నా గానాన్ని ఆపేసి, వాయిద్యాలు విరిచేసి, గుడ్డలు చింపేసి
మందలో కలసిపోయి డయోనిసిస్‌కి ఒక డితిరాంబు పాడుకోనా?
కాని మరి ఈ రాక్షసుణ్ణి ఏం చేసేది?
ఎక్కడ పోరాడేది?

ఆకాశంలోనా? భూమి మీదా? రాత్రిపూటా? పగటిపూటా?
వధించాలనుకొన్నపుడల్లా నన్ను నేనే వధించుకొంటున్నాను.
మోహాన్ని తెంచుకుని సన్యసించి నల్లని అడవుల్ని దాటి తెల్లని తీరాల్లోకి పోవాలనుకుంటానా?

కాని ఇరుకయినా లాబీరిన్త్‌ల్లో దారి తప్పుతున్నాను.
దివానీ ఖాస్‌లో కూచుని దేశదేశాల దేవదూతలతో సర్వేశ్వర రహస్యం చర్చిస్తుంటే
రొప్పుకుంటూ సేనాధీశుడు వచ్చి “ప్రభూ యుద్ధం మొదలయ్యింది” అంటాడు.

4

Whether its noble in the mind to suffer
the slings and arrows of outrageous fortune
or to take arms against a sea of troubles
- Shakespeare (Hamlet)

ఆ రాక్షసమహాకాయం భ్రమో, వాస్తవమో,
కాని ఎన్ని సార్లు వధించినా మళ్ళీ బతుకుతోంది.
దాని తలలు మళ్ళీ మొలుస్తాయి.
కపిలవస్తు నగరంలో ఎన్నిసార్లు ఈ విచిత్రాన్ని నేను చూడలేదు?
రోగగ్రస్తుడై క్షీణించిపోతూన్న మనిషిని ఎలా ప్రేమించను?
కోరలు చాచి మనిషి మనిషి మీదకు ఉరుకుతూంటే ఎలా చూడను?
చచ్చిన ఎద్దు కడుపులో పెరుగుతున్న బాక్టీరియా --
జీవిత పాపం నుంచి పూర్తిగా ఎప్పుడు విముక్తి లభిస్తుంది?
కమ్ముకున్న ప్రశ్నల తుఫానుల మధ్య, హెూరు పెడుతూన్న సంగ్రామ సాగరం ఎదుట
ముంచుకొస్తున్న భీభత్సాగ్ని చూస్తో --
అవలోకితేశ్వర బోధిసత్వుణ్నియి ఉండిపోవాల్సిందేనా?, లేక
సంకల్పాస్త్రాన్ని మంత్రించి, శరాన్ని సంధించనా?
కానీ, మన పిల్లలో?
నిర్భాగ్యురాలయిన ఆ తల్లి అననే అంది “ఓరి శాపగ్రస్తుడా
నిజాన్ని తెలుసుకొని ఎవడూ బాగుపడలేదు” అని
అయినా, అన్వేషణతో కాళ్ళు ఎంత వాచిపోయాయి ఈడిపస్‌కి.

5

తదేష సర్గః కరుణార్ద్ర చిత్తైః నమే భవిద్విః ప్రతిషేధనీయః
- కాళిదాసు (రఘు వంశము)

అజ్ఞాత తీరాల్లోని కాలాతీత మణి కోసం,
నా సాహస ప్రయత్నాన్ని ఆపకుండా సాగిస్తున్నాను.
కాని, నా శాపం నుంచి విడుదల కాలేకపోతున్నాను, అపరాధ పంకిలాన్ని
కడిగేయలేకపోతున్నాను, లోకం నుంచి
శోకాన్ని పూర్తిగా తుడిచెయ్యలేకపోతున్నాను
చక్రాన్ని ఛేదించాలని వలయాన్ని తుంచెయ్యాలని చుట్ట చుట్టుకున్న సర్పాన్ని వధించాలని
ముందుకు దూకి చక్రంలోనే ఇరుక్కొన్నాను
అయినా, నా పరిమితుల్ని నిరసిస్తూనే ఉన్నాను, బతుకుతున్న ప్రతి క్షణాన్నీ
ద్వేషిస్తూనే ప్రేమిస్తున్నాను. చావునీ, బతుకునీ సమంగా అనుభవిస్తున్నాను
ఈ సృష్టి ఎంత విషాదకరంగా ఉన్నా దీంతో కలిసి ఉండటానికే ఒప్పుకున్నాను.
తేజోమయ అంతర్లోకాల్లోకి, సృష్టి ప్రధమ క్షణంలోకి,
కాలాంత దూమంలోకి ప్రయాణిస్తో పడుతో లేస్తో
అగ్నిని తెచ్చాను, అమృతాన్ని తెచ్చాను
తయామత్‌ని మార్దుక్ చంపేసినప్పుడు ఎంత భీభత్సం, ఎంత విషాదం,
కన్నీళ్ళు.... భయం, హాహాకారాలు, దారుణం
అయినా అపజయమే విజయంగా పర్యవసించడం ఎంత అద్భుతం, ఎంత అద్భుతం,
శిలువకి గురికావడం ఎంత వేదన.
కాని శిలువ ఎక్కినవాడే పునరుత్థానం చెందగలడు
అచింత్యమైన జీవన రహస్యాన్ని ఎరిగినవాడు దక్షిణామూర్తి ఒక్కడే
కాని ఆయన మౌన మూర్తి, చిద్విలాసుడు!
హరిశ్చంద్రుడు చంద్రమతి మీదకి కత్తి ఎత్తినపుడు
కల మెలకువ అయి, మెలకువ కల అయి, రహస్యమేదో స్ఫురించి, మరచిపోయి....
కాని భీకరమైన స్మశాన రంగం పైని
మృతుడయిన పసి పిల్లవాడు నవ్వుతూ లేచి “అమ్మా” అంటూ చేతులుచాపుతాడు.

- 21-3-86



O Death, I have triumphed over thee within,
I quiver no more with the assault of grief.

- Aurovindo / Savitri (10:3)

అన్ని విధాలా deprive అయిన వాళ్ళు destitutes, హక్కులు కోల్పోయిన వాళ్ళు, వంచితులు -- వీళ్ళ దగ్గర జీవితం, ధర్మశాస్త్రాలు, కవిత్వం అన్నీ fail అయి పోతున్నాయి. It is impossible to soothe hungry millions with a poem of Kabir అని రాస్తారు గాంధీగారు ఒక చోట. మనుష్య నిర్మితమయినవన్నీ విఫల మయిపోతున్న చోట మనిషే నిలబడాల్సి వస్తుంది. మనిషికి మనిషి ఆవశ్యకత రావడమే భగవంతుడి ఆవశ్యకత. ఎవరు జీవితం నుంచి జీవం కోల్పోతున్నారో -- వాళ్ళ వైపు నిలబడి తిరిగి వాళ్లకి కొత్త స్ఫూర్తినీ, ఓదార్పునీ, ధైర్యాన్నీ ఇవ్వడం. ఇంత కన్నా ఎవరన్నా కోరదగింది మాత్రం ఏముంటుంది?

శారదగారికి (2-3-85 నాటి ఉత్తరం నుంచి)

నేను కవిగా జీవించడానికి ఎంత గొప్ప వరం అనుగ్రహించబడిందని. నిజంగా నా కవిత్వానికి అంత సజీవత ఉందా? నీ అస్తిత్వం ప్రభావిత మయ్యేంత నిగూఢ శక్తి నా అనుభూతి కలిగి ఉందా? వినమ్రంగా అరుణ పత్రాల దోసిలితో అర్ధించావు సరే. ఆ కవితాదానం ఇవగలిగే పాత్రత నాకుందా? .... రిల్కేని రోడిన్ ప్రభావితం చేశాడు. విమర్శకారులు ఏమన్నారంటే రోడిన్ రిల్కే కవిత్వాన్నే ఒక గొప్ప శిల్పంగా మార్చివేసాడని. నువ్వు నా శిల్పివి....

అనూకి (17-2-84 నాటి ఉత్తరం నుంచి)

(నా జీవమహల్లో విన్పిస్తున్న ఈ దేశదేశాల కవిత్వాన్నీ నీకు కాన్క చెయ్యనివ్వు)

# ఆదిమ ప్రార్థనా గీతం

(మనిషి మొట్టమొదటి పలుకు కవిత్వమే. అతని విహ్వలత, అలౌకికత పట్ల చింతన, ఆత్మ పట్ల చింత -- తొలినాళ్ళలో మతం, కవిత్వం, కళలు అన్నీ ఒకటే. ఒకే సామాజిక బృంద మంత్రగానాలు. అప్పుడు అతని ప్రార్థనా ఇదే. "మేమూ తినటం, నువ్వూ తిను". (శ్రీశైలం చెంచుల ఈ ప్రార్దనే అతి ప్రాచీనమయిన మంత్రమట!) కాని తర్వాతి దినాల్లో -- ఉత్పత్తి సంబంధాల్లో మార్పుని బట్టి కవిత్వం సామాజిక కేంద్రం నుంచి తప్పుకుంటున్న రోజుల్లో -- మళ్ళీ పూర్వపు రోజుల కోసం ప్రజ్ఞావంతులు ప్రయత్నించారు. వ్యాసవాల్మీకులు, హెూమర్, హీబ్రూ ప్రవక్తలు, సుమేరియన్, బాబిలోనియన్ పూజరులూను. కాని వాళ్ళు పురాణప్రతీకలని ఇవ్వగలిగారు తప్ప ప్రాచీన కమ్యూనిజాన్ని మాత్రం కాదు. ఈ క్రింది ప్రార్థన ఉత్తర అమెరికాలోని కెక్చిఇండియన్ల కోతపాట)

దేవుడా నువ్వే నా యజమానివి
నువ్వే నా తల్లివి, నువ్వే నా తండ్రివి,
కొండలకీ, లోయలకీ నువ్వే ప్రభువ్వి
ఇప్పుడు మూడు పగళ్ళ తర్వాత
నీ నోటిముందు నుంచే నీ ఎదటే
నా పంటని నేను పోగుచేసుకోవచ్చా?
నీ తిండినీళ్ళలో ఏకొద్దో నేను నీకు ఇస్తున్నది
అలా నేన్నీకు ఇస్తున్నది అల్పం.
కాని నాకోసం మాత్రం ఎంత తిండీ, ఎంత నీరు.
వాటిని నా ఆత్మకీ నా బతుక్కీ ఎరుకపర్చింది నువ్వే
నువ్వే నా తల్లివి, నా తండ్రివి
ఇక నేను కోత మొదలుపెడతాను
నీ అంగీకారం లేకుండా ఆజ్ఞలేకుండా
కోతకోసం నేను ఎలాతయారయ్యేది?
పంట పక్వం కావటానికి ఎన్ని దినాలు గడవలేదు?
కలుపు నుంచి పంటని వేరుచెయ్యడం అంత తేలిక కాదు,
నెమ్మదిగా చేసుకుంటాను
ఓ పవిత్రుడా, కొండలకీ లోయలకీ ప్రభువా, నా తల్లీ, నా తండ్రీ
మళ్ళీ ఎప్పటికి నీతో మాటాడగలనో ఎవరికి తెలుసు?
మళ్ళీ నేను నీతో మాటాడుతాను.
ఎప్పుడు మాత్రం కాదని, నా దేవుడా?

# ఋగ్వేదం

(ఋషివాక్కు, ప్రాచీన మానవసూక్తం, ఆదిమ ప్రార్ధనా గీతం, సమిష్టి జీవన యజ్ఞవాటిక చెంత సహస్రముఖాలూ, సహప్రసాదాలూ, కలిగిన విరాట్ పురుషుని జీవితానంద వ్యక్తీకరణ. కళ, సాహిత్యం, దర్శనం, రాజనీతి, ఉత్పత్తి సంబంధాలు -- అన్నీ కలిసి పలికిన జీవనగీత, నిరంతరమయిన మానవసత్యాన్వేషణలో తొలిపలుకూ, తుదిపలుకూ కూడా. భారతీయ జీవన స్రవంతిలో అంతర్వాహిని అయిన సరస్వతి. మన రక్తంలో మెర్జ్ అయిపోయిన వేదాంతస్రోతస్సు.)

సృష్టి రహస్యం (10-129)

అప్పుడక్కడ ఉండకపోవటమన్నది లేదు. అప్పుడీ విశ్వాన్నంతా ఆవరించినదేమిటి? ఎక్కడుంది? దేని కోసం? అప్పుడు జలపూరితాలయిన ఏ అగాధాలు ఆవరించాయి?

అప్పుడు మృత్యువూ లేదు. అమరత్వమూ లేదు. రాత్రి లేదు, పగలు లేదు, చీకటి లేదు, వెలుతురు లేదు. అప్పుడు అస్తిత్వంగా వున్నదేదో అది తనంత తనే విశ్వసించింది. అది తప్ప ఇంకా అక్కడ మరేమీలేదు.

ఆదిలో తిమిరంలో తిమిరం దాగి వుంది. అస్పష్టంగా జలాలు అంతటా ఆవరించి వున్నాయి. శూన్యం చేత ఆవరించబడ్డ జీవశక్తి అప్పుడు తపః శక్తి చేత పైకి వెల్లడయ్యింది.

మొదటగా దానికి సంకల్పం కలిగింది. అదే మనసు తాలూకు ప్రథమబీజం. తమ హృదయంలోకి అంతర్ముఖులై జ్ఞానాన్ని అన్వేషిస్తూన్న కవులు దాన్నే అనస్తిత్వంలో కదలిక పొందిన అస్తిత్వబంధం అన్నారు.

నిద్రాణమైన జీవితాన్ని వెలిగించిన ఆ కిరణం అంతదాకా ఎక్కడుంది? కిందనా? మీదనా? కిందన క్షేత్రం వుంది. పైన బీజం, కిందన శక్తులు స్పందించాయి. పైని శక్తులు ప్రాణం పోశాయి.

నిజంగా ఎవరికి తెలుసు? దాన్ని ప్రకటించేదెవరు? ఈ విశ్వం ఎప్పుడు ఎలా ప్రభవించింది. దేవతలంతా నిన్నమొన్నటివాళ్ళు, ఇక దాని మూలం గురించి తెలిసిన వాళ్ళెవరు?

ఈ సృష్టి ప్రభవించినప్పుడు- బహుశా అది తనంత తానే రూపొందిందో-లేదో పైన ఎత్తున స్వర్గంలో ఉండే సర్వశక్తిమంతుడయిన వాడు మాత్రమే తెలుసుకుని ఉండాలి. లేదా బహుశా అతనికి కూడా తెలియకపోయి ఉండాలి.

# అశోక ప్రియదర్శి

(ద్వేషపూరిత హృదయాలకు తృప్తి లేదు అంటోంది దమ్మపదం. హింసని హింసతో అంతమొందించడం సాధ్యం కాదని ఎరిగినవాడు కనుకనే శాక్యముని ప్రత్యామ్నాయంగా ఉన్నతమైన జీవనవిధానాన్ని అన్వేషించాడు. మానవసంబంధాల్ని ధార్మికం చెయ్యడం ద్వారా అది సాధ్యపడుతుందని. సాధారణ ప్రపంచంలో ధర్మం ఎప్పుడూ నైతిక సూత్రాల ద్వారానే వ్యక్తం కాబడుతుంది. ఈ సూత్రాల్ని గుర్తుగా పెట్టి ఉంచడంతో చాలదు. వాటిని ఎప్పటికప్పుడు మననం చేస్తూ ఉండాలి అంటాడు అశోకుడు. ప్రియంగానూ సత్యంగానూ ఉండే ఆయన శాసనాలు రుజుత్వ  పొందిన కవితావాక్యాలు. అందుకు మేలి ఉదాహరణ ఈ రెండవ బ్రహ్మగిరి శిలాశాసనం)

సత్యం గురించీ, మర్యాద గురించీ

చక్రవర్తి అశోకుడు ఇలా అంటున్నాడు
ప్రతి ఒక్కడూ తన తల్లి పట్ల తన తండ్రి పట్ల విధేయుడై ఉండుగాక.
ప్రతి ఒక్కడూ జీవితపు పవిత్రతనీ, అత్యున్నత విలువల్నీ గౌరవించుగాక.
ప్రతి ఒక్కరూ సత్యమునే పలుకు గాక,
ప్రతి ఒక్కరూ ధార్మికమైన ఈ సూత్రాల్ని పాటించుగాక.
ఆ విధంగానే, శిష్యులు తమ గురువుల్ని గౌరవింతురు గాక.
ప్రతి ఒక్కరూ కుటుంబంలో సముచితంగా మెలుగుతూ బంధువులతో మర్యాదగా ఉందురుగాక
ఇదే ధర్మం యొక్క సనాతనమైన మన్నన, పూర్ణ జీవితానికి మార్గమూ.
మనుషులు తదనుగుణంగా వర్తింతురు గాక.

# కబీర్

(భారతీయ సాహిత్య స్రవంతిలో కబీర్ ఒక విశిష్ట సంఘటన అంటుంది ఎవిలిన్ అండర్‌హిల్. నిరాకారసత్యాన్ని, ప్రేమమయమయిన జీవితవాస్తవికతలో దర్శించడమే కాక, తన దయాప్లావిత దర్శనాన్ని నిరాడంబరంగా పలికి, అలా జీవించగలిగిన మహాపురుషుడు. ఒక టాగూర్, ఒక గాంధి కలిపినా కూడా కబీర్ కావడానికి ఇంకా కొంత విశిష్టత అవసరమనే అన్పిస్తుంది. మాయా పటలాన్ని ఛేదించి అశ్రువులు తుడిచి మనిషిని కావిలించుకొన్న స్త్రీ -- కబీర్ కవిత్వం)

1.

నన్ను నా ప్రియుని ఇంటికి కొంపోవటానికి పల్లకీ వచ్చింది.
దాని రాకతో నా హృదయంలో ఆనంద ప్రకంపనలు ఝల్లుమన్నాయి.
కాని బోయీలేమో నన్ను నిర్జనారణ్యానికి తీసుకొచ్చారు.
అక్కడ నా వాళ్ళన్న వాళ్ళెవరూ లేరు.
ఓ బోయీల్లారా, నేను మీకు ప్రమాణంగా చెప్తున్నాను, ఒక్క క్షణకాలం
ఓపిక పట్టండి, నన్ను నా మిత్రుల దగ్గరకీ, బంధువుల దగ్గరకీ వెళ్లిరానీండి
వాళ్ళ నుంచి సెలవు పుచ్చుకొస్తాను
దాసానుదాసుడు కబీరు గానం చేస్తున్నాడు, ఓ సాధూ,
నీ అమ్మకాలూ, కొనుగోళ్ళూ ముగించు. మంచి చెడ్డలు తేల్చివేసెయ్యి.
ఇక నువ్వు వెళ్లబోయే దేశంలో సంతలూ, దుకాణాలూ ఉండనే ఉండవు.

2.

నిర్గుణత ముందు సగుణత నృత్యం చేస్తుంది
నువ్వూ నేనూ ఒకటేనని మంగళ వాయిద్యాలు మోగుతాయి
గురువు వచ్చి శిష్యుని ముందు శిరసు వంచుతాడు
ఇది అద్భుతాల్లో కెల్లా అద్భుతం.

## ఎమ్.కె.గాంధీ

(ఎవరు సత్యాన్వేషికుడో, ఆయన నడిచినంతామేరా కవిత్వ పరిమళం మోసులెత్తుతుంది. కవిత్వమంటే శిల్పవిశేషం కాదు. ప్రక్రియాచాతుర్యం, చమత్కారం కానే కావు. ఏ కారణం వల్ల ఈశోపనిషత్ కవిత్వమవుతుందో, పసిపిల్లల మాటలు కవిత్వమవుతున్నాయో, జాతుల స్వాతంత్ర్య ప్రకటనలూ, విప్లవకారుల నినాదాలూ కవిత్వమవుతున్నాయో, ఆ మౌలిక మానవశ్రేయశ్చింతనే మహాత్ముడి వాక్యాల్ని కవిత్వం చేస్తోంది. కాని ఆయన వాక్యాల్లో -- నినాదాలూ, చిలిపితనమూ, సమర ఘోష, మోక్షకామన -- వీటిని మించిన కాంతాసమ్మితత్వం ఉంది. తల్లిని విడలేని పిల్లాడిలా ఈ దేశాన్ని తానూ ఒదలలేకపోతున్నానని అన్నాడాయన -- కాని ఈ దేశమనే పిల్లాడికే తల్లిలా నిలిచాడు. జీవితం కవిత్వం కావడం అంటే అదే. గాంధీగారు, నిస్సందేహంగా, నాకు తెలిసిన కవుల్లోకెల్లా గొప్పకవి)

1

యంత్రంతో నిర్మించబడ్డ వృక్షం ఎలాగుంటుందో నేనెరుగుదును,

దాని ఆకులన్నీ ఒక్కలానే వుంటాయి.

2

కవి రేపటి కోసం జీవిస్తాడు, మనల్నీ అలాగే చెయ్యమంటాడు. ప్రభాత వేళ పవిత్ర గానం చేస్తో పక్షాలపై విహరించే పక్షుల అద్భుత దృశ్యాన్ని ఆరాధనీయంగా మన ముందు పెడతాడు. ఆ పిట్టలకి ఏ పూట తిండి ఆ పూటకి దొరికి రాత్రి విశ్రాంతి తీసుకొని రెక్కల్లో కొత్త రక్తం నింపుకుని విహరిస్తాయి. కాని ఈ ఆకాశం కింద నేను చూస్తున్న పక్షులో? బలం చాలక రెక్కల్ని కూడా చాపలేని అశక్తులు. పని చేసేలోగా నీరసించే పక్షి జాతి మనది.... దుఃఖంలో మగ్గుతున్న అన్నార్తకోటిని కబీరు పాటతో ఓదార్చడం నా వల్ల కాదు.

3

నేను పడే బాధలకు హిట్లర్ చలించకపోయినా నాకు నష్టం లేదు.

నా గౌరవం ఒక్కటే రక్షించుకోదగింది, అది హిట్లర్ దయా దాక్షిణ్యాల మీద ఆధారపడి లేదు.

అతని నమ్మకం ఇప్పటి దాకా, మనిషి పశుబలానికి లొంగుతాడనే. నిరాయుధులైన స్త్రీ పురుషుల శాంతియుత ప్రతిఘటన. అతనికి ఒక కొత్త అనుభవం ఆపుతుంది ఇక.

తనని మించిన శక్తి గొప్పదనానికి లొంగని స్వభావం కాదేమో అతనిది.

ఏమంటే, హిట్లర్ కి కూడా నా వంటి ఆత్మే ఉన్నది.

# భారతీయాంగ్ల కవిత

(ఇండో ఆంగ్లియన్ కవిత కమలాదాస్ అన్నట్లుగా ఇండియనూ, ఆంగ్లీయనూ కూడా, దాని తప్పొప్పులన్నిటితో సహా, టాగూర్, అరవిందులు, తోరూధర్ -- ఇలా గొప్ప ఉదాహరణల్తో పాటు స్కూల్ మాగ్జయిన్లలో పిల్లలు రాసేవాటిదాకా -- అన్ని స్థాయిల్లోనూ, ఆ ప్రయత్నం ఒకటే ఆశిస్తుంది. ప్రపంచం వైపుగా చేతులు చాపటమే. అందుకనే దానికి అంత సారళ్యం, లోటు. ముఖ్యంగా నిజాయితీ. భారతీయుల ఆంగ్లవ్యక్తీకరణ ఐరిష్ల, అమెరికన్ల వ్యక్తీకరణకి ఏమాత్రం తీసిపోనిదే. ముఖ్యంగా క్లుప్తతతో, నిస్సీం ఎజేకీలు చక్కని ఉదాహరణ)

నిజాయితీపరురాలు

ఇప్పుడు నువ్వు నాకు బాగా దూరం
అని రాస్తోంది ఆమె
నన్ను బాధించాలని కాదు,
కేవలం నిజాయితీకి.
ఆమె
నిజాయితీగానే తనకేం కావాలో తీసుకుని
ఇంకేమాత్రం అక్కర్లేదనుకున్నపుడు
తిరిగి
నిజాయితీగానే ఒదిలేసింది.
ఒక స్త్రీని
ఆమె నిజాయితీకి ఎవరు మాత్రం తప్పుపట్టగలరు?
నా అద్దంలో
నిజాయితీని ధృవీకరిస్తున్న
ఆమెనే నగ్నంగా చూస్తో
ఆమె ప్రేమ నుంచి బహిష్కృతుణ్నియి
నానించి ప్రవాసితుణ్నియి
చూస్తున్నాను ఇప్పటికి
నిజాయితీగల స్త్రీలతో నిండిపోయిన ప్రపంచాన్ని.

## ఆధునిక భారతీయ కవిత

(ఆధునిక భారతీయ కవిత పూర్వార్ధంలో ప్రబోధకవిత, ఒక సౌందర్యంవైపో, సత్యం వైపో, ఉత్తేజపరచిన శంఖారావం. తర్వాతకాలంలో అది అభిశక్త కవిత. జీవితజ్వరానికి, గ్లానికి డయాగ్నసిస్. కవిత్వం విజయసాధనా మార్గంగా కాక ఆశక్తతా ప్రకటన కావడమే ఆ మార్పు. మొదటి యుగానికి టాగూర్ ప్రతినిధి అయితే, తర్వాత యుగం ముక్తిబోధ్‌ది. గుజరాతీ ప్రజాకవి మేఘాణి, బెంగాలీ యువకవి తుషార్ రాయ్ ఆ దారుల్లోంచే నడిచారు.)

యువతరాల స్వప్న లోకం

మనసు ఊహల్తో ఎగిసిపడుతోంది. ఆత్మ విహారానికై రెక్కలు చాపుతోంది
అజ్ఞాత లోకాన్ని కలలుకంటోంది యువత.
ఆ అజ్ఞాతదేశ దిగంతం మీద లగ్నమైంది యువత దృష్టి, యువతరాల దృష్టి.
పథం అనిశ్చితం, అయినా ఆత్మ అశ్వాన్ని అధిరోహించింది.
తన మహావిహంగ పక్షాల్ని కదిలిస్తోంది
రక్త వస్త్రాలు ధరించి యువత సంగ్రామ రంగంలో అడుగుపెడుతోంది.
వాళ్ళని ఆపేదెవ్వరు? శోకించేదెవ్వరు? -- ప్రియమైన వాళ్ళు శోకించకుండుగాక
కన్నీళ్ళని ప్రకటించకండి. అది మంచి శకునం కాదు
నవ సైనికుల ఉత్సాహాన్ని చల్లార్చకండి
మత్తుపరిచే ప్రయత్నాల కోసం వెదకకండి
అందరినీ ప్రార్థిస్తూ వేడుకొంటూ శోకిస్తూ
వెనుకంజవేసి తడబడుతూ -- ఆ రోజులన్నీ తొలగిపోతున్నాయి
బలహీనమయిన ఆ దినాలు గడిచిపోయాయి
ఇతరుల దయని యాచించడం అయిపొయింది. ఇప్పుడిక ధీరత్వంతో
యువత ముందుకు సాగుతోంది

ప్రపంచ రణరంగంమీద యువలోకపు శకం మొదలయ్యింది.
అజ్ఞాతాన్ని తెలుసుకోవడానికి, అగణ్యాన్ని గణించుకోవడానికి
సత్యాల పరిమితుల్ని అతిక్రమించడానికి -- యువత శంఖం పూరించింది
అజ్ఞాత సీమల్ని చేరుకోవడానికి, ఎల్లల్ని తుంచివెయ్యడానికి
అగాధ సాగరగర్భాల్ని అందుకోవడానికి, దూర ప్రపంచాల్ని చుట్టిరావడానికి
మృత్యువు నెదుర్కోడానికి
ఈనాడు యువత ఈ మార్గంలో జీవించడానికి సిద్ధపడుతోంది.

# కలకత్తా

కలకత్తా, నువ్వు వివాహాలకీ అంత్యక్రియలకీ అమ్ముకొనే రజనీగంధలూ, రక్తవర్ణగులాబులూ అప్పుడప్పుడు గొప్ప యోధుల పటాల్ని కూడా అలంకరిస్తూంటాయి.

స్మశానానికి పాడె మీద పోతున్న జీవనానందుడి వేలాడుతున్న ముఖం, ఆరోజు నాకింకా గుర్తే. అతనికి పువ్వులు చాలవు. తురాయిలు కావాలి. సాయింసంధ్యలో జగన్నాథఘట్టం దగ్గర పిల్లల కోసం ఏడ్చే గొడ్రాలిలా భంగు పీలుస్తూ మరొక్కసారి అనుకొన్నాను, పువ్వులా, హాస్యాస్పదం, ఎంత మూర్ఖుణ్ణి !

సుఖతాప్త, కాంక్షాతప్త సత్రశాల, ఆకాశహర్మ్యాల వంటి మైదానాలు– ఓ పతనమా నీ అద్భుత సౌందర్యం నా భార్యకి కొనాల్సిన లూపుని గుర్తుచేస్తోంది. అలాగే నా అజీర్తి రోగం నయమవుతుందనీ చెప్తోంది. కుంచె, రంగులు కొనాలని పెయింట్ షాపుకి పోతూ పక్కసందుల్లోకి జొరబడతాను. అక్కడ లెక్కలేనన్ని దుకాణాల్లో రబ్బరు తొడుగులు అమ్ముతారు.

ఉబ్బిన బుడగలు ధరించి తిరిగే ఆడపిల్లలు, చిరిగిపోతున్న హిందీ ఫిల్మ్ పోస్టర్లు. నాకు కోపమొస్తుంది. స్టాక్ మార్కెట్లో నా సాహిత్య ధర పడిపోతున్నందుకు కోపం. అయినా నవ్వుతాను. ముగ్గురు ఇంబసైల్ ప్రొఫెసర్లు ముగ్గురు విద్యార్థినుల జాకెట్ల ఉగ్రత గురించి కథలుగా చెప్పుకొంటున్నందుకు.

క్రమేపీ ఆకాశం గూడా శిధిలమవుతోంది.

కలకత్తా, ఓ లంజా,
మధుమేహ రోగి మూత్రంలాంటి, అత్యద్భుత వర్ణచిత్రం లాంటి
పచ్చని రుజాగ్రస్త ద్రవాన్ని నువ్వు విసర్జిస్తున్నావు
పుష్పం / ఫూల్, నిశ్శబ్దం, హాస్యాస్పదం !

# గజల్

(గజల్ ఒక సంస్కృతి అన్నాడు ఒక రసజ్ఞుడు. పారశీక కవుల మాధుర్యం అరబిక్ జీవన సంఘర్షణ, సూఫీకవుల వేదన, భక్తికవుల తన్మయీభావన, కొరాన్ నుంచి కృష్ణతత్త్వం వరకూ ప్రాచీన వేదాంతాలు ఆశించే విశ్వప్రేమ -- ఏఒక్క గజల్ ని కుదిపినా కొన్నియుగాల జ్ఞాపకాలు రెపరెపలాడతాయి. కవిత్వంగా అది ఒక విశిష్ట జీవిత సంవేదన. ఆనంద విచారాలు సమంగా పలికిన అభివ్యక్తి. ఒకచేత పానపాత్ర మరొక భుజాన శవం, ఏమిజీవితం అని గాలిబ్ అన్నట్లుగానే ఢిల్లీగజల్ ఆ ఒడిదుడుకులు పడింది. నూరుమార్లు దోచుకోబడ్డా ఆశ చావని దిల్ గా ఢిల్లీని కవిచక్రవర్తి మీర్ ఉపమిస్తాడు. మొగల్ సామ్రాజ్య పతనకాలంలో ఆశని వెతుక్కుంటూ కవి బృందాలు అవధ్ కి వెళ్ళిపోతున్నప్పుడు -- అలమికొన్న శూన్యాన్ని ప్రకటిస్తూ పాదుషా బహదూర్ షా "జఫర్" పాడిన గీతిక ఇది)

ఎవరికన్నుల కాంతినీకాను

నేను ఎవరికన్నుల కాంతినీకాను
మరి ఎవరి హృదయపు శాంతినీ కాను
ఎవరికొరకూ పనికిరాని వాడిని
నేను ఒక పిడికెడు ధూళిని
దివ్యమంత్రాలు ఇక్కడ ఆలపించడం దేనికి !
నాలుగు పువ్వులు చల్లిపోవడం దేనికి?
ఇంకా ఎందుకీ దీపాన్ని వెలిగించే ప్రయత్నాలు?-
నేను ఒక నిరర్థక సమాధిని
ఈ జాఫర్ ఎవరికీ అనురక్తుడూ కాదు,
ఎవరికొరకూ విరక్తుడూ కాదు,
నేను వికలమయిన ఏ భాగ్యరేఖనో, మరి
శిధిలమయిన ఏ నష్టభూమినో,

# చైనా కవిత

(ప్రాచీనమైన నాగరికత, సుదీర్ఘమైన చరిత్ర, విశాల భూమీ ఖండం, అత్యధిక సంఖ్యాకులయిన మానవులు నివసిస్తున్న దేశం -- చీనియ కవిత కూడా అన్ని ఒడిదుడుకులూ పడింది. అత్యంత ప్రాచీన జానపద గీతాలు మొదలుకొని లూమన్ ప్రజా సాహిత్యం దాకా -- మనిషికీ ప్రపంచానికీ మధ్య సంబంధం పైన చైనా కవులు ఆలోచిస్తూనే వచ్చారు. అయితే ఇక్కడ మాత్రం క్రీ.శ. ఆరేడు శతాబ్దాలలో పుష్పించిన రసోన్మత్త కవితా వాక్యాలనే ఇవ్వడం జరిగింది. ఆ కాలం చైనా కవిత్వానికి స్వర్ణయుగం. బుద్ధుడు లౌత్సా కన్ఫ్యూషియస్ -- వీరి ప్రవచన కాంతి ఒక వైపు, జీవన విషాదం మరొకవైపు. నడుమ సాక్షాత్కరించే సౌందర్య శకలాలు -- ఆర్తితో కొట్టుకున్న పిచ్చివాళ్ళ మోహనం వేదన కాని ఏ తూపూనో "యుద్ధ ధూమం నీలంగా ఉంటుంది, మనిషి ఎముకలు తెల్లగా ఉంటాయి" అని తేల్చి పారేస్తాడు)

1

నేను నా కుటీరాన్ని జనావాస ప్రాంతాల్లోనే కట్టుకుంటాను. కాని నా దగ్గరలో గుర్రాల చప్పుడూ బళ్ళ సందడీ ఏమీ ఉండదు. ఇదెలా సాధ్యమో నీకు తెలుసా?

ఏకాకి అయిన హృదయం తనచుట్టూ తనకోసం వాతావరణాన్ని నిర్మించుకుంటుంది. నేనేమో తూర్పు పంక్తిలోని చామంతిపువ్వుల్ని కన్నార్పకుండా చూస్తూనో ఉంటాను. సాయంకాలపు గాలులు పర్వత సానువుల మీంచి నిండుగా వీస్తుంటాయి. పిట్టలు జంటలు జంటలుగా గూళ్ళకి తిరిగి వస్తూంటాయి.

ఏ చిన్ని చిన్న వాటిలోనే ఏదో లోతయిన అర్థముంది కదూ, అయినా అదేమిటో చెప్పబోతే, సరిగ్గా దొరక్క పదాలు విఫలమయిపోతాయి. (తానోచిన్)

2

మా వూళ్ళో యీ ఋతువులో నేలంతా రాలిన పువ్వులతో మందపు తివాసి పరిచినట్లే ఉంటుంది. వసంతంలో ఒంటరిగా ఏడవగలిగేదెవ్వరు? ఎంత గంభీరులయితే మాత్రం ఈ దృశ్యాన్ని చూస్తూ ఉండగలరా?

ధనికులో పేదలో అల్పాయుష్కులో పూర్ణాయుష్కులో సృష్టికర్త అన్నీ అమర్చే పెట్టాడు. ఒక మధుపాత్ర చాలు జీవన్మృత్యువుల్ని సమం చెయ్యడానికి. దాని ముందు వెయ్యిన్నొక్క యితరవస్తువులూ చాలవు.

తాగినప్పుడు, నాకు స్వర్గమూ లేదు, భూమీ లేదు. నిశ్చలంగా నా ఏకాంత శయ్యకి అంటిపెట్టుకుంటాను. చివరికి అసలు నేనున్నానన్న సంగతే మర్చిపోతాను. కాని మరి సరిగ్గా అప్పుడే నా ఆనందం ఉధృతమయ్యేదీను. (లీ పో)

# హైకూలు

(నిజానికి హైకూ ఒక ఛంద: విశేషం. కాని, దాన్ని అలా పరిమితం చెయ్యలేం. జపనీయ కవిత్వంలో అది ఒక ఉన్నత సంవేదన. జపాన్ జీవితం గురించి విన్న తరువాత, వాళ్ళ సౌందర్య దృష్టి తెలిసిన తర్వాత హైకూలు పలకడం వాళ్లకి మాత్రమే సాధ్యమనిపిస్తుంది. సత్యావబోధ మనిషికి కలిగిన క్షణాన దేశకాల ప్రమాణాలుండవు. అది క్షణికమై శాశ్వతమైన దివ్యానుభావంగా ఉండి పోతుంది. మానవాత్మనీ, భూమ్యాకాశాల్నీ, వెలుగునీడల్నీ ఒకే ఒక స్నాప్ షాట్ లో పట్టే ప్రక్రియ ద్వనికి ప్రతీక, రసజ్ఞునికి రాసోన్మాద వృక్షపు బీజాన్ని నాటి దాటిపోయే విద్యుల్లత)

మృత్యు గీతాలు

1

నేను చూసాను ప్రేమికుల్ని,
చెర్రీ పువ్వుల్ని,
కోయిల్ని
ఇక తృప్తిగా నిద్రపోతాను

– అనామకం

2

సగందారిలోనే జ్వరం ముంచుకొచ్చింది
నా కలలు మటుకు
లేచి నడక సాగించాయి
మరేదో శూన్యదేశంలోకి

– బాషో

3

మూడు ప్రియాతి ప్రియమైన విషయాలువెన్నెల
చెర్రీ పువ్వులు,
ఇక నిశ్శబ్ద హిమాన్ని అన్వేషిస్తోపోతాను

– రిప్పో

4

మంచు కమ్ముకొంటోంది
ప్రపంచమంతటా మంచు
ఎంతో ప్రియంగా, ఎంతో కొత్తగా
ఎంతో క్షణికంగా

– ఇస్సా

## రష్యన్ కవిత

(రష్యన్ కవిత సోవియట్ కవితగా చెందిన పరిణామం మనిషి భూమిని స్వర్గంగా మార్చుకునే ప్రయత్నాల ప్రతీకాత్మక చిత్రణ. పుష్కిన్, లెర్మంటోవ్‌ల నుండి మయకోవస్కీ, బ్లాక్, బువిన్, పాస్టర్ నాక్ ల్తో సహా ఇప్పటి కైసన్ కుల్యవ్ రసూల్ గాంజటోవ్ ల దాకా అందరి ఆవేదనా ఒక ఉదాత్త మానవసంవేదనే)

హామ్లెట్

వాళ్ళంతా నిశ్శబ్దంగా ఉన్నారు, నేను స్టేజీ ఎక్కుతాను
ఒక తెరిచిన తలుపుకి జారగిలి
ఏదో దూర ప్రతిధ్వనిని ఆలకిస్తూ
భవిష్యత్తు వుద్దేశ్యమేమిటో వెతుకులాడుకుంటాను.

తొంగిచూచే వెయ్యినొక్క అద్దాల్లోంచి
రాత్రి అంచు నా వెనగ్గా మెరుపులీనుతుంది. తండ్రీ
తండ్రీ, నీకు చాతనయితే,
ఈ పానపాత్రని నానుంచి దూరంగా తీసెయ్యి.

నీ పటిష్టమయిన వ్యూహాన్ని నేను ఆరాధిస్తాను
ఒకసారి చిరునవ్వి సంభాషణలు చదువుతాను
కాని ఈ రాత్రికి మాత్రం ఇది వేరే కథ.
కనుక దయచేసి నన్ను మన్నించు ఈసారికి

అయినా సన్నివేశం తర్వాత సన్నివేశం వస్తుంది. ఈ
దారి ఎక్కడికి పోతుందో అక్కడికే పోతుంది, నేను ఒంటరిని
ఈ పవిత్ర ప్రదర్శనలో ప్రతి ఒక్కటీ మునిగిపోతుంది
జీవితం ఒక వ్యాహ్యాళి ఎంతమాత్రం కాదు.

– బోరిస్ పాస్టర్ నాక్

## అమెరికన్ కవిత

(అమెరికన్ తత్త్వశాస్త్రంలానే అమెరికన్ కవిత్వం కూడా ఒక ఆత్మికమైన ప్రయత్నం సంపన్నంగానూ, యాంత్రికంగానూ, సాంకేతికంగానూ మహాప్రమాణాల్తో విస్తరిస్తున్న అమెరికన్ సమాజంలోని అంతర్గత వైరుధ్యాల్ని బయటికి పట్టి, ఒక ఆరోగ్యమయిన మానవతాపూర్వకమయిన దేశాన్ని కలగన్నారు ఆ కవులు. అమెరికా ఆత్మని దర్శించిన వాల్ట్‌విట్మన్ ఆదర్శంగా ఇలియట్, పౌండ్, జెఫర్స్ ఆడెన్ అట్లాంటి ప్రయత్నాలు చేసారు. అది యింకా సూక్ష్మంగా జరిగితే ఎడ్గార్ పో, ఎమిలీ డికిన్ సన్, రాబర్ట్ ఫ్రాస్ట్, రాబిన్ సన్ ల కవిత్వమవుతుంది.)

నేను మరణించినప్పుడు

నేను మరణించినప్పుడు ఒక ఈగ ఎగరడం విన్పించింది.
అప్పుడు గదిలో పరచుకొన్న నిశ్శబ్దం
సముద్రపు తుఫానుల పీడనంలో
గాల్లో ఆవరించిన నిశ్శబ్దంలాంటిదే.

చుట్టుపక్కల కళ్ళు చూస్తున్నాయి
శ్వాసలు చిక్కనయ్యాయి
ప్రభువు గదిలో ప్రత్యక్షమయ్యేదాకా
అదట్లా ఎగురుతూనే ఉంది.

నా ఆస్థులకి వీలునామా రాసేసాను
ఇవ్వగలిగిన మేరకి చేవ్రాలు
చేసేసెను -- అప్పుడు
కనబడింది ఆ ఈగ

దీపకాంతికీ నాకూ మధ్య
అనిశ్చితంగా ఆటంకంగా నీలంగా దాని ధ్వని
కిటికీలు మూసుకొన్నాయి
ఇక చూద్దామన్నా చూడలేకపోయాను.

– ఎమిలీ డికిన్ సన్

## ఇంగ్లీష్ కవిత

(గ్రీకు లాటిన్ ల సాంస్కృతిక వారసత్వంలోంచి ఫ్రెంచి కవుల సుకుమార కల్పన లోంచి జర్మన్‌ల తాత్విక వివేచనని సంతరించుకొని జానపదాల మాధుర్యంతో జీవన సౌందర్యాన్ని గానం చేసిన కవిత, ప్రపంచమంతా విస్తరిల్లిన పరాగం, లోతూ, వైశాల్యమూ సమంగా ఉండే శాంతనదీప్రవాహం. సౌందర్య రసోన్మత్తుడైన షెల్లీలో సమకాలిక లోకం పట్ల కలిగిన వివేకాన్ని ఇందుకు ఉదహరించవచ్చు.)

1819 లో ఇంగ్లాండ్

వృద్ధ ఉన్మత్తాంధ నిర్వీర్య మృత్యు సమీపస్థుడైన ఒక చక్రవర్తి.
నీరస వంశావశిష్టం, పంకజనిత పంకిలం,
ప్రజాద్వేషపు రాకుమార సంతతి.
ఏ దెబ్బా లేకుండానే నెత్తురు కక్కుతూ రాలిపొయ్యేదాకా
ఆబగా దేశం చూరు పట్టుకు వేలాడే
హృదయ రహిత అజ్ఞానాంధ పాలకవర్గం
బంజర్లలో నడుం విరిగి కడుపు మాడుతున్న ప్రజానీకం
ధరించినదెవరయినా, రెండంచులూ పదునయిన కత్తిలాంటి
స్వేచ్ఛా హంతకి, మృగాయాసక్త సైన్యం
రక్తదాహపు గోముఖవ్యాఘ్రాలయిన బంగారు న్యాయసూత్రాలు
ఎన్నడూ తెరవబడని, క్రీస్తురహిత దైవరహిత గ్రంథం లాంటి మతం
ఎన్నడూ సమావేశంకాని హీన సెనేట్ --
(చూస్తుండగానే) ఈ
సమాధులన్నిటిలోంచి ఒక ఉగ్రభూతాకారం విస్ఫోటం చెంది,
మన కల్లోలిత దినాల్ని కుదిపిస్తుంది.

# జర్మన్ కవిత : గొథే

(పాశ్చాత్య చరిత్రకారుడు స్పెంగ్లర్ ప్రాచీన కాలానికి లాటిన్ కవి లుక్రీషియస్, మధ్యయుగాలకి డాంటే, ఆధునిక యుగానికి గొథే ప్రతినిధులని చాలా సమంజసంగా అన్నాడు. విస్తృతమవుతున్న నిశ్చయ సంశయాల మధ్య వూగిసలాడుతూ మరింత సంక్లిష్టమవుతున్న ఆధునిక జీవిత చిత్రాన్ని గీయగలిగాడు కనుకనే థామస్ మాన్ అతణ్ణి డార్లింగ్ ఆఫ్ మాన్ కైండ్ అన్నాడు. హైన్రిఖ్ హీన్ అతణ్ణి మహా విహంగ పక్షాల్తో కదిలే జాజ్జ్వలమానమైన శక్తి అన్నాడు. కవిత్వాన్ని, స్వయంపూర్ణతనూ, సత్యాన్వేషణనీ సమన్వయపరచుకొన్న గొథేని చూసినప్పుడు "అదుగో నిజమైన మానవుడు" అని నెపోలియన్ అనడం సమంజసమే)

ప్రొమిథియస్

స్వర్గాధినాథుడా, నీ స్వర్గాన్ని మబ్బు తెరల్తో కప్పుకో, పువ్వుల్ని తెంపే పిల్లాడిలా మహా శిఖరాల మీద తిరుగు. కాని నా భూమిని మాత్రం నాకు ఒదిలెయ్యి. నువ్వు నిర్మించని యీ చిన్ని గూటిని, నువ్వు అసూయపడే యీ వెచ్చని నెగడిని మాత్రం ముట్టకు.

సూర్యుడు సాక్షిగా, మీ దేవుళ్ళంత హీనుల్ని నేనెక్కడా చూడలేదు. బలుల మీదా, ప్రార్థనల మీదా బతికే మూర్ఖులు --

ఒకప్పుడు, బాల్యంలో, పైని ఎవరో నా గోడు వింటారన్నట్టే, ఏదో ఒక హృదయం పీడితుల మీద జాలి చూపిస్తున్నదనే, విభ్రమ నేత్రాల్ని ఆకాశానికి సారించాను.

కాని రాక్షస దౌర్జన్యం నుంచి నన్నెవరు రక్షించారు? మృత్యువు నుంచీ దాస్యం నుంచీ నన్నెవరు తప్పించగలిగారు? నా జ్వలిత పవిత్ర హృదయమే కదా ఒంటరిగా నిలబడ్డాది. అయినా పసిడి, మంచిది వంచితురాలు. పైని నిద్రపోతున్నవాడే తనని రక్షించాడనుకొని కృతజ్ఞతలు చెప్పుకున్నది.

నీకు అంజలి ఘటించాలా? దేనికి? ఎప్పుడన్నా నీవు మనిషిని తన వ్యగ్రత నుంచి విడిపించావా? భీతావహుడయినపుడు కన్నీరు తుడిచావా? సర్వశక్తిమంతమైన కాలమే కదా నన్ను మానవత్వంలోకి నడిపించింది.

ఇప్పుడేమో నేనీ జీవితాన్ని అసహ్యించుకుని ఇంకా కలలు పండలేదని ఎడారుల్లోకి పోయి వుండాలనుకొంటున్నావా?

నేనిక్కడే నిలిచివుంటాను. నా రమ్య కల్పనతో నన్ను పోలిన మనుష్యజాతిని నిర్మిస్తాను. మనుష్యుల్ని బాధలు పడడానికి, ఏడవడానికి, అనుభవించడానికి, ఆనందించడానికి, కాని ఏనాడు నిన్ను శరణు కోరడానికి మాత్రం కాదు. నాలాగే.

# ఆఫ్రికా కవిత

(ఆఫ్రికా అని వినగానే అరణ్యాలు, నదులు, సూర్యరశ్మి, వెన్నెలపరుచుకొన్న అజ్ఞాత విశాలభూమీఖండం మనసులో మెదిలి ఒక్క క్షణంలో అది చెరిగిపోయి ఒక భీభత్సం స్ఫురిస్తుంది. మనిషిని మనిషి వేటాడినప్పటి ఆక్రందనలూ, నెత్తుటి చారికలూ ఆఫ్రికా అంతటా పరుచుకున్నాయి. ఆఫ్రికన్ కవిత వాటిలోంచి పుట్టిందే. అయితే ఒక నిరసనతో ఒక సత్యాగ్రహంతో మనిషిపట్ల అంతరాల్లో మాయని ఒక విశ్వాసంతో – డేవిడ్ డియోస్, సెనెగల్ దేశానికి చెందిన కవి)

ఆఫ్రికా

ఆఫ్రికా, నా ఆఫ్రికా
ప్రాచీన నవానా భూముల్లో తిరుగాడిన మేటి యోధుల ఆఫ్రికా
దూర నదీతీరం మీద
వృద్ధురాలయిన నా నాయనమ్మ పాటలుగా పాడిన ఆఫ్రికా
నేనెప్పుడూ నిన్నెరగలేదు
కానీ నీ రక్తం నా సిరల్లో ప్రవహిస్తోంది
ఈ భూముల్ని పండించే సుందరమైన నీ నల్లని రక్తం
నీ స్వేదం నుంచి పుట్టిన రక్తం
నీ కష్టం నుంచి స్రవించిన స్వేదం
నీ దాస్యం నుంచి కలిగిన కష్టం
నీ తరతరాల సంతతికి తప్పని దాస్యం
ఆఫ్రికా, నాకు చెప్పు ఆఫ్రికా
ఒంగిపోయిన యీ నడుం. ఇది నీదేనా
పీడనాభారం కింద నలిగి చిట్లిపోతున్న నడుం
రక్తపుచారికల్తో ఒణికిపోతున్న నడుం, పైగా
మధ్యాహ్న సూర్యుడి కింద కొరడా దెబ్బలకి తలఒంచడం
కాని ఒక సమాధి సమాధానమిస్తోంది–
పాలిపోయి వాడిపోతున్న పువ్వులమధ్య
అద్భుతమయిన ఏకాంతంలో, అక్కడ నిలబడ్డ వృక్షం
ధృఢంగా జవంతో నిలబడ్డ వృక్షం, ఉద్వేగపూరితమైన బిడ్డడు
అదీ ఆఫ్రికా నీ ఆఫ్రికా–
మొండిగా దీక్షగా అది మళ్ళీ పెరుగుతోంది
నెమ్మదిగా దాని ఫలాల్లోకి ఒచ్చి చేరుతుంది
స్వాతంత్ర్యభావనల తిక్తమాధుర్యం.

# స్పానిష్ కవిత : లోర్కా

(శక్తిమంతుడైన స్పానిష్ కవి, తను బాల్యంలో కోల్పోయిన ఆత్మని తిరిగి పొందడానికి కవిత్వం రాస్తున్నానన్నాడు. ఒక చిన్ని సెలయేరో, ఒక పురాతన ఏండలూషియన్ పాటో తనని కవుల మార్గంలోకి నడిపించిందన్నాడు. కాని, జీవితమంటే ఒక వ్యర్థమయిన కల, సమాధానంలేని వేదన అని తెలియడానికి ఎంతో కాలం పట్టలేదు. తన సన్నిహిత మానవుడి మృత్యువు తన మృత్యువుగానే తెలియవచ్చింది. జీవితాన్ని ఆవరించిన మృత్యువిషాద ఛాయా, మానవ గాయాల్లో అది క్షణ క్షణానికి పొదుగుతున్న సంతతి అతని గీతాల్లో మంద్రంగా పలుకుతాయి. కాని కవిగా అతని గొప్పదనం ఏమంటే ఒక కొమ్మ మీది వెన్నెలని ఎలా తన నిశ్శబ్దంలోకి తెచ్చుకోగలడో తన జీవితాన్నంతా మృత్యు నిశ్శబ్దంలోకి నెట్టివెయ్యనూగలడు.

వీడ్కోలు

నేను మరణిస్తే బాల్కనీని తెరిచే వుంచండి.
ఆ చిన్ని కుర్రాడు నారింజలు తింటున్నాడు
(నా బాల్కనీలోంచి అతణ్ణి చూడగలను)
రైతు తన గోధుమ పంటని కోసుకున్తున్నాడు
(నా బాల్కనీలోంచి అతణ్ణి వినగలను)

నేను మరణిస్తే
బాల్కనీని తెరిచే వుంచండి !

ఆక్రందన గీతం
నా బాల్కనీని మూసేసాను
ఏమంటే నేనా ఆక్రందనని వినలేను
కాని వెలిసిపోయిన గోడల వెనుకనుంచి
వినవస్తున్నది ఆక్రందన తప్ప మరేమీ కాదు.
పాటలు పాడగల దేవదూతలు కొద్దిమందే --
అరవగల కుక్కలు కొన్నే --
ఒక వెయ్యి వయోలిన్‌లూ నా అరచేతిలో యిముడుతాయి
కాని ఆ ఆక్రందన ఒక వూహకందనంత జంతువూ
ఆ ఆక్రందన ఊహకి మించినంత దేవదూత
ఆ ఆక్రందన ఊహకి పట్టనంత వయోలిన్
ఆ అశ్రువులు గాలిని ఆటంకపరుస్తున్నాయి
ఆ ఆక్రందన తప్ప మరేమీ వినరాడం లేదు.

## ఫ్రెంచి కవిత : బాద్లేర్

(పాపపంకంలో విరిసిన పద్మం. వ్యర్థత్వంలో, అర్థం లేని వ్యధలో క్షీణించిపోతున్న జీవితపు అగాధాలనుంచి మానవ ప్రపంచాన్ని కావిలించుకొనే ప్రయత్నాలు చేసిన కవి ప్రేమ కాని, సౌందర్యం కాని, సిన్ కానీ, తిరుగుబాటుకానీ ఏవీ వ్యధని నిర్మూలించలేవు సరికదా మరింత వ్యధలో పడేస్తాయనీ, మృత్యువొక్కటే మనిషికి పరిపూర్ణముక్తిని కలుగచేస్తుందని నమ్మి చావు ద్వారా బతుకుని అనుభవించినవాడు. వెలుతురు సంగతి మనకేమీ తెలీదు. కాని అతను చీకటిని చూసాడు. పారిస్‌లోని ప్రముఖ పత్రికాధిపతులూ, రాజకీయనాయకులూ కనీసం ఆ పని కూడా చెయ్యలేకపోయారు అంటాడు ఇలియట్. ఆధునిక కవిత్వానికి ఆధునిక జీవితానికీ మధ్య సరిహద్దులు చెరిపివేసిన మహాకవిగా అతను స్మరించబడాలి.)

### మనిషీ, సముద్రమూ

మనిషీ! ఎల్లప్పుడూ నువ్వా విశాల సముద్రాన్ని బతికించుకుంటూనే వుంటావు
నువ్వు నీ ఆత్మని మననం చేసుకునే ప్రతీక అయిన సముద్రాన్ని
దాని ఉధృత తరంగాలు చుట్టబెడుతున్న కొద్దీ మరింత విస్తృతంగా-
నీ మనసో చేదుగా ఆవులిస్తున్న ఓ అగాధం.
నువ్వు నీ ప్రతీకలోతుల్దాకా దూకాలని మోహనపడతావు.
నీ కళ్ళతో చేతుల్తో దాన్ని కావిలించుకుంటావు. కాని
ఆ భీకర సముద్రపు జీవరహిత వేదనాభరిత గర్జనలో నీ హృదయం
తన దుఃఖం నుంచే పక్కకు మళ్ళిపోతుంది.
మీరిద్దరూ చీకట్లలో అంతుపట్టని మర్మంలో బతుకుతారు
మనిషి నీ అస్తిత్వాగాధాల లోతుల్లోకి ఇంతదాకా ఎప్పుడన్నా ఎవరు దూకగాలిగారు
ఓ సముద్రమా! గొప్ప అసూయతో నువ్వు నీలోదాచుకొనే విచిత్ర రహస్యాల్ని
నీ అజ్ఞాతమయిన సొంతఐశ్వర్యాల్నీ ఎవరు మాత్రం చూడగలిగారు?
అయినా, లెక్కలేనన్ని యుగాలుగా విరామంలేని హస్తాల్తో
అసహనపు శ్వాసతో మీరు ఒకరితో ఒకరు పోరాడుకుంటున్నారు
అవిశ్రాంతమయిన తన సహచరుడికి తనే నిరంతరమైన శత్రువుగా
వధించుకోవడానికీ చావడానికీ మరింత ఆబగా మీరిద్దరూ.

## గ్రీక్ కవిత : జార్జ్ సెఫారిస్

(ఆధునిక గ్రీకుకవితావాణికి ఆద్యుడు, సంయమనాత్మక వ్యంగ్యం, ధ్వని పలికే కవిత్వం. ఆధునిక గ్రీకు కవిత సంస్కృతంలానే కొత్త జీవనధోరణుల్ని పలకాలన్న ప్రయత్నాలు చేస్తుంది. హోమర్‌ని ఇవాల్టి కళ్ళతో చూసి ఒడిస్సీ గాధని మళ్ళీ కొత్తగా పలకడానికి సిద్ధపడింది. భిన్నకాలాలు అనేకస్థాయిల్లో కలిపి గొంతు విప్పడం, వాటిల్లో ఒక ఏకత కన్పించడం ఆధునిక గ్రీకు కవిత్వపు విశిష్టత.)

సంతోషపు విరామం

ఆ పొద్దున్నంతా మేం ఆనందంగా ఉన్నాం. దేవుడా, ఎంత ఆనందమని.
మొదట రాళ్ళూ, ఆ వెనుక ఆకులూ ప్రకాశించాయి.
ఇంకా అప్పుడు సూర్యుడు నిండా ముళ్ళతో పెద్దసూర్యుడు, కాని ఎంతో ఎత్తున, స్వర్గంలో.
అప్పుడొక వనదేవత ఆ విద్రోహ వృక్షాల అరణ్యంలో
మా ముద్దులన్నీ ఏరుకుంటూ చెట్లకు తగిలిస్తోంది
దేవతలేమో పాటలు పాడి ఆటలాడారు
నల్లని వృక్షజాలం మధ్య చిన్నపిల్లల దేహాల రోజారంగు అవయవాలు
తళతళలాడుతున్నాయి
ఆ పొద్దున్న మేం ఎంత ఆనందంగా ఉన్నాం
వూడిపోతున్న పాడునూతి అగాధపు అంచున
ఆ వనదేవత, యువతి, తన కోమలమయిన పాదాన్ని ఆన్చింది
ఆమె మందహాసం గుర్తోస్తోందో? ఎంత ఆనందం
అప్పుడు మేఘాలు వర్షించాయి. భూమి పంకిలమయింది.
నువ్వు నవ్వటం కట్టిపెట్టి ఓ కుటీరంలో దూరి
క్రోధాగ్ని ఖడ్గం చూస్తున్న మహాధిదేవతని సంభ్రమంగా చూసావు.
"అదేమిటో నేను వివరించలేను" నువ్వే అన్నావు "నేను దాని వివరించలేను"
నాకు మానవజాతి అర్థం కావటం లేదు
ఎన్ని రంగులు పెట్టుకొని ఎంతగా అతను ఎన్ని ఆటలాడనీ
మనిషి మాత్రం ఎల్లప్పుడూ నలుపే"

## లాటిన్ అమెరికా కవిత : నెరుడా

(చిలీ ప్రజల ఆశల్నీ, స్వాతంత్ర్య పిపాసనీ స్పానిష్ లో పలుకుతూ తన పద చిత్రాల ద్వారా లాటిన్ అమెరికాని ఆవిష్కరిస్తూ, శ్రామిక విజయాన్ని ప్రకటిస్తూ మనిషికీ విశ్వానికీ మధ్య బాంధవ్యాల్ని మానవతా సంవేదనల్తో ప్రకటించిన యోధుడు. సమరశీలమైన, చైతన్యవంతమైన, ధృక్పధనైశిత్యం కలిగిన ఆధునికపు కవిగా అతను అన్ని సముద్రాల మీంచి ఒక గర్జించే పవనంగా వీచాడు. కసి, వ్యంగ్యం, అవహేళన -- వీటివెనుక అశ్రువులు, అనాధల రోదన, వెన్నాడే వేదన -- ఇవి తన దేశపుగాలుల్లో పూలల్లో పసిపాపల నవ్వుల్లో పలికించడానికి ప్రయత్నించే ఒక వీరుని ప్రతీక నెరూడా.)

ప్రాచ్య ప్రపంచంలో మతం

అక్కడ రంగూన్ లో బోధపడింది నాకు, దేవతలంతా కూడా
దేవుడిలాగే
వేదమానవుడి శత్రువులేనని
దేవతలు
పాలరాతిలో తెల్ల తిమింగిలాల్లా పరుచుకున్న వాళ్ళు
లోహపుమొనల్లా తళతళ మెరిసేవాళ్ళు
జన్మించడంలోని పాపాన్ని చుట్టచుట్టుకు పడుకున్న సర్పదేవతలు
తన దారుణమయిన శిలువపైని క్రీస్తులాగే
శూన్య అనంతత్త్వపు కాక్‌టెయిల్ పార్టీని
చూస్తో హసిస్తూన్న సొగసయిన నగ్న బుద్ధమూర్తులు
మొత్తమంతా దేనికయినా సమర్ధులు
మనమీద వాళ్ళ స్వర్గాన్ని రుద్దడానికీ,
హింసించయినా, బెదిరించయినా
మన భక్తిని కొనుగోలు చెయ్యడానికీ, మన నెత్తురు మరిగించడానికీ,
మనుషులు తమ పిరికితనం కప్పిపుచ్చుకోడానికి
తయారుచేసిన ఉగ్రదేవతలు
అక్కడ అంతా అలాగే ఉంది.
అసలు మొత్తం ప్రపంచమే స్వర్గంతోనూ
స్వర్గంతాలూకు బేరసారాల్తోనూ కంపుకొడుతోంది.

# సమకాలీన కవిత

(వేగవంతమూ, సాంకేతికమూ అయిన ప్రస్తుత కాలంలో కవిత్వం స్థానం గురించి ఆందోళన సహజం. కాని, కవిత్వం అంతకంతగా నిశితంగానూ, లోతుగానూ, జీవిత పోరాట వ్యక్తీకరణగానూ పుష్పిస్తూనే ఉంది. యాంత్రిక సాధనాలు శబ్దాన్ని మాత్రమే ప్రసరింపచేస్తాయి. ఇప్పటికీ కవిత్వమే సాంకేతికంగా భావప్రకటనకి అత్యున్నత సాధనం. నేటి కాలపు విమర్శకుడు డి.జె.ఎన్‌రైట్ గొథేని గుర్తుకు తెస్తూ ప్రపంచం నుంచి విముక్తం కావడానికైనా, దానితో మరింత బంధాలు బలపడ్డానికైనా కవిత్వమే శరణ్యం అనీ, సమకాలిక కవిత ఆ ప్రయత్నమనే అంటాడు. వెస్ట్ ఇండియన్ కవుల్లో ప్రతిభాశాలి ఎడ్వర్డ్ బ్రాత్ వైట్ ని ఇందుకు ఉదహరించవచ్చు)

ప్రశాంత సంగీతం

ఇప్పుడు ఎక్కడ వెచ్చని పావనం ప్రసరిస్తుందో
ఎక్కడ గడ్డి పోచలు కువకువలాడతాయో
ఎక్కడ మధుపూరిత నికుంజాలు పుష్పిస్తాయో
అక్కడికి తీసుకురా నన్ను

ఎక్కడ చేపలు పట్టేవాడి వలలా
తరుశాఖలు వీచే గాలుల్ని మధురం కావిస్తాయో
అక్కడికి

ఎక్కడ పనివాళ్ళు ఒకింత విశ్రాంతి పడతారో
ఎక్కడ నదులుంటాయో,
ఎక్కడ దారిపక్క మోడుపయిని కూచుని
అపరిచిత పాంథ గాయకుడు
తన తంత్రీ వాయిద్యంపైని ప్రశాంత స్వప్నాల్తో
మైమరుస్తాడో అక్కడికి.

# ప్రొలిటేరయట్ కవిత

భూమ్మీద శ్రామికులందరి జీవితమూ ఒకటే. వాళ్ళని జాతి, భాష, సంస్కృతీ ఏవీ విడదియ్యలేవు. వసుధైక కుటుంబాన్ని, ఏనాటికైనా నిర్మిస్తే వాళ్ళే నిర్మించాలి. మనుష్య సమాజం స్పష్టంగా ఆటే ప్రయాణిస్తోంది. శ్రామిక కవిత్వం ఆ యాత్రనే పాడుతుంది. ఆ అవగాహనకి సూచికగా ఈ కవిత. కవి లాజస్ కొసక్ స్వయాన శ్రామికుడు. ఆధునిక హంగేరియన్ సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నాడు)

ఒక కార్మికుడి చిత్రం

ఈ శిరస్సు తన ప్రతిరూపంగా దేవుడు నిర్మించింది కాదు
ఈ శిరస్సు తన గతపు జ్ఞాపకాల్తోను, వర్తమానపుసందేహాల్తోనూ నలిగిపోయింది
ఈ శిరస్సులో విప్లవబీజాలు అంకురిస్తాయి
ఈ శిరస్సు బహుకాలంగా వధ్యశిలపైన హాజరవుతూనే వుంది ఒంటరిగా
ఈ హస్తాలు సృష్టి చైతన్యం చేత నిర్దేశితమవుతున్నాయి
ఈ హస్తాలు ఎడమనుంచి అనుగ్రహించబడుతూ కుడివైపు శపింపబడుతున్నాయి
ఈ హస్తాలు కిందికి మోదుతాయి, పైకి లేవనెత్తుతాయి
ఈ హస్తాలు సంకెళ్ళు ఒదిలిపోయిన మచ్చల గుర్తుల్ని చూపిస్తాయి
ఈ హస్తాలు రక్తపాతాన్ని చూసి ఒణికిపోయినవి.

ఈ పాదాలు నారింజతొక్కలమీద జారిపడేవి కావు
ఈ పాదాలు పశ్చిమాన్ని ప్రాచ్యానికి కలుపుతాయి
ఈ పాదాలు క్రూరసర్ప సప్తఫణుల్నీ కూలదోస్తాయి
ఈ పాదాలు శిరస్సు కలలుకంటున్న భూమివైపు దారితీస్తాయి

ఈ హృదయం నియంతల ఆయుధాలకి గాయపడింది
ఈ హృదయం తన చితాభస్మం నుంచే తిరిగి తిరిగి ప్రాణం పోసుకుంటుంది,
ఈ హృదయం నా హృదయం కవలపిల్లలు
ఈ మనిషి నాలాంటి మనిషే
ఈ ఆకాశం క్రిందనే గొంతుకలిపి పాడతాం మేం
ఊడ్పులప్పుడు పంటల కోతలప్పుడూ పాడే ఆ పాటనే.

సజీవమైన మనిషి కేంద్రంగా, ఇవాళ మనం జీవితాన్ని, సాహిత్యాన్నీ కూడా అల్లుకోవాల్సి వుంది. పదిహేడో శతాబ్ద ఖగోళ శాస్త్రం నుంచి జీవశాస్త్రం, మనశ్శాస్త్రం మీదుగా మానవశాస్త్రం వైపుగా సాగుతున్న విజ్ఞానయాత్ర ఈ మాటే చెప్తోంది. ఆధునిక కవి నిజానికి ఆధునిక మానవుడే. అతను ప్రాచీన ఆటవిక గాయకుడివలె, మధ్య యుగాల సూఫీ సాధువువలె, క్యూబిస్ట్ చిత్రకారుడివలె, చార్లీచాప్లిన్ వలే, నీగ్రో కవివలె, ఒక సాధారణమయిన గృహిణివలె, రైతువలె... ఉంటాడు. మానవ సమాజం సాధిస్తున్న మహా విజయాల్లోనూ నిర్మాణాల్లోనూ కాక, అతని ఏకాంత క్షణాల నిశ్శబ్దంలో మాత్రమే ఆధునిక జీవన సంగీతాన్ని మనం వినగలం. అది భ్రాంతి రహితమైన అస్తిత్వపు కాలాతీత సంగీతం కూడా. ఆధునిక జీవితానికి, ఆధునిక కవిత్వానికి మధ్య సరిహద్దు చెరిపేదే ఈ ప్రయత్నం.